వసంత్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

11న ఇస్లామాబాద్‌లో అమెరికా, ఇరాన్ చర్చలు 5
ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు 7

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 156 పేజీలు: 10+4 వెల: 6.50

జీరామ్‌జీ అమలు కోసం

## 25,863 కోట్లు విడుదల



### సకాలంలో వేతనాల చెల్లింపు, సజావుగా అమలు

### పారదర్శకత, గ్రామీణ ఉపాధి విస్తరణ చేయాలి

### రాష్ట్రాలకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచన

**న్యూఢిల్లీ, జులై 5:** 'వికసిత్ భారత్–గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి జి రామ్‌జి) పథకం అమలు కోసం కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం రూ.25,863 కోట్ల మొదటి విడత నిధులను విడుదల చేశారు. విబి జి రామ్‌జి పథకం అమలులో భాగంగా ఉన్న ఈ నిధులను, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి మంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా విడుదల చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన సమావేశంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించేలా రాష్ట్రాల వద్ద తగిన నిధులు ఉండేలా చూడటమే ఈ మొదటివిడత విడుదల ఉద్దేశమని పేర్కొన్నారు. వేతనాల చెల్లింపులో ఎటువంటి జాప్యం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ తమ వాటా నిధులను సకాలంలో విడుదల చేయాలని ఆయన కోరారు. జులై 1 నుండి దేశవ్యాప్తంగా ఎటువంటి అంతరాయం లేకుండా విబి జి రామ్‌జిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకం విజయవంతంగా ప్రారంభమైందని, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ నుండి విబి జి రామ్‌జికి మారే ప్రక్రియ సజావుగా, ఎటువంటి సమస్యలు లేకుండా జరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎటువంటి సాంకేతిక లేదా నిర్వహణ పరమైన సమస్యలు నమోదు కాలేదని తెలిపారు. మొదటి వారంలోనే పెద్ద సంఖ్యలో



>>2

# ఇంత జాప్యమా?





### ఖట్టర్‌జీ! 'మెట్రో'పై వెంటనే ప్రత్యేక చొరవ తీసుకోండి

### కిషన్‌జీ! వ్యక్తిగతంగా జోక్యం చేసుకోండి

### ఫేజ్-1 బదలీ ప్రక్రియలో తొలగని అనిశ్చితి

### కేంద్ర మంత్రులకు సిఎం రేవంత్ వేర్వేరుగా లేఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై5:** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డికి, మనోహర్ లాల్ ఖట్టర్‌కు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేర్వేరుగా లేఖలు రాశారు. గత నెల 23,24 తేదీలలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రైలు ఫేజ్2 విస్తరణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలపాలని ఖట్టర్‌కు రాసిన లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. అలాగే ప్రస్తుతంఅమలులో ఉన్న హైదరాబాద్ మెట్రో ఫేజ్1ను తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అభ్యర్థించారు. ఈ రెండు అంశాలు పరస్పరం ముడిపడి ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆలస్యం చేయొద్దని లేఖలో అభ్యర్థించారు. ఆలస్యం చేయడం వల్ల ప్రాజెక్టు అమలు, దెబ్బతింటుందని, వ్యయం కూడా గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని లేఖల్లో ప్రత్యేకంగా వివరించారు సీఎం రేవంత్ రెడ్డి. గత నెల జూన్ 24వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డితో పాల్గొన్న సమావేశాల్లో హైదరాబాద్ మెట్రో ఫేజ్1, ఫేజ్2 అంశాలపై విస్తృతంగా చర్చించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ప్రత్యేకంగా గుర్తు చేశారు. ఆ సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఇప్పటికీ అమలులోకి రాకపోవడం పట్ల సీఎం రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు.

జూన్ 24వ తేదీన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సంస్థ ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీకి అవసరమైన ఆర్థిక పరిశీలన వంటి కీలక బాధ్యతలు అప్పగించాలని అంగీకరించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రస్తుతం ఫేజ్1పై ఉన్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే (రిఫైనాన్సింగ్) అవకాశాలను కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిశీలించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్2 నిర్మాణానికి భారీ స్థాయిలో నిధులు అవసరమవుతాయని, అందువల్ల అదే సంస్థ ఫేజ్2కు అవసరమైన ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాల సమీకరణ, నిధుల సమీకరణ మార్గాలు, ఆర్థిక వ్యూహం కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్లు సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఫేజ్1 ప్రాజెక్టు విలువ నిర్ధారణ, రుణాల పునర్వ్యవస్థీకరణ, ఫేజ్ 2 నిధుల సమీకరణ వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించేలా టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) రూపొందించాలని కేంద్రాన్ని కోరారు. ఈ ప్రక్రియ సమన్వయం కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించిందని కూడా

>>2

ముంబయిని ముంచెత్తిన

## భారీ వర్షాలు

గుజరాత్, ఢిల్లీల్లోను అతిభారీ వర్షాలే

చెట్టుకూలి ముకేష్ అంబాని కాన్వాయ్‌కి త్రుటిలో తప్పిన ప్రమాదం

3



## 100% దేశంలోనే తొలి సౌర మండలం కొడంగల్

**5,186 విద్యుత్ కనెక్షన్లకు సోలార్ అనుమతులు**

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** దేశంలోనే తొలి సోలార్ మండలంగా తెలంగాణలోని కోడంగల్ నిలువబోతోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా కోడంగల్ మండలంలో గృహజ్యోతి పథకం కింద నూరు శాతం 5,186 విద్యుత్ సర్వీస్

>>2



## కెల్విన్ వేవ్

సముద్రం అడుగున 14,500 కి.మీ.

భారీ ఉష్ణ ప్రవాహం

గుర్తించిన 'నాస్తా..

పర్యవేక్షిస్తున్న 'సెంటినెల్ 6'

శీతాకాలం నాటికి బలంగా మారే అవకాశం

3




ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో మహిళ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా

## ఆ దొంగలు ఆరెస్సెస్ నేతలే

### ఓటు చోర్ సర్కార్‌పై 20 నుంచి ఉద్యమం

### నారీశక్తి వందన్ బిల్లు తక్షణమే అమలు చేయాలి

### మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా

**హైదరాబాద్, జూలై5, ప్రభాతవార్త:** రామనామ జపంతో అధికారంలోకి వచ్చిన బిజెపి చివరకు దేశంలోని రాముని భక్తుల మనోభావాలకు గాయం అవుతుందని కూడా ఆలోచించకుండా రామమందిరంలో కోట్లది భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన నగదు కానుకలను కొల్లగొట్టి ప్రజల సెంటిమెంట్‌తో చెలగాట మాడతున్నారని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబా ఆరోపించారు. గాంధీ భవన్‌లో ఆదివారం మహిళ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా మాట్లాడుతూ అయోధ్య రామమందిరంలో దొంగతనం జరిగితే ఎందుకు ప్రధాని మాట్లాడటం లేదనీ ప్రశ్నించారు. అయోధ్యలో ఆలయంలో ఉన్న నేతలు ఆర్ఎస్ఎస్ వాళ్లు కాదా అని అడిగారు. బిజెపి సర్కార్ చందా చోర్ సర్కార్ బిజెపి సర్కార్ ఓటు చోర్ సర్కార్ అంటూ జూలై 20 నుంచి ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా పోరాటం చేయనున్నామనీ ప్రజలకు కేంద్రం అనుసరిస్తున్న ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలు, మతం పేరుతో దేవుడిని కూడా దోచుకుంటున్న వైనం వివరించి పెట్టుబడిదారులకు మాత్రమే కొమ్ముకాస్తున్న ఈ ప్రభుత్వంపై అవగాహన కల్పిస్తామని ఆమె తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి సర్కార్ మహిళా వ్యతిరేక సర్కార్ అని మండిపడ్డారు నారిశక్తి వందన్33 రిజర్వేషన్ బిల్లుతక్షణమే అమలు చెయ్యాలనీ

>>2

## కాళేశ్వరం ఒక వరం



ప్రాజెక్టు సందర్శించిన అనంతరం మీడియాతో కెటిఆర్

### రైతుల ఆత్మహత్యలు తగ్గాయి..

### ఆ ప్రాజెక్టు వల్ల పెరిగిన వరి ఉత్పత్తి

### అడ్డంకులను దాటి కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వెళ్లిన కెటిఆర్

### అప్రోచ్ కెనాల్‌ను పరిశీలించిన బిఆర్ఎస్ నేతల బృందం

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, జులై 5, ప్రభాతవార్త:** తెలంగాణ రైతంగానికి కాలేశ్వరం ప్రాజెక్టు ఒక వరం. కాలేశ్వరం వల్ల నేడు తెలంగాణలో వరి ధాన్యం ఉత్పత్తి పెరిగిందని కేటీఆర్ అన్నారు. రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి పెరిగి రైతు ఆత్మహత్యలు తగ్గాయి. పంజాబ్ హర్యానా రాష్ట్రాల కంటే వరధాన్యం తెలంగాణలో పెరగడం అది కెసిఆర్ ఘనతని కేటీఆర్ అన్నారు. ఆదివారం ఉమ్మది వరంగల్ జిల్లా భూపాలపల్లి లోని మెడిగడ్డ కాలేశ్వరం, కన్నెపల్లి పంప్‌హౌస్ అప్రోచ్ కెనాల్‌ను కేటీఆర్, బీఆర్ఎస్ నేతల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ వద్దకు రాజకీయంగా విమర్శించండి. అడ్డంకులను దాటుకుని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దకు వచ్చామని చెప్పారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని కిందకు వదిలేస్తున్నారన్న కేటీఆర్, కేసీఆర్ బీడు భూములకు నీళ్లు ఇవ్వాలనే ఆలోచన ఉందని తెలిపారు. గతంలో కేంద్రం,

>>2

## ప్రజలకు ముప్పు



హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి ఉత్తమ్

### కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు నింపితే భద్రాచలంతోపాటు 40 ఊళ్లకు గండం

### లోపభూయిష్టంగా మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం

### నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్

**హైదరాబాద్,జూలై 5,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌కు చెందిన మేడిగడ్డ,అన్నారం, సుందిళ్ళ బ్యారేజిలలో నీళ్ళు నింపితే భద్రాచలంతోపాటు నలుబై ఊళ్ళకు గండం పొంచిఉందని భద్రాచలం కొట్టుకొని పోతుందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భయాందోళన వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పునాదులు తప్పుగా బలహీనంగా లోపభూయిష్టంగా నాసిరకమైన మెటిరియల్‌తో చేపట్టిన నిర్మాణాలనీ,పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ఆయన ఆరోపించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో బిఆర్ఎస్ ఉద్దేశ్యపూర్వకంగా ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని శాస్త్రీయ పద్ధతిన బ్యారేజిలు పునరుద్దరణ చేసిఎన్‌డిఎస్‌ఎ అధికారులు భద్రతను

>>2

## 2028లో సిఎం కుర్చీ బిసిలకే

రాజకీయ ఆధిపత్యాన్ని బద్దలు కొడతాం

టిఆర్‌పి అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న

వేలాదిగా తరలివచ్చిన బిసి, బహుజన శ్రేణులు

7

సెల్‌ఫోన్ లైట్‌తో

## 90 కి.మీ నడిచిన బస్సు

కల్బుర్గి నుంచి తెలంగాణ సరిహద్దులోని చించోలి వరకు చీకటిలోనే..

విచారణకు కర్ణాటక సర్కార్ ఆదేశం

2



## ప్రైవేట్ బస్సు ఢీకొని నలుగురు మృతి

### తల్లి, ఇద్దరు పిల్లలతోపాటు కుటుంబసన్నిహితుని దుర్మరణం

### చిట్యాల మండలంలో దుర్ఘటన



చిట్యాల మండలంలో ప్రమాదానికి గురైన కారు

**చిట్యాల రూరల్, జూలై 5, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్65)పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

>>2

సూపర్ ఎల్ నినో ఎఫెక్ట్..

## 10.20 లక్షల ఎకరాలు తగ్గిన సాగు



### ఈ యేడాది 33 లక్షల ఎకరాలకే పరిమితం

### వర్షాభావంతో కోతపడిన వరి, మొక్కజొన్న

### లోటు వర్షపాతం, అడుగంటిన భూగర్భ జలాలు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** వానాకాలం ప్రారంభమై నెల రోజుల దాటినా ఎల్‌నినో ఎఫెక్ట్ కారణంగా వర్షాలు మాత్రం ఆశాజనకంగా లేవు. పలు ప్రాంతాల్లో వర్షాభావ ఛాయలు అలముకుని పంటల సాగును ముందుకు సాగనీయడం లేదు. చాలా జిల్లాల్లో జూన్ మాసంలో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. వర్షాలు సమృద్ధిగా కురిసి ఉంటే ఇప్పటికే పంట పొలాలు రైతులు, కూలీలతో కళకళలాడేవి. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. మొత్తానికి పచ్చగా ఉండాల్సిన పంట పొలాలన్నీ బోసిపోయాయి. కొన్ని చోట్ల వేసిన నాట్లు,

>>2



ముంబయిలో ఆదివారం భారీ వర్షానికి నేలకొరిగిన చెట్టు

# ప్రైవేట్ బస్సు ఢీకొని నలుగురు మృతి

>>పాలవగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమార్తె, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, వారితో ప్రయాణిస్తున్న కుటుంబ సన్నిహితుడు, సినీ పరిశ్రమలో ఫిల్మ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కట్టా శ్రీకర్ ప్రసాద్ కూడా ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు తీవ్ర గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి సీఐ సిరికొండ సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన మలిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, ఆయన భార్య విజయలక్ష్మి (40), కుమార్తె శ్రీయ (17), కుమారుడు ప్రభవ్ (12), కుటుంబ సన్నిహితుడు, హైదరాబాద్ గుండ్లపోచంపల్లికి చెందిన సినీ పరిశ్రమ ఫిల్మ్ ఎడిటర్ కట్టా శ్రీకర్ ప్రసాద్ (62) వ్యక్తిగత పనుల నిమిత్తం చెన్నై వెళ్లి ఏపీ09సీఆర్0010 నంబర్ గల వెర్నా కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4.40 గంటల సమయంలో పెద్దకాపర్తి గ్రామ శివారులోని పెద్దచెరువు సమీపానికి చేరుకోగానే, వైజాగ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒడి18క్యూ6786 నంబర్ గల అర్షియా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి అతివేగంగా వచ్చి కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రతకు కారు చుట్టూ తిరుగుతూ డివైడర్‌ను ఢీకొని పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి, ఆమె కుమార్తె శ్రీయ, కుమారుడు ప్రభవ్, కుటుంబ సన్నిహితుడు కట్టా శ్రీకర్ ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న వీర వెంకట నాగవర ప్రసాద్ బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమా దాన్ని గమనించిన వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి చిట్యాల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మామిడి రవికు మార్, ఏఎస్ఐ జాన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా ధ్వంసం కావడంతో మృతదేహాలు, గాయపడిన వ్యక్తి లోపలే ఇరుక్కుపోయారు. దీంతో జేసీబీ, క్రేన్ సహాయంతో కారు పైభాగాన్ని, డోర్లను తొలగించి తీవ్రం గా శ్రమించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబును అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మలిరెడ్డి వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు, మృతులు విజయలక్ష్మి, శ్రీయ, ప్రభవ్‌ల స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ లోని శ్రీరాంనగర్ కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ మధురానగర్‌లో నివాసముంటుండగా, శ్రీకర్ ప్రసాద్ హైదరాబాద్ లోని గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్నారు. గాయపడిన వీర వెంకట నాగవర ప్రసాద్ బాబు గతంలో ఎస్‌బీఐలో మేనేజర్‌గా పని చేసి, ఇటీవల పదోన్నతిపై వికారాబాద్‌కు బదిలీ అయినట్లు తెలిసింది. ప్రమాదం కారణంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ఎన్‌హెచ్ ఏఐ సిబ్బంది క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన కారును రహ దారి పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ఆ దొంగలు ఆరెస్సెస్ నేతలే

>> ఈ నెల 25న ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ధర్నా చేయనున్నామనీ చెప్పారు. మహిళ రిజర్వేషన్ బిల్లు లో ఒబిసి లకు అవకాశం కల్పించాలనీ ఆమె కోరారు. బిజెపి ఎమ్మెల్యే,నేతలు చిన్న పిల్లలపై హత్యాచారం చేస్తున్నారనీ ఆవేదనచెందారు. పేపర్ లీక్ చేసి విద్యార్థులు జీవితాలతో చెలగాటం ఆడుతున్నారనీ, కేంద్ర విద్య మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పరీక్షలు సరిగా నిర్వహించడంలో విఫలం అయ్యారనీ దీనివల్ల ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలతో అర్థాంతరం బలవన్మరణంతో తనువు చాలించారని ఆగ్రహం వ్యక్తంచేశారు, ఆపరేషన్ సింధూర్ పై రాజ్ నాథ్ సింగ్ పార్లమెంట్లో అబద్ధాలు ఆడారనీ తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ 3 నెలల నుండి 19 జిల్లాలలో సమావేశాలు నిర్వహించారనీ కొనియాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ పాలన పట్ల మహిళలు సంతోషంగా ఉన్నారనీ కితాబునిచ్చారు. మహిళ సాధికారత కోసం కృషి చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణలో 1,16వేలకు పైగా మహిళా నేతల సభ్యత్వాలు నమోదు అయ్యాయనీ ప్రకటించారు. మహిళా కాంగ్రెస్ నేతలకు సెప్టెంబర్ నెలలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామనీ తెలిపారు . కేంద్రంపై నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణ మహిళ కాంగ్రెస్ ప్రధానికి పోస్ట్ కార్డ్ ద్వారా ఉద్యమం చేపట్టి నిరసన తెలియజేస్తారని తెలిపారు. అంతే కాదు కేంద్రం ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతన వ్యక్తం చేయడానికి 9133400200 మిస్ కాల్ ఉద్యమం కూడ చేపట్టామనీ వివరించారు.

అంబెద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మనువాద రాజ్యాంగం అమలుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విన్యాసాలను న్యాయమూర్తులు వ్యతిరేకిస్తున్నారనీ లంబా తెలిపారు.

# తొలి సౌర మండలం కొడంగల్

>>కనెక్షన్లకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) కోడంగల్ మండలాన్ని దేశంలోనే మొట్టమొదటి సోలార్ మోడల్ మండలంగా మార్చేందుకు ఒక ప్రణాళికను రూపొందించింది. అందుకు సంబంధించిన కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికే ఉన్న మోడల్ సోలార్ గ్రామాలకు అతీతంగా, ఒక మండలం మొత్తాన్ని పూర్తిగా సౌరశక్తితో నడిచేలా చేయడమే లక్ష్యంగా ఈ ప్రక్రియను ప్రారంభించింది. కోడంగల్ మండలంలో గృహజ్యోతి పథకం కింద 5,186 ఉచిత విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు ఉండగా, వాటికి రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుమతులు మంజూరు చేసింది.

వీటిలో 2,418 కనెక్షన్లు సాంకేతికంగా అనుకూలమైనవిగా గుర్తించగా, సుమారు 2,000 రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన ఇన్‌స్టాలేషన్‌లను వచ్చే నెలలోగా పూర్తి చేసేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

# 25,863 కోట్లు విడుదల

>> గ్రామ పంచాయతీలలో పనులు ప్రారంభమయ్యాయని, లక్షలాది మంది గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించబడిందని మంత్రి చెప్పారు. మొదటి రోజే భారీగా ఉపాధి అవకాశాలను కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో కూడా వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లను కోరారు. అలాగే జార్ఖండ్ ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించి, అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌బిఐ ఖాతాలు లేదా ఇతర లాంఛనాలు ఇంకా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలు వాటిని నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని కూడా సూచించారు. గ్రామీణ కార్మికులకు గౌరవప్రదమైన ఉపాధి, సకాలంలో వేతనాల చెల్లింపు, దీర్ఘకాలిక గ్రామీణ ఆస్తుల కల్పనను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకం అమలులోకి రావడానికి దాదాపు మూడేళ్లు పట్టినప్పటికీ, విబి జి రామ్‌జి పథకం మాత్రం ఒక్క రోజులోనే దేశవ్యాప్తంగా ప్రారంభించబడిందని చౌహాన్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం, రాష్ట్రాల సహకారం, దేశ పరిపాలనా సామర్థ్యం కారణంగానే ఈ గొప్ప విజయం సాధ్యమైందని ఆయన అభివర్ణించారు.

విబి జి రామ్‌జి కింద వేతన రేట్లు సగటున దాదాపు 10 శాతం పెంచబడ్డాయని, ఇకపై దేశంలోని ఏ రాష్ట్రంలోనూ రోజువారీ వేతనం రూ.300 కంటే తక్కువగా ఉండదని ఆయన తెలిపారు. గ్రామీణ కార్మికుల ఆదాయం, సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. విబి జి రామ్‌జి పథకం సమర్థవంతమైన అమలుకు నిధుల కొరత ఉండదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రాల నుండి వచ్చిన డిమాండ్ ఆధారంగా మొదటి విడత నిధులు విడుదల చేయబడ్డాయి. సమ్మిళిత, భాగస్వామ్య గ్రామీణ అభివృద్ధిని సాధించేందుకు, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ఎంపిక చేసుకోవాలని గ్రామ సభలు, గ్రామ పంచాయతీలకు ఆయన సూచించారు. పారదర్శకత, జవాబుదారీతనంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఫేస్ అథెంటికేషన్ (ముఖ గుర్తింపు), జియోట్యాగింగ్, ఇతర సాంకేతిక చర్యలను పూర్తిగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ పథకంలో ఎటువంటి అక్రమాలకు లేదా మోసాలకు తావులేదని, పారదర్శకత, విశ్వసనీయత, నాణ్యమైన ఆస్తుల సృష్టిని నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు.

## వారం - వర్జ్యం

06-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
షష్ఠి మ.1.43, పూర్వాభాద్ర సా4.03
వర్జ్యం : రా.1.45-రా.3.22
దు.మ.12.38-మ.1.30,
2)మ.3.15-సా.4.07
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** నిర్మాణ సంబంధమైన లోన్లు మంజూరవుతాయి. ఆర్థికపరమైన సర్దుబాటులను అద్భుతముగా చేయగలుగుతారు.

**వృషభం:** విదేశములకు సంబంధించిన యత్నములకు ఇతరులకు పరపతిని నమ్ముకోవడం కన్నా స్వయంకృషి చేయడం మంచిది.

**మిథునం:** మానసిక శారీరక శ్రమ అధికమవుతుంది. ఫలితాలు కూడా లాభసాటిగానే ఉంటాయి. బంధువుల కలయిక.

**కర్కాటకం:** మీలోని వ్యక్తిగత ప్రతిభ, మంచితనము, కష్టపడి పనిచేసే తత్త్వము కార్యాలయములో గుర్తింపునకు నోచుకుంటాయి.

**సింహం:** దీర్ఘాలోచనల కన్నా సమయస్ఫూర్తితో వెనువెంటనే తీసుకునే నిర్ణయాల వల్ల లాభపడతారు.

**కన్య :** సంతానం వలన మానసిక శాంతి గోచరిస్తోంది. ఉన్నతావకాశములు లభిస్తాయి. వాహనసౌఖ్యం ఏర్పడుతుంది.

**తుల :** పరిస్థితులకు అనుగుణంగా మీ అభిరుచులను మార్చుకోగలుగుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** మాటల వరకే కోపమును పరిమితము చేయటం వలన లాభపడతారు. ఎగుమతి ఆర్డర్లు అనుకూలిస్తాయి.

**ధనుస్సు:** పోటీ పరీక్షలలో మీరు ఊహించిన ఫలితాలు పొందలేరు. ఉద్యోగులకు స్థానమార్పులు కలుగుతాయి.

**మకరం:** ముఖ్యమైన శుభకార్యమును వ్యవహారమును చక్కబెట్టి బరువు బాధ్యతలను దించుకుంటారు.

**కుంభం:** రావలసిన మొండిబాకీలు వసూలవుతాయి. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మీనం:** నిర్మోహమాటంగా వ్యవహరించి కొన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. కీర్తిప్రతిష్ఠల కోసం తాపత్రయపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇంత జాప్యమా?

>> లేఖలో గుర్తు చేశారు. ఈ సమావేశంలో వెంటనే ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించి నప్పటికీ, ఇప్పటివరకు ఆ సంస్థను అధికారికంగా నియమించలేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కూడా ఇంకా ఖరారు చేసి తెలంగాణ ప్రభుత్వానికి పంపలేదని తెలిపారు. దీంతో మెట్రో ఫేజ్1ను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియలో అనిశ్చితి నెలకొనడంతో పాటు రోజువారీ నిర్వహణలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో వివరించారు. ఎస్‌బీఐ క్యాప్స్ నియామకం ఆలస్యం కావడం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు (డీపీఆర్‌లు) కేంద్ర అనుమతులు రావడం మరింత ఆలస్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ కూడా ముందుకు సాగడం లేదని సీఎం రేవంత్ రెడ్డి వాపోయారు. దీంతో ప్రాజెక్టు అమలు వాయిదా పడుతుండగా, కాలయాపన కారణంగా నిర్మాణ వ్యయం మరింత పెరిగే ప్రమాదం ఆందోళన వ్యక్తం చేశారు. అందు చేత, ఈ విషయంపై వెంటనే దృష్టి సారించాలని విన్నవించారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ విషయంలో కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి. కిషన్‌రెడ్డి వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టు ఇకపై మరింత ఆలస్యం కాకుండా చూడాలని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, రైల్వే శాఖలతో స్వయంగా మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.గత నెల జూన్ 23న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో, జూన్ 24 తేదీల్లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, తమరి సమక్షంలో జరిగిన కీలక సమావేశాలను సీఎం లేఖలో గుర్తు చేశారు. ఆ సమావే శాలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా హాజరయ్యారని పేర్కొన్నారు. ఆ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్1 బదిలీ, ఫేజ్2 విస్తరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ప్పటికీ, ఇప్పటి వరకు వాటిలో ఒక్కటీ అమలులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. సమా వేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీకి అవసరమైన ఆర్థిక పరిశీలన బాధ్యతలు అప్పగించాలని అంగీకరించినట్లు సీఎం తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న అధిక వడ్డీ రుణాలను తక్కువవడ్డీ రుణాలుగా మార్చే రీఫై నాన్సింగ్ అవకాశాలను కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిశీలిం చాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. మెట్రో ఫేజ్2 నిర్మాణానికి భారీస్థాయిలో పెట్టుబడులు అవసరమ వుతాయని సీఎం వివరించారు. అందుకే అదే సంస్థ ఫేజ్ 2కు అవసరమైన ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాల సమీ కరణ, నిధుల సమీకరణ మార్గాలు, ప్రాజెక్టు అమలుకు అవసరమైన ఆర్థిక వ్యూహాన్ని రూపొందించాలని సమావే శంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను వెంటనే ఖరారు చేయా లని కేంద్రాన్ని కోరారు. ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించిందని లేఖలో పేర్కొన్నారు.

జూన్ లో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను అధికారికంగా నియమిం చలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. టర్మ్స్ ఆఫ్ రిఫరె న్స్‌ను కూడా ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి పంపలేదన్నారు.

దీంతో మెట్రో ఫేజ్1 బదిలీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని, రోజువారీ నిర్వహణలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా ఎస్‌బీఐ క్యాప్స్ నియామకం ఆలస్యం కావడం వల్ల మెట్రో ఫేజ్2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు కేంద్ర అనుమతులు కూడా ఆలస్యమవుతున్నాయని చెప్పారు. దీంతో నిధుల సమీకరణ ముందుకు సాగడం లేదని, ప్రాజెక్టు ప్రారంభం మరింత వాయిదా పడుతోందని తెలిపారు.

మెట్రో ప్రాజెక్టు అమలులో ప్రతి నెల జాప్యం వల్ల నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని సీఎం హెచ్చరించారు. ధరల పెరుగుదల, వడ్డీ భారం, నిర్మాణ సామగ్రి వ్యయం పెరగడం వంటి కారణాలతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. అందుకే ఇకపై ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటని సీఎం వివరించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, విస్తరిస్తున్న నగర పరిధి, భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే మెట్రో విస్తరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఫేజ్1 తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కాగా, ఫేజ్2 వేగంగా అమలైతే నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, హైదరాబాద్ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని తెలిపారు.

ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే చొరవ తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని, ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను ఖరారు చేయించాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలా జరిగితే మెట్రో ఫేజ్1 బదిలీ ప్రక్రియ వేగంగా పూర్తవడంతో పాటు, ఫేజ్2 విస్తరణ పనులు కూడా ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

హైదరాబాద్ వంటి అంతర్జాతీయ నగర అభివృద్ధికి మెట్రో రైలు విస్తరణ అత్యంత కీలకమని,కేంద్రప్రభుత్వం అత్యవసరంగా స్పందించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని సీఎం తన లేఖలో ప్రత్యేకంగా అభ్యర్థించారు.

# కాళేశ్వరం ఒక వరం

>> ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా తుమ్మిడిహెట్టికి ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. 152 మీటర్ల ఎత్తుపెంచితే తమ ప్రాంతం మునుగుతుందని గతంలో పృథ్వీరాజ్ చౌహన్ అన్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 148 మీటర్లకు ఒప్పందం చేసుకున్నామని గుర్తు చేశారు. మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. దశాబ్దాలుగా పోలవరం ప్రాజెక్టు గురించి విన్నామని, అది ఇంకా పూర్తి కావడానికి. 2028లో పోలవరం ప్రాజెక్టు పూర్తికావచ్చన్న కేటీఆర్, కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును 4 ఏళ్లలో పూర్తి చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ హయాంలో ఎస్ ఎల్ బి సి టన్నులు 8 మంది కార్మికులు శిథిలాల కింద పడి చనిపోయారు. తమపార్టీ ఎనాడు విమర్శించలేదు. కాగా కన్నెపల్లి వద్ద పోలీసులు, బీఆర్ఎస్ నేతలు మధ్య వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ నేతలకు కంపోజ్ లోపలికి అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను అనుమతించాలంటూ బీఆర్ఎస్ నేతలువాగ్వాదానికి దాగారు. బారికేడ్లు తోసుకొని ఎమ్మెల్యే సంజయ్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డిలోపలికి వెళ్లారు.




జమ్మూ కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ముళ్లకంచె

# సెల్‌ఫోన్ లైట్‌తో 90 కి.మీ నడిచిన బస్సు

### కల్బుర్గి నుంచి తెలంగాణ సరిహద్దులోని చించోలి వరకు చీకటిలోనే..

### విచారణకు కర్ణాటక సర్కార్ ఆదేశం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ప్రైవేటు బస్సులు ఓవైపు వరుసగా ప్రమాదాలకు గురవుతుంటే ప్రయాణీకులు సురక్షిత ప్రయాణాల కోసం ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుండడం తెలిసిందే. తమ ప్రయాణం సాఫీగా సాగుతుందనే భావనతో ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుండగా కొన్ని చోట్ల ఇవే బస్సుల్లో చిత్రవిచిత్ర ఘటనలు వెలుగు చూస్తున్నాయి. సెల్‌ఫోన్‌లలో మా ట్లాడుతూ పాటలు వింటూ, సినిమాలు చూస్తూ, సిగరెట్లు తాగుతూ డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లకు కొదవ లేకుండగా వుండగా కరీంనగర్‌లో కొన్ని నెలల క్రితం ఓ డ్రైవర్ ఏకంగా స్టీరింగ్‌పై కోతిని కూర్చుండబెట్టుకుని డ్రైవింగ్ చేయడం సంచలనం రేపింది. ఇక తాజాగా కర్నాటకలో ఓ ఆర్టీసీ బస్సు వరుసగా మూడు రోజుల పాటు హెడ్‌లైట్ లేకుండా చిమ్మచీకట్లో జాతీయ రహదారిపై సెల్‌ఫోన్ లైటింగ్‌లో పదుల కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగించిన ఘటన ఇప్పుడు దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ బస్సులోని ఓ ప్రయాణీకుడు కండక్టర్ సెల్‌ఫోన్ లైటింగ్‌ను చూపుతుండగా డ్రైవర్ చీకట్లో బస్సును నడుపుతుండడాన్ని తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో వుంచడం, ఇది కా స్త వైరల్‌గా మారడంతో దీనిపై కర్నాటక సర్కారు విచారణకు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే కర్నాటకలోని కలబురిగిలోని ఓ ప్రాంతం నుంచి మూడు రోజుల క్రితం సాయంత్రం ఏడున్నర గంటల సమయంలో ఆర్టీసీ బస్సు తెలంగాణలోని తాండూరు పరిహద్దులో గల చించోలికి బయ లు దేరింది. ఈ రెండు ప్రాంతాల మధ్య దూరం 90 కిలోమీటర్లు కాగా ఇంత దూరం బస్సు చీకట్లో సెల్‌ఫోన్ లైటింగ్‌లోనే ప్రయాణం సాగిం చడం గమనార్హం. ఈ బస్సు నంబర్ కెఎ 28 ఎఫ్, 1985. దీనిపై బస్సులో నిత్యం రాకపోకలు సాగించే కొందరు ప్రయాణీకులు మాట్లాడు తూ మూడు రోజుల క్రితం ఈ బస్సు హెడ్ లైట్లు పాడయితే మరమ్మత్తులు చేయించకుండా అలాగే నడుతున్నారని తెలిపారు. దేవుడి దయవల్ల ఈ బస్సు ఎలాంటి ప్రమాదానికి లోనవలేదని వారు తెలిపారు. కాగా ఈ ఘటనపై కర్నాటక సర్కారు విచారణకు ఆదేశించింది.

# ప్రజలకు ముప్పు

>> ద్రవికరించేవరకు పంపులు ఆపరేట్ చేయలేమని ఖరాఖండిగా ఉత్తమ్ తెలిపారు. "ఇది రాజకీయం కాదు, ఇదీ ఇంజనీరింగ్ గోదావరి తీర ప్రాంతాల ప్రజల భద్రత" అందుకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేకపోతున్నామని మంత్రి ఉత్తమ్ వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని జాతీయ ఆనకట్టల ప్రాధికార సంస్థ అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కెటిఆర్ కంటే కూడా ఎన్‌డిఎస్ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజి ఒక పియర్‌దో ఒక గేటుదో కాదనీ మొత్తం పునాదివ్యవస్థలోనే తప్పుచేశారనీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్ల స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బి ఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.

లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది గులాబీ పార్టీనే అని ఆగ్రహించారు.అధిక శాతం లోన్లు తీసుకొచ్చి బిఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్పతెలంగాణ ప్రజల కోసం కాదని ఆరోపించారు. కాంగ్రెస్‌కి మంచి పేరు వస్తుందనే కారణంతో తుమ్మడిహెట్టి నుంచి మేడిగడ్డకి డిజైన్ మార్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు.

ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం రూపకల్పన చేసిన డిజైన్‌లో కడితే ఉత్తర తెలంగాణకు 80 టిఎంసిల నీరు గ్రావిటిద్వారా అందేదని ఎల్‌నినో వంటి దుర్భర పరిస్థితిలోకూడా నీటి వసతి ఉండేదని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దురాశ, అనాలోచిత హ్రస్వదృష్టి అనాలోచిత నిర్ణయంతో కేవలం కమీషన్ల కోసం ఇరిగేషన్‌లో చారిత్రాత్మక తప్పిదాలు చేసిందనీ వాటిని ఒక్కొక్కటిచక్కదిద్దాం మనీ ఆయన వివరించారు. బిఆర్ఎస్ తొమ్మిదిన్నర ఏళ్ళలో రూ.1.81లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. తాము అధికారంలో వచ్చాక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేశామని ఆయన వివరించారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే అన్నట్లుగా బిఆర్ఎస్ నేతల తీరు ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కెసిఆర్ హయాంలోనే, కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజనీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కెటిఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బిఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేకపోతున్నామని అన్నారు.

పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బిఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. సచివాలయంలో విలేఖరుల సమావేశం ముందు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు.35శాతం తక్కువ వర్షాపాతం రాష్ట్రంలో నమోదయ్యే అవకాశంఉందని తాగునీటికి సాగునీటికి తగిన విపత్తు నిర్వహణకోసం చేయాల్సిన ప్రణాళికలను చర్చించారు. నీటిపారుదలశాఖ కార్యాదర్శి ఇ శ్రీధర్, సొరంగ నిపుణుగు కల్నల్ పరీక్షత్‌మెహ్రా, ఇంజనీర్ ఇన్ చీఫ్ రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 10.20 లక్షల ఎకరాలు తగ్గిన సాగు

>> నారుమళ్లు ఎండిపోతుండగా, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు సంబంధించి నాటిన విత్తులు వర్షాలు లేక మొలకలు రాని పరిస్థితి ఏర్పడింది. గతేడాదితో పోల్చితే తెలంగాణలో సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. లోటు వర్షపాతం, సాగునీటి లభ్యత, ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లేకపోవడం కారణంగానే రైతులు పంటలు వేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. గతేడాదితో పోల్చితే రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో(వానాకాలం) సాగు విస్తీర్ణం 10.20 లక్షల ఎకరాలు తగ్గింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 132.44 లక్షల ఎకరాలు కాగా, ప్రస్తుతం ఈ సీజన్‌లో రెండు రోజుల క్రితం వరకూ 33.27 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అదే గతేడాది గణాంకాలను పరిశీలిస్తే.. ఇదే సీజన్‌లో 43.48 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అంటే గతేడాదితో పోల్చితే 10.20 లక్షల ఎకరాలు సాగు విస్తీర్ణం తగ్గింది. ఏడాది కాలంలోనే దాదాపు 23.5 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. సాగు విస్తీర్ణం తగ్గానికి ప్రధానంగా లోటు వర్షపాతంతో పాటు సాగు నీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేకపోవడమే. ఈ ఏడాది జూన్ 1 నుంచి జులై 1 వరకు తెలంగాణలో 123.1 మి.మీ. వర్షపాతం(సాధారణ వర్షపాతం 134.7 మి.మీ.) నమోదైంది. అంటే 9 శాతం లోటు నమోదైంది. ఇక ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు కూడా గణనీయంగా తగ్గాయి. గతేడాది ఈ సమయానికి ప్రధాన రిజర్వాయర్లలో 458.15 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం 338.60 టీఎంసీలకు పడిపోయింది. దీనికి తోడు భూగర్భ జలమట్టాలు కూడా పడిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో భూమి ఉపరితలం నుండి సగటున 9.06 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం, మే నాటికి 9.26 మీటర్ల లోతుకు చేరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాన పంటల సాగు పూర్తిగా తగ్గిపోయింది. రాష్ట్రంలో ముఖ్యమైప పంట వరి సాగు కాగా, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో గతేడాదితో పోల్చితే 1.1 లక్షల ఎకరాలు తగ్గింది. ఇదే సీజన్‌లో గతేడాది 1.82 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. మొక్క జొన్న సాగు 2.48 లక్షల ఎకరాల నుంచి 1.03 లక్షల ఎకరాలకు, కంది పంట 2.70 లక్షల ఎకరాల నుంచి 1.43 లక్షల ఎకరాలకు తగ్గింది. ఆహార ధాన్యాల సాగు 7.91 లక్షల ఎకరాల నుంచి 3.91 లక్షల ఎకరాలకు తగ్గింది. వాణిజ్య పంటల సాగు కూడా గణనీయంగా తగ్గింది.

పత్తి 26.83 లక్షల ఎకరాలకే పరిమితం కాగా, గతేడాది 30.69 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. సోయాబీన్ 2.64 లక్షల ఎకరాల నుంచి 1.65 లక్షల ఎకరాలకు తగ్గింది. ఈ తీవ్రమైన సంక్షోభానికి ప్రధాన కారణం రుతుపవనాల ఆలస్యమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడం కూడా రైతులను ఆందోళనకు గురి చేశాయని తెలిపారు. మొత్తంగా లోటు వర్షపాతం, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేకపోవడం, ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేకపోవడంతో పాటు సరైన సమయానికి విత్తనాలు, ఎరువులు అందుతాయో లేదో అనే అనుమానంతో రైతులు సరైన సమయానికి విత్తనాలు వేసేందుకు కూడా ఆసక్తి చూపలేకపోయారని కూడా పేర్కొన్నారు.

# ముంబయిని ముంచెత్తిన భారీ వర్షాలు



## గుజరాత్, ఢిల్లీల్లోను అతిభారీ వర్షాలే

### చెట్టుకూలి ముకేష్ అంబాని కాన్వాయ్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

**ముంబయి, జులై 5:** మహారాష్ట్రతోపాటు దేశంలోని గుజరాత్, ఢిల్లీ ఇతర ఉత్తర భారత రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు వాతావరణ శాఖ కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో తీరప్రాంత రాష్ట్రాలన్నీ అప్రమత్తం అయ్యాయి. ముంబై భారీ వర్షాలతో అతలా కుతలమైంది. 24 గంటల్లో కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సూచన చేసింది. భారీ వర్షాలు ముంబైను వణికించాయి. ప్రధానంగా నగరంలో గడిచిన 24 గంటల్లో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా లోతట్టు ప్రాంతాల్లో 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. విక్రోలిలో అత్యధికంగా 31.06 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరోవైపు ముంబైలోని కొన్ని ప్రాంతాల్లో మెట్రో, ప్రజా రవాణా సేవలు యథాతథంగా కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించినా మెట్రో సేవల్లో అంత రాయం ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడగా మరికొన్ని చోట్ల రోడ్లు నీట మునిగిపోయాయి. ముంబైలోని కుర్లా వెస్ట్ ప్రాంతంలో చెట్టుకూలడంతో వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం 12:40 గంటల సమయంలో వర్షాలు, గాలులకు నౌపాడాలో ఒక చెట్టు కూలింది. 63 ఏళ్ల యూనస్‌పై ఆ చెట్టు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చెట్టు కొమ్మల కింద చిక్కుకున్న ఆయనను బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే యూనస్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. యూనస్ ఇటీవల ఆ ప్రాంతంలో ఒక షాపు కొనుగోలు చేశాడు. దానిని ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు.

ఆదివారం ఆ షాపు వద్దకు వచ్చి పరిశీలిస్తున్న ఆయనపై చెట్టు కూలడంతో మరణించాడు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు ముంబైలో భారీ వర్షాలకు ఇప్పటి వరకు నలుగురు మరణించారు. బలమైన గాలులకు పలు చెట్లు విరిగాయి. బాంద్రా ఈస్ట్‌లో బలమైన గాలులు, భారీ వర్షాల కారణంగా మరో చెట్టు కూలింది. దీంతో అక్కడ పార్క్ చేసిన పలు వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. బీఎంసీ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కూలిన చెట్టు కొమ్మలు నరికి తొలగించే చర్యలు చేపట్టారు. ముంబైలో కురుస్తున్న ఈ భారీ వర్షాలు ఓ వ్యక్తి ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. కుర్లా ప్రాంతంలో ఆదివారం ఉదయం భారీ చెట్టు ఒక్కసారిగా కూలిపోవడంతో 63 ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అతడు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. థానే, పాల్ఘర్, నవీ ముంబై, పుణె ప్రాంతాల్లో పరిస్థితులు అధ్వాన్నంగా మారాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ భద్రతా కాన్వాయ్‌కు పెద్ద ప్రమాదం తప్పింది.

# నేడు సిద్దిపేట జిల్లాలో సిరోఫార్మాను ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 5:** భారతదేశపు ఫార్మా కేపిటల్‌గా అగ్రస్థానంలో వెలుగులీనుతున్న తెలంగాణా రాష్ట్రం మరో భారీ ఔషధ పరిశ్రమకు వేదిక కానుంది. కేన్సర్ ఔషధాలు ఉత్పత్తి చేసే సిరో ఫార్మా సిద్దిపేట జిల్లా కరకపట్లలోని బయోటెక్ పార్క్3 లో నిర్మించిన అత్యాధునిక ఉత్పత్తి కర్మాగారం సోమవారం ప్రారంభమవుతుంది. ఐటి,పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సిరో ప్లాంటును లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ భారీ ప్లాంటులో పలు గ్లోబల్ ఔషధ ప్రమాణాల సంస్థల కొలమానాల ప్రకారం మందులు, సాఫ్ట్ జెల్స్ ఉత్పత్తి అవుతాయి.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవిన్యూశాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి కూడా పాల్గొంటారు. ఇక్కడ తయారయ్యే కేన్సర్ మందులు ప్రధానంగా అమెరికా, యూరప్, ల్యాటిన్ అమెరికా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి.

ప్లాంటులో ప్రస్తుతం 275 మంది సిబ్బంది పనిచేస్తుండగా పూర్తి స్థాయిలో ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ఉద్యో గులు, సైంటిస్టుల సంఖ్య రెట్టింపు అవుతుంది.



# హైదరాబాద్‌లో హర్యానా పోలీసుల సీక్రెట్ ఆపరేషన్

### మెరుపు ఆపరేషన్‌లో చిక్కిన కరడుగట్టిన దొంగ

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** చంపాపేటలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎవరికీ అనుమానం రాకుండా సైలెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన హర్యానా పోలీసులు.. లోకల్ పోలీసులతో కలిసి నిర్వహించిన సీక్రెట్ ఆపరేషన్‌లో కరుడుగట్టిన అంతరాష్ట్ర నేరస్థుడు దొరికిపోయాడు. హర్యానాలో భారీ దోపిడీచేసి ఇన్నాళ్లూ భాగ్యనగరంలో దొరకకుండా తలదాచుకున్న ఆ కిలాడీ దొంగను ఎలా పట్టుకున్నారో తెలుసుకుందాం.. హర్యానాలో భారీ దోపిడీ కేసులో నింది తుడిగా ఉండి, చాలాకాలంగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న కరుడుగట్టిన నేరగాడి ఆట ఎట్టకేలకు హైదరాబాద్‌లో ముగిసింది. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన హర్యానా స్పెషల్ టీమ్ పోలీసులు.. స్థానిక ఐఎస్ సదన్ పోలీసుల సహకారంతో నగరంలో ఒక మెరుపు ఆపరేషన్ నిర్వ హించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హర్యానాలో నమోదైన ఒక కీలక దోపిడీకేసులో యశ్వంత్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. అక్క డ నేరం చేశాక పోలీసులకు దొరకకుండా తప్పించుకున్న అతడు.. భాగ్య నగరంలో తలదాచుకున్నట్లు హర్యానా పోలీసులకు పక్కా సమాచారం అం దింది. దీంతో రంగంలోకి దిగిన హర్యానా పోలీసుల ప్రత్యేక బృందం ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా సైలెంట్‌గా హైదరాబాద్‌కు చేరుకుంది. స్థానిక ఐఎస్ సదన్ పోలీసులను సంప్రదించి, వారి సహాయంతో చంపాపేటలోని దుర్గాభవానీనగర్ పరిసరాల్లో నిఘా పెట్టింది. నిందితుడి కదలికలను నిరం తరం గమనిస్తూ.. సరైన సమయం చూసి ఒక్కసారిగా మెరుపు దాడిచేసి నిందితుడు యశ్వంత్‌ను బంధించారు.

**హైదరాబాద్ లింకులపై ఆరా..**

యశ్వంత్‌పై హర్యానాలో తీవ్రమైన దోపిడీ ఆరోపణలు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే అతడు హైదరాబాద్‌లో ఎంతకాలంగా తలదాచుకుంటున్నాడు? నగరంలో అతనికి ఎవరైనా ఆశ్రయం కల్పించారా? స్థానికంగా ఎవరితోనైనా నేరపూరిత సంబంధాలు ఉన్నాయా? అనే పలు కోణాల్లో పోలీసులు ప్రస్తుతం తీవ్రంగా విచారిస్తున్నారు. అరెస్టు ప్రక్రియ పూర్తి కాగానే నిందితుడు యశ్వంత్‌ను తదుపరి విచారణ, కోర్టులో హాజరుపరచడం కోసం పోలీసులు హర్యానాకు తరలిస్తున్నారు. ఈ దోపిడీ కేసులో యశ్వంత్‌తో పాటు మరికొందరి పాత్ర ఉందా? ఈ గ్యాంగ్‌లో ఇంకా ఎవరైనా పరారీలో ఉన్నారా? అనే అంశాలపై హర్యానా పోలీసులు దర్యాప్తును మరింత ముమ్మ రం చేశారు.


# ఆసిఫాబాద్‌లో గంజాయి సాగుచేసిన 35 మందికి రైతుభరోసా నిధుల నిలిపివేత

### ఈగల్ పోలీసుల సిఫార్సులతో కలెక్టర్ ఆదేశాలు

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటైన ఈగల్ విభాగం ఆయా జిల్లాల పోలీసులతో కలిసి గం జాయితో పాటు ఇతర డ్రగ్స్‌ను భారీగా పట్టుకుం టుండడం తెలిసిందే. అయితే మారు మూల ప్రాంతాలలో గంజాయి సాగుచేస్తున్న వారిపై ఓ వైపు చర్యలు తీసుకుంటూనే మరోవైపు రైతులకు సర్కారు అందిస్తున్న రైతు భరోసా నిధులను నిలిపి వేయించడంలో ఈగల్ పోలీసులు తొలి సారిగా విజయం సాధించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సర్కారు ఆదేశాలను దిక్కరించి గంజాయి సాగుచేసి పోలీసులకు పట్టుబడి జైలు పాలైన 35 మంది రైతులకు జిల్లా కలెక్టర్ రైతు భరోసా నిధులను నిలిపివేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భాగమైన ఆసిఫాబాద్‌లో 35 మంది రైతులకు ఒకేసారి రైతు భరోసా నిధులు ఆగిపోవడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో ఒకప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని నారాయణ్‌ఖేడ్‌తో పాటు, ఆదిలాబాద్, నిజామా బాద్, వరంగల్, ఖమ్మంలోని కొన్నిచోట్ల గంజాయి సాగు జరిగేది. అయితే పోలీసులతో పాటు అబ్కారీ శాఖ దాడుల కారణంగా ఉమ్మడి మెదక్, వరంగల్ జిల్లాలలో ఈ సమస్య చాలావరకు కొలిక్కి వచ్చింది. అయితే ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలోని మారుమూల ప్రాంతాలలో ఇప్పటికీ గంజాయి సాగు ఎక్కువగానే జరుగుతోంది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆసిఫాబాద్‌లో ఈ సమస్య ఎక్కువగా వుండడం గమనార్హం. ఈ జిల్లాలోని సిర్పూరు (యు), జైనూరు, కెరమెరి, లింగాపూర్ మండలాలలో గంజాయి సాగు ఎక్కువగా వుంది.

ఈ మండలాలు మహారాష్ట్రకు సరిహద్దులో వుండగా అక్కడి ప్రజలతో ఇక్కడి గిరిజన తాండాల వారికి బంధుత్వం వుంది. ఇదే సమయంలో మహారాష్ట్రకు చెందిన వ్యాపారులతోనూ సంబంధాలు వున్నాయి. ఈ మండలాలలోని అనేక గ్రామాలు మారుమూలలో వుండడం, రోడ్డు మార్గాలు సరిగ్గా లేకపోవడం, పోలీసుల నిఘా కూడా కరువవడంతో గంజాయి స్మగ్లర్లకు వరంగా మారింది. మహారాష్ట్రకు చెందిన గంజాయి స్మగ్లర్లు ఆసిఫాబాద్‌లోని ఈ గ్రామాలలో గంజాయి సాగును ప్రోత్సహిస్తూ, ఇక్కడి పంటను పశ్చిమాది, ఉత్తరాది రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు. కాగా దీనిపై ఈగల్ పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి ఈ గ్రామాలపై వరుసగా దాడులు చేస్తుండడంతో గత ఏడా ది 57 కేసులు నమోదు కాగా 101 మంది అరెస్టయ్యారు. వీరిలో రైతులే ఎక్కువగా వున్నారు. ఈ సందర్భంగా రెండు కోట్ల రూపాయలకు పై గా గంజాయిని జప్తు చేసి తగులపెట్టారు. గంజాయి సాగుకు సంబంధించి కొందరు రైతులు రెండు అంతకు ఎక్కువసార్లు అరెస్టవడంతో వారికి రైతుభరోసా నిధులను నిలిపి వేయాలని ఈగల్ విభాగం కలెక్టర్‌ను కోరడంతో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# కెల్విన్ వేవ్




**సముద్రం అడుగున 14,500 కి.మీ. భారీ ఉష్ణ ప్రవాహం**

**గుర్తించిన 'నాస్తా ..**

**పర్యవేక్షిస్తున్న 'సెంటినెల్6'**

**శీతాకాలం నాటికి బలంగా మారే అవకాశం**

**ప్రపంచ దేశాలకు సూపర్ ఎల్‌నినో ముప్పు**

**వాతావరణ శాస్త్రవేత్తల ఆందోళన**

**న్యూఢిల్లీ, జులై 5:** పసిఫిక్ మహాసముద్రం అడుగున ఎక్కడో, ఒక భారీ వెచ్చని నీటి ప్రవాహం కదులుతోంది. ఇది ఇండోనేషియా సమీపంలో ప్రారంభమై, నెలల తరబడి భూమధ్యరేఖ వెంబడి తూర్పు వైపు కదులుతోంది. ఈ నెమ్మదైన, కంటికి కనిపించని వేడి ప్రవాహం ఉష్ణమండల పసిఫిక్‌లో దాదాపు 14,500 కిలోమీటర్ల మేర విస్తరించిందని వాతావరణ శాస్త్రవేత్తలు వర్ణించారు. ఏ ఓడ, ఏ నావికుడు కూడా దానిని చూడలేకపోయాడు. అయినప్పటికీ, 1,300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో తిరుగుతున్న నాసా ఉపగ్రహం దీనిని గుర్తించింది. ఎందుకంటే ఆ వెచ్చని నీరు వెళుతున్నప్పుడు, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం నిశ్శబ్దంగా సుమారు 15 సెంటీమీటర్లు పెరిగింది. 2026 వసంతకాలం వరకు గమనించిన ఆ స్వల్ప ఉబ్బరం, సముద్రం నెలల ముందుగానే పంపిన ఒక హెచ్చరిక. జూన్ 11న, అమెరికా వాతావరణ సంస్థ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) ఎల్ నినో ఏర్పడిందని ప్రకటించింది, ఇది ఒక అరుదైన, శక్తివంతమైన సంఘటనగా మారగలదని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు.

**కెల్విన్ వేవ్ అంటే ఏమిటి? అది ఎల్‌నినోను ఎలా ప్రేరేపిస్తుంది?**

సాధారణంగా, వాణిజ్య పవనాలు పసిఫిక్ మీదుగా తూర్పు నుండి పడమరకు వీస్తాయి. ఇవి ఇండోనేషియా సమీపంలో వెచ్చని నీటిని పోగుచేస్తుండగా, పెరూ తీరంలో చల్లని, పోషకాలు అధికంగా ఉన్న నీరు ఉపరితలంపైకి వస్తుంది. ఈ విధంగా లోతైన చల్లని నీరు పైకి రావడాన్ని అప్‌వెల్లింగ్ అంటారు. అప్పుడప్పుడు, ఈ పవనాలు బలహీనపడి, కొద్దికాలం పాటు వ్యతిరేక దిశలో వీస్తాయి. పశ్చిమాన ఉన్న వెచ్చని నీటి పర్వతం అప్పుడు తూర్పు వైపుకు జారుతూ తిరిగి వస్తుంది. వందల కిలోమీటర్ల వెడల్పుతో, పసిఫిక్‌లో చాలా వరకు విస్తరించి ఉన్న ఈ నెమ్మదైన నీటి అడుగున ఉప్పెననే కెల్విన్ తరంగం అంటారు. వెచ్చని నీరు వ్యాకోచించి ఎక్కువ స్థలాన్ని ఆక్రమించడం వల్ల, దానిపై ఉన్న సముద్ర ఉపరితలం పైకి లేస్తుంది. ఈ తరంగం, వెచ్చని ఉపరితల నీటికి, చల్లని లోతులకు మధ్య ఉన్న సరిహద్దు అయిన థర్మోక్లైన్‌ను కూడా కిందికి నెడుతుంది. దీనివల్ల దక్షిణ అమెరికా సమీపంలో చల్లబరుస్తున్న అప్‌వెల్లింగ్ ఆగిపోతుంది. తూర్పు పసిఫిక్ వేడెక్కుతుంది, ఎల్ నినో పుడుతుంది.

**నాసా 'సెంటినెల్6' ఉపగ్రహం దీనిని ఎలా గుర్తించింది?**

నాసా, దాని యూరోపియన్ భాగస్వాములు 2020లో ప్రయోగించిన 'సెంటినెల్6' మైఖేల్ ఫ్రీలిచ్ ఉపగ్రహం, ప్రతి 10 రోజులకు ఒకసారి మొత్తం సముద్రపు ఎత్తును అంగుళంలో కొంత భాగం వరకు కచ్చితత్వంతో మ్యాప్ చేస్తుంది. ఇది జనవరి చివరిలో మైక్రోనేషియా సమీపంలో ఒక చిన్న కెల్విన్ తరంగాన్ని గుర్తించింది, అది ఫిబ్రవరి మధ్య నాటికి క్షీణించింది. మార్చి ప్రారంభంలో అంతకంటే చాలా పెద్ద తరంగం ఉద్భవించి తూర్పు వైపుకు కదిలింది. మే మధ్య నాటికి, పెరూ చుట్టూ ఉన్న సముద్రాలు దీర్ఘకాల సగటుల కంటే 15 సెంటీమీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.

**2026లో సూపర్ ఎల్‌నినో వస్తుందా?**

రావచ్చు. 1997, 2015 సంవత్సరాల నాటి ఎల్ నినోల వంటి అత్యంత బలమైన ఎల్ నినోకు సూచిక అయిన పసిఫిక్ సముద్రపు ఉష్ణోగ్రతలు, సగటు కంటే 2 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగేందుకు 63 శాతం అవకాశం ఉందని నోవా వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశానికి ఇది ఒక అవాంఛనీయ పరిణామం. చారిత్రాత్మకంగా, బలమైన ఎల్ నినో సంఘటనలు నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తాయి, అయితే హిందూ మహాసముద్ర ద్విధ్రువం వంటి అంశాలు ఈ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించగలవు. ఈ సంఘటన ఈ శీతాకాలంలో గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ప్రపంచ దేశాలకు ఈ సూపర్ ఎల్ నినో పెనుముప్పు అని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే, గతంలో ఇలాంటి భారీ వెచ్చటి నీటి ప్రవాహం పసిఫిక్ మహాసముద్రం దాటిన ప్రతిసారీ ప్రపంచ వాతావరణంలో పెద్ద మార్పులు జరిగాయి. కొన్ని దేశాలు తీవ్ర కరువును ఎదుర్కొన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు నమోదయ్యాయి. ఇప్పుడు మరోసారి అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి.

# తెలంగాణలో 'ఇవి' విప్లవం

### 8 జిల్లాల్లో 35 విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** ఇప్పటి వరకు నగరాలకే పరిమితమైన ఈవీ విప్లవం ఇప్పుడు తెలంగాణ గ్రామాలను కూడా తాకుతోంది. గ్రామీ ణ ప్రాంతాల్లో కూడా ఖర్చు తక్కువ రవాణా సౌక ర్యాల పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీలు ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. మొదటి దశలో రాష్ట్రంలోని 8 జిల్లాల్లో 35 చోట్ల ఛార్జింగ్ స్టేషన్లు నెలకొల్పుతున్నారు.

ప్రతి స్టేషన్ నిర్మాణానికి సుమారు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కేంద్రం పీఎం ఈ డ్రైవ్ పథకం కింద 13 లక్షల రూపాయల సబ్సిడీ అందిస్తుంది. మిగిలిన 7 లక్షల రూపాయలు సహకార సంఘాలు తమ సొంత నిధులతో భరించాల్సి ఉంటుంది. ఈ మోడల్ ద్వారా సహకార సంఘాలకు కొత్త ఆదాయ వనరు ఏర్పడనుంది.

గత రెండేళ్లలో గ్రామీణ తెలంగాణ లో 12,041 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడ య్యాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే ఛార్జింగ్ సౌకర్యాల కొరత వల్ల నిజు యజమానులు ఇబ్బంది పడుతున్నారు.

ఇంటి నుంచి దూరంగా వెళ్తే ఛార్జ్ అయిపోతే తిరిగి రావ డం కష్టంగా మారుతోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న 35 స్థలాల ఎంపిక ఈ సమస్యను పరిష్కరించేందుకు సహకార సంఘాల వద్ద ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా రైతులు, గ్రామీణులకు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణ స్టేట్ రిన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సహాయం అందిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి డిమాండ్ ఎక్కువగా ఉన్న 35 స్థలాలను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఒక్క కిలోవాట్ గంటకు సుమారు రూ.18 చార్జీతో ఛార్జింగ్ అందించనున్నారు.

కాగా రాష్ట్రంలో 908 సహకార సంఘాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. దశలవారీగా ఈ సంఖ్యను పెంచి ఎక్కువ సంఘాల వద్ద స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# సరిహద్దుల నుంచే నిఘా కోసం చైనా రాడార్ వ్యవస్థ ఏర్పాటు



**న్యూఢిల్లీ, జులై 5:** భారత సరిహద్దుల్లో చైనా తన మిలిటరీ సామర్థ్యాన్ని విస్తరిస్తోంది.మయన్మార్ సరిహద్దుకు సమీపంలో నైరుతి యువాన్ ప్రావిన్సులో చైనా ఒక అధునాతన రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. భారత్‌కు భద్రతాపరంగా ఇబ్బందులు కలిగించే వ్యవస్థ వల్ల భారత క్షిపణి వ్యవస్థ, జాతీయ భద్రతపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేయబడిన లార్జ్ ఫేజ్డ్ అర్రే రాడార్ 5,000 కిలోమీటర్లకు పైగా నిఘా పరిధిని కలిగి ఉందని తెలుస్తోంది. దీని ద్వారా చైనా హిందూ మహాసముద్రంలోని ప్రాంతాలపై, భారత భూభాగాలను కూడా పర్యవేక్షి ంచగలదు. ఈ అధునాతన రాడార్ వ్యవస్థ చైనా నిఘా సేకరణ సామర్థ్యాలను, ముఖ్యంగా ఇండియా బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రామ్‌కి సంబంధించి కన్నేసి ఉంచగలదు. ముందస్తు హెచ్చరికలు, నిఘా కోసం రూపొందించిన ఎల్‌పార్ వ్యవస్థ, బాలిస్టిక్ క్షి పణి ప్రయోగాలను రియల్ టైమ్‌లో గుర్తించి ట్రాక్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీని పరిధిలోకి భారత్‌లో కీలమైన, క్షిపణి ప్రయోగాలను నిర్వహించే తూర్పు తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం వస్తుంది. ఈ ద్వీపం నుంచే అగ్ని5, కే4 వంటి అధునాతన క్షిపణులను భారత్ పరీక్షిస్తోంది. క్షిపణి వేగం, మార్గం, దూరాలపై కీలమైన డేటాను చైనా సంగ్రహించే అవకాశం ఉంది. భారత దేశ క్షిపణులను కౌంటర్ చేయడానికి చైనా అనుగుణంగా క్షిపణులను, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. హిందూ మహాసముద్రంలో భారత్ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు చైనా ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంతంలో శ్రీలంక, మాల్దీవులతో స్నేహం నడుపుతోంది. ప్రస్తుతం భారత సరిహద్దులకు దగ్గరగా ఉన్న ఈ భారీ రాడార్‌తో బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంపై నిఘా వేస్తుంది. ఈ ప్రాంతంలోని వాణిజ్య షిప్పింగ్ మార్గాలు, భారత నేవీ ఉనికిని పర్యవేక్షించే అవకాశం ఉంది. ఇప్పటికే చైనాకు బీజింగ్ కోర్లా, జిన్జియాంగ్‌లో ఎల్‌పార్ రాడార్లు ఉన్నాయి. ఇవి భారతపై నిఘా కవరేజీని అందిస్తున్నాయి. యునాన్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాడార్ భారత్ దక్షిణ, తూర్పు ప్రాంతాలపై నిఘాను విస్తరిస్తుంది.

# రాష్ట్రంలో మూడు లక్షల మందికి కొత్త పెన్షన్లు?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 5:** అనర్హుల తొలగింపు ద్వారా మిగిలే నిధులను వేరే పనులకు మళ్లించకుండా ఏళ్ల తరబడి దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న నిజమైన లబ్ధిదారులకే అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మంది అర్హులను గుర్తించేందుకు గ్రామ, వార్డు స్థాయిల్లో అధికారులు ఇప్పటికే సర్వే ప్రక్రియను ముమ్మరం చేశారు. దీనికి అదనంగా తాజాగా గుర్తించిన ఒక లక్ష మంది అనర్హుల స్థానంలో.. మరో లక్ష మంది కొత్త అర్హులైన పేదలను ఎంపిక చేసి వారికి త్వరలోనే పెన్షన్లను మం జూరు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్ కేటాయిం పులు, నిధుల సర్దుబాటుపై రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే పూర్తిస్థాయి కసరత్తును పూర్తి చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో కొత్తగా దాదాపు 3 లక్షల మంది పేదలకు ఆర్థిక భద్రత లభించనుంది. కొత్తగా పెన్షన్లు అందబోతుండటంతో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, దివ్యాంగుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ఈ సామాజిక వర్గాలకు ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటగా నిలిచింది. అర్హుల వడపోత ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని త్వరలోనే లబ్ధిదారుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేసి కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించ నున్నట్లు అధికార వర్గాలు వెల్లడించారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD
O.A. No. 89 of 2026

ICICI Bank Limited ...Plaintiff
And
Meghana Enterprises and Ors. ...Defendant(s)

Summons by way of Paper Publication

To,
1. Meghana Enterprises
Rep. by Its Proprietor Ram Krishna
R/o.10/2/193, East Marredpally
Hyderabad-500026
Mobile No. 9440121234
2. J. Ramakrishna Rao
S/o. J. Govinda Rao
Age: 52 Years; Occ: Business
R/o. 24-88/6/5/1A, Plot-19
Ananadbagh, Near Kurpa Anand Apts., Malkgiri, Hyderabad-500047
Mobile No. 9440121234
...Defendants

Please take the summons in the above C.A. No. 89 of 2026 filed by the Applicant for Recovery of money of Rs.2,16,91,909.67Ps against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VARTHA" Telugu Daily, Hyderabad Edition and "The Hindu" Hyderabad edition English newspaper and posted the matter to 25-06-2026.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 07-08-2026 at 10:30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 29th of June, 2026.
(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad

### నేడు ఒబిసి పరిశీలకులకు శిక్షణ తరగతులు

### పిసిసి ఒబిసి కన్వీనర్ కేతూరి వెంకటేష్

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నూతనంగా నియమించిన ఒబిసి పరిశీలకులకు రాష్ట్రస్థాయి శిక్షణ సోమవారం నిర్వ హిస్తున్నామని పిసిసి ఒబిసి కన్వీనర్ కేతూరి వెంకటేష్ తెలిపారు. సోమ వారం ఉదయం 11 గంటలకు ఇందిరాభవన్‌లో పిసిసి నూతనంగా నియా మకం చేసిన ఒబిసి అబ్జర్వర్లు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ తరగతులకు అందరూ రావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ముఖ్య అతిథిగా పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఒబిసి చైర్మన్ వీర్లపల్లి శంకర్ జూలూరు ధన లక్ష్మి తదితర ముఖ్యనాయకులు హాజరు అవుతున్నారన్నారు.

# రాష్ట్రంలో పడిపోతున్న భూగర్భజలాలు

### 17 జిల్లాల్లో తగ్గిన నీటిమట్టాలు.. సగం జిల్లాల్లో క్షీణత నమోదు

### అత్యధికంగా హైదరాబాద్‌లో 2.47 మీటర్లు పడిపోయిన మట్టాలు

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో భూగర్భ జల మట్టాలు పడిపోతున్నాయి. జూన్ నెలలో తెలంగాణలో సాధారణం కంటే 12 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో, 17 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గాయి. హైదరాబాద్‌లోనే అత్యధికంగా 2.47 మీటర్ల మేర నీటిమట్టం పడిపోయింది. 33 జిల్లాల వ్యాప్తంగా 1,771 పీజో మీటర్లను పర్యవేక్షించిన తర్వాత సిద్ధం చేసిన జూన్ 2026 భూగర్భ జల మట్ట పరిస్థితి నివేదిక ప్రకారం, గత ఏడాది అదే నెలతో పోలిస్తే రాష్ట్ర సగటు భూగర్భ జల మట్టం కేవలం 0.01 మీటర్ల స్వల్ప మెరుగుదల మాత్రమే చూపగా, దాదాపు సగం జిల్లాల్లో క్షీణత నమోదైంది. భూగర్భ జలాలపై ఒత్తిడికి పాక్షికంగా వర్షపాతం లోటు కూడా ఒక కారణమని అధికా రులు పేర్కొన్నారు. జూన్ నెలలో తెలంగాణలో సాధారణంగా కురవాల్సిన 130 మిల్లీమీటర్లకు బదులుగా కేవలం 115 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది, ఇది 12 శాతం లోటు. గతేడాది జూన్‌తో పోల్చితే అత్యధికంగా క్షీణించిన జిల్లాల్లో హైదరాబాద్‌లో 2.47 మీటర్లు, రాజన్న సిరిసిల్లలో 1.51 మీటర్లు, జయశంకర్ భూపాలపల్లిలో 1.33 మీటర్లు, పెద్దపల్లిలో 1.33 మీటర్లు, నిజామాబాద్‌లో 1.12 మీటర్లు, జగిత్యాల 1.12 మీటర్లు, జగిత్యాల 0.90 మెట్ట మెట్టరేగు 0.990 మెట్టరేగులు. ఆదిలాబాద్ 0.77 మీటర్లు, మహబూబాబాద్ 0.73 మీటర్లు. జూన్ 2025లో 9.47 మీటర్లతో పోలిస్తే, సగటు భూగర్భ జలమట్టం భూమి మట్టానికి 9.46 మీటర్ల దిగువన ఉంది. సానుకూల అంశం ఏమిటంటే, 16 జిల్లాలు భూగర్భజల మట్టాలలో మెరుగుదల నమోదు చేశాయి. యాదాద్రి భువనగిరిలో అత్యధికంగా 2.86 మీటర్లు, నాగర్ కర్నూల్ (1.64 మీ), రంగారెడ్డి (1.51 మీ), జనగాం (1.46 మీ), వికారాబాద్ (1.44 మీ)లు అత్యధికంగా ఎగబాకాయి. మెదక్, వికారాబాద్‌లలో భూగర్భ జల మట్టాలు అత్యంత లోతుగా కొనసాగుతున్నాయని, ఇక్క డ సగటులోతు భూమి మట్టానికి 13.30 మీటర్లకు చేరుకుందని నివేదిక వెల్లడించింది. కాగా, ఖమ్మంలో అత్యంత తక్కువ భూగర్భ జలమట్టం భూమి మట్టానికి 5.46మీటర్ల లోతులో నమోదైంది. గతేడాది జూన్‌తో పోలిస్తే భూగర్భ జలమట్టాలు పెద్దగా మార నప్పటికీ, నవంబర్ 2025 నాటి రుతుపవనాల అనంతర స్థాయిలతో పోలిస్తే 5.05 మీటర్ల తగ్గుదల నమోదైనట్లు నివేదిక పేర్కొంది. ఇది రుతుపవనాల పునరుత్పత్తి కాలం ప్రారంభం కావడానికి ముందే 33 జిల్లాలంతటా గణనీయమైన కాలానుగుణ క్షీణతను సూచిస్తోంది.


వార్త

సంస్కారం, సభ్యత అనేవి ఎక్కడికి వెళ్లినా గౌరవం లభింపచేసే పాస్‌పోర్టులు.

- జాన్సన్

# హే రామ్! హే భగవాన్!!

ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు' ఎందెందు వెదకిచూచిన అందందే...! అనే పోతన భాగవతంలోని పద్యతాత్పర్యం ఆలకిస్తే విష్ణువు అలవైకుంఠపురంలోనే కాదు ఎక్కడ చూసినా అన్ని చోట్లా ఉంటాడని అర్థం. దేవుడున్నచోట మకిల ఉండదని చెప్పుకునేవారిని ఆశ్చర్యానికి గురిచేస్తూ దైవ క్షేత్రాల్లోనూ అవినీతి మూడుపువ్వులు ఆరుకాయలుగా విలసిల్లుతూ ఉంటుందనే విషయం 'అయోధ్య, బద్రీనాథ్ వంటి దైవక్షేత్రాల్లో సైతం బయటపడుతోంది.అయోధ్య అదొక దివ్యధామం. బాబ్రీ మసీదు, రామజన్మభూమి అంశంపై హిందూ ముస్లింల మధ్య పొరపొచ్చాలను ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం 'క్షీర నీర' న్యాయం అన్న చందాన తేల్చేశాక అయోధ్య రామ మందిర నిర్మాణానికి ఎంతో శ్రద్ధాసక్తులతో రామభక్తులు పూనుకున్నారు. ఆ వెంటనే గత కాలంలో వారణాసి, మథిర, వంటి ఎన్నో దివ్య క్షేత్రాల్లో భారతీయ భక్తితత్వంపై, దివ్యక్షేత్రాలపై ముస్లింలు దాడి చేసి ఆక్రమించుకోవడాన్ని నిరసిస్తూ కోర్టులకెక్కారు.జరిగింది ఎప్పుడైనా న్యాయం ఇప్పటికైనా లభిస్తోంది. కొన్నిటిపై హిందూ ధర్మ పరిరక్షణ పేరిట తీర్పులు సానుకూలంగా పొందారు కూడా. ఆ మేరకు ఆయా ఆధ్యాత్మిక క్షేత్రాల్లో దైవక్షేత్ర పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. భరతుడు రామపాదుకలు పట్టినట్లుగా దేశంలోని మారుమూల ప్రాంతాలు సైతం రామ మందిర నిర్మాణానికి పేర్చనున్న ఇటుకలను పరమభక్తి భావంతో పూజలు చేసి మరీ ఫైజాబాద్‌కు తీసుకెళ్లారు రామభక్తులు. భక్తిపారవశ్యంలో అయోధ్య రామమందిర నిర్మాణం జరగడం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చరిత్రలో అతి ప్రాధాన్యమైన విషయంగా నిలిచిపోయింది. 'రామో విగ్రహవాన్ ధర్మః' అనేమాట భక్తుల నోట ఎప్పుడూ నానేమాట. రాముడంటేనే ధర్మం మూర్తీభవించిన వ్యక్తి అతని రాజ్యంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుందని ప్రతీతి.కాగా ప్రస్తుత కలియుగధర్మం కుంటినడక నడుస్తోందని చెప్పక తప్పదు. దైవధామాల్లో అవినీతి రాజ్యమేలుతోందన్న విషయం ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. సాధారణ హిందూ దేవాలయాల్లో భక్తుల దోపిడీ జరుగుతుందన్నది జనశ్రుతిగా సాగుతోంది. రాముడి పేరిట, దేముడి దోసిట ప్రసాదాలు, ధానధర్మాలుగా వచ్చినవి ఎటువంటివైనా కైంకర్యమే. వాటిని అడ్డుకునేందుకు ఎలాంటి భక్తిభావం కానీ, ధర్మాచరణ కానీ అందుబాటులో లేవు. హుండీల్లో నగలు, నగదు కూడా మాయమే. తన కళ్లెదుట అపవిత్ర కార్యాలు, అసంగతులు జరుగుతున్నా ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. అయోధ్య విరాళాల కుంభకోణంలో ఎన్నో అవినీతి కార్యక్రమాలు బయటపడ్డాయి. ఈ రామమందిర నిర్మాణ చరిత్రను తవ్విచూస్తే బాబ్రీ మసీద్ అయోధ్య రామమందిరం కథల కన్నా ఎన్నో విషయాలు బయటి కొస్తున్నాయి. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుంటున్నారన్న రీతిలో కలియుగ ప్రస్థానంలో ఎవరితోనూ మాట్లాడని రాముడి సేవా కైంకర్యాలు, వైభవ సంకేతాలను సైతం సొంతం చేసుకునే చంపత్ రాయ్‌లు, పూజారిలు, కొంత మంది ఆధ్యాత్మికవేత్తలు, ఆస్తిక నేతలు సైతం 'తిలాపాపం తలా పిడికెడు' అన్న చందాన చేతులేశారు. రాముడు ఎంతో పతితపావనుడు, రామజన్మ భూమి ఎంతో పవిత్రమైనది' అని పదేపదే మనం గొంతు చించుకోవడం తప్పితే ఆయా దేవుళ్లకు, ఆయా ప్రాంతాలకు పవిత్రతను సమకూర్చే ఎలాంటి కార్యాచరణ అక్కడ కనపడదు. కుంభకోణాలు, కైంకర్యాలు, అవినీతి కార్యకలాపాలు, ఇవన్నీ దైవలీలలా అంటే కాదనే చెప్పాలి. 'తీగ లాగితే డొంకంతా కదిలినట్లు' ప్రతీ అంశంలోనూ ఎన్నో చిత్రవిచిత్రాలు తారసపడుతున్నాయి. అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తాజాగా స్పందించింది. ఆరెస్సెస్ తొలిసారి ఈ అంశంపై దుర దృష్టకరమని వ్యాఖ్యానించింది. అసాధారణ అవినీతిని నొచ్చుకుంది కూడా. ఈ ఉదంతం యావత్తూ రామ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ఆందోళన చెందారు. హిందూ ధర్మాన్ని సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే శక్తుల్ని వారి కుట్రల్ని తిప్పికొట్టాలని పిలుపు నివ్వడంలో ఎలాంటి ప్రత్యేకత కనిపించలేదు. ఇలాంటి కుంభకోణాల వ్యవహారాల్లో ఏలినవారు కానీ గట్టు మీదనున్నవారు కానీ స్పందించే తీరు సహజంగా ఇలాగే ఉంటుంది. అంతాజరిగాక ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాలని శ్రీ రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు సూచించడమంటే ఎంతో పరిహాసాస్పదంగానే గోచరిస్తోంది. ఎక్కడైతే నిజాయితీ పాదముద్రలు స్పష్టంగా కనపడతాయని భావి స్తామో అక్కడవి మచ్చుకైనా కానరాకపోతే కలిగే ఫీలింగ్ మాత్రమే జనిస్తోంది. ప్రజాబాహుళ్యంలో బిజెపి పాలిత ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ధామ్‌లో కానుకలు,విరాళాల దుర్వినియోగం జరిగినట్లుసోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలు ఈ దేశ దైవధామాల అవినీతి కథలను మరింత గందరగోళపరుస్తున్నాయి. విరాళాల నోట్ల లెక్కింపు కోసం నియమించుకున్న వారి నేపథ్యం సరిగా పరిశీలించుకోనందు వల్లనే ఈ పొరపాట్లు జరిగాయని సరిపెట్టుకున్నా, జరిగిన 'తమాషా'ను ఏ విధంగానూ సమర్థించుకోలేని పరిస్థితి రామభక్తుల్లో నెలకొని ఉంది. అయోధ్య భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. కోట్లాది మంది భక్తులు భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో పూర్తిస్థాయి చట్టబద్ధ దర్యాప్తు అవసరం ఉంది. విశ్వాసం ఉన్నచోట పారదర్శకతకూ ఎక్కువ విలువ ఇవ్వాల్సి ఉంటుంది.



మనిషి విజయం ఆర్జించిన డబ్బును బట్టి కాక సాధించిన మనశ్శాంతిని బట్టి ఉంటుంది.

అరిస్టాటిల్



జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా సఫలం కావడానికి మరొక అవకాశం కలుగుతుంది.

దావిన్సి

## ప్రజావాక్కు

### నేల మాళిగను హేతువాద సంఘం తెరుస్తుంది

కేరళలోని తిరువనంతపురం అనంతపద్మనాభుని దేవాలయంలోని ఆరవ నేలమాళిగలో ఏదో ఉన్నదని, కొంత మంది ఈమధ్య సైన్స్‌కు కూడా అంతుపట్టని దేవుడు, దెయ్యాలు, అద్భుత శక్తులున్నాయని, తెరిస్తే ప్రళయం వస్తుందని, నాగబంధం తెరిస్తే లోకం అల్లకల్లోలం అవుతుందని, నాగుపాములు బుసకొడుతుంటాయని, సముద్రం ఉప్పొంగుతుంది అని 'యుట్యూబుల్లో' రకరకాలుగా ప్రజలను భయపెడుతున్నారు.ఇలాంటి ప్రకటనల ద్వారా ప్రజలను భయపెట్టేవారిని అరెస్ట్ చెయ్యాలి. ఐదవ నేల మాళిగలో లభించిన ఆభరణాలు కోట్లవిలువ చేస్తాయని, అరవ నేలమాళిగ కూడా తెరవాలని ఆమధ్య హైకోర్టు ప్రయత్నించి, తెరచిన వాళ్ళు చనిపోతున్నారని భక్తులు భయపెట్టగా కోర్టు తెరవటాన్ని వాయిదవేసింది. వాటి గుట్టు రట్టుచేసి ప్రపంచంలో అద్భుతశక్తులు ఏమీ లేవని నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. నాగ బంధం తెరిస్తే వాళ్ళు చనిపోతారని, గతంలో ఇలాంటివి జరిగాయని భయపెడుతున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మెసేజ్ చార్జీల మోత!

ఈ మధ్యకాలంలో బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్. ఛార్జీల మోత మోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పరిస్థితి అనేది ఎలా తయారుఅయ్యింది అంటే ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య, అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు కేంద్రప్రభుత్వం వారుఅనుసరిస్తున్న కొన్ని అర్థం,పర్థం లేని అస్థవ్యస్థమైన విధానాలు ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది.దీంతో ప్రజల పరిస్థితిముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారు అయ్యింది.

- బి. మధుపాళి, నంద్యాల జిల్లా

### మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువ సేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, శారీరక చలనం తగ్గడం, చదువుపై దృష్టి తగ్గిపోతోంది. తల్లిదండ్రులు మొబైల్ వాడకాన్ని తగ్గించాలి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### విరాళాల నిర్వహణలో నైతికత అవసరం

దేవాలయాలు భక్తులవిశ్వాసానికి ప్రతీకలు. భక్తులు సమర్పించే విరాళాలు దైవభక్తికి, ధార్మిక సేవకు చిహ్నం. అలాంటి పవిత్ర నిధులదుర్వినియోగం లేదా అపహరణకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడం బాధాకరం. ఇటీవల శ్రీరామాలయ విరాళాల అక్రమ వినియోగానికి సంబంధించిన వార్తలు కూడా ఈఅంశంపై మరోసారి దృష్టి సారింపజేశాయి. ఈ సమస్యను భావోద్వేగంతో కాకుండా వివేకంతో పరిశీలించాలి. నేరం ఎక్కడ జరిగినా నేరమే. దేవాలయం కావచ్చు, ఇతర ప్రార్థనా మందిరం కావచ్చు లేదా ఏ సంస్థ అయినా కావచ్చు ప్రజల విశ్వాసానికి భంగం కలిగించే చర్యలను చట్టం కఠినంగా ఎదుర్కోవాలి. ఆధునిక డిజిటల్ లెక్కల విధానం, స్వతంత్ర ఆడిట్లు, సీసీటీవీ పర్య వేక్షణ, విరాళాల వినియోగంపై క్రమం తప్పకుండా ప్రజలకు సమాచారం అందించడం వంటి చర్యలు విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయి.విరాళాల నిర్వహణలో నైతిక విలువలు, పారదర్శకత, చట్టబద్ధత పాటించాలి.

- సి.హెచ్. ప్రతాప్ , శ్రీకాకుళం

### నైపుణ్యం పెంచుకోవాలి

నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతుంది దీనికి కారణం ఇటు విద్యార్థులు అటు గవర్నమెంట్. గవర్నమెంట్ ఏమో పాత సిలబస్ అలాగే ఉంచడం, కేవలం సిలబస్ మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ నేటి ప్రపంచానికి ఉపయోగపడే నైపుణ్యాలు ఏమి విద్యార్థులకు నేర్పించడం లేదు. నేటి సాంకేతిక రంగానికి తగ్గట్టుగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచాలి. విద్యార్థులు కూడా ఏదో డిగ్రీ చదివామా అని కాకుండా నైపుణ్యం పెంచుకుని భవిష్యత్తులో ఉద్యోగం తెచ్చుకోవాలి. నైపుణ్యం ఉంటేనే ఏదైనా సాధించగలుగుతారు. నైపుణ్యం ఉంటేనే కొత్త ఉద్యోగాల్లో స్థిరపడతారు. లేకుంటే ఆరునెలలకు ఒకసారి ఉద్యోగం వెతుక్కనే పరిస్థితులు ఏర్పడతాయి.

- రాఘవేంద్ర బాబు, ఈస్ట్ గోదావరి జిల్లా

### నీటిని పొదుపుగా వాడుకుందాం

వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా, ఎల్‌నినో ప్రభావం, దృష్ట్యా భవిష్యత్‌లో నీరు లభ్యత ఉండడం చాలా కష్టం. కావున అవసరమైన వరకు మాత్రమే నీటిని వాడుకుందాం. మనం ఏ పని చేయాలన్న నీరు లేనిది పని పూర్తి కావడం అసంభవం. కావున మనం నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్ తరాలకు నీటిని వనరులను అందించాలి.

-ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# అప్రమత్తం కాకపోతే ఆహార సంక్షోభమే!

వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం,వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.

**వనకల్ల వీరప్ప**

వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు రుతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎండలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి.వర్షాలు ఆలస్యంగా వస్తున్నాయి. వచ్చినా ఒకేసారి కుండపోతగా కురిసి వరదలు సృష్టిస్తున్నాయి. తర్వాత మళ్లీ దీర్ఘకాలం పొడి వాతావరణం నెలకొంటోంది. ఈ అసాధారణ పరిస్థితులకు ప్రధాన కారణాల్లో ఒకటి ఎల్‌నినో ప్రభావం.భారత వాతావరణ శాఖ, భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థతో పాటు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు కూడా ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాన్ని హెచ్చరిస్తున్నాయి. ఈ ప్రభావం సెప్టెంబరు వరకు కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల రుతుపవనాల బలం తగ్గి, దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. భారత వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది రుతుపవన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో సుమారు 90శాతమే ఉండవచ్చని పేర్కొంది. అంటే వ్యవసాయం, తాగునీరు, విద్యుత్,ఆహార ఉత్పత్తి వంటి రంగాలపై ప్రత్యక్ష ప్రభావం పడే అవకాశం ఉంది.ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం.ఈమార్పు ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాత విధానాలను ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో సాధారణంగా ఇది నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుంది. ఫలితంగా వర్షాలు ఆలస్యంగా రావడం, తక్కువగా కురవడం లేదా అసమానంగా కురవడం జరుగుతుంది. ఈ పరిస్థితులు ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాలు. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఈఏడాది వేసవిలో భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి వేడితో పాటు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం ఆందోళన కలిగించే అంశం.



మరోవైపు ఉత్తర భారతదేశంలో ఆకస్మిక తుఫాన్లు, భారీ వర్షాలు నమోదయ్యాయి. ఇవి సాధారణ వర్షాలు కాదని, రుతుపవనాల క్రమాన్ని దెబ్బతీసే వాతావరణ మార్పుల సంకేతాలని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిణామాలు రాబోయే నెలల్లో వ్యవసాయంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్‌లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంట నూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది.గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలున్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు,ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి.ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలున్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక,సాగు పద్ధతులు మార్చుకోవాలి. ప్రభుత్వం కూడా సమయానికి వాతావరణ హెచ్చరికలు, పంటల సూచనలు అందించాలి. ప్రతి జిల్లాకు తగిన వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని విత్తనాలు అందుబాటులో ఉంచాలి. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలి. ఇవి నీటిని ఆదా చేయడమే కాకుండా పోషకాహార భద్రతను కూడా బలోపేతం చేస్తాయి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవు పేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేలనీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు కొంత రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులందరికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండలస్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. వాతావరణ సమాచారాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి. నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం,వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాలు, బలమైన నిల్వవ్యవస్థ, సమర్థవంతమైన పంటల బీమా, రైతులకు ఆర్థిక భరోసా వంటి అంశాలను సమగ్రంగా అమలు చేస్తేనే ఈ సవాలును ఎదుర్కోగలం. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేము. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చు. వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ●

# ఎఐలోను 'మహిళా హక్కులు' అవసరం

**మర్రాపు వసుంధరా దేవి**

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) గురించే చర్చ జరుగుతోంది. మనుషుల పనిభారాన్ని తగ్గిస్తూ, అద్భుతాలు సృష్టిస్తోందని కొనియాడబడుతున్న ఈ కృత్రిమ మేధస్సు, అంతర్లీనంగా ఒక ప్రమాదకరమైన జాడ్యాన్ని కూడా తనలో దాచుకుంటోంది. అదే 'లింగ వివక్ష'. ఇటీవల ఐక్యరాజ్యసమితి (యుఎన్) మహిళా విభాగం విడుదల చేసిన ఒక నివేదిక ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. 'లేడీస్ అంటే ఎఐకి అలుసు' అనే పచ్చి నిజాన్ని ఈ నివేదిక సమాజం ముందు పెట్టింది. అయితే ఈ వివక్షకు, సమాధానాల్లో దొర్లేతప్పులకు సాంకేతిక పరిభాషలో చెప్పుకునే ఎలాంటి 'బగ్' కారణం కాకపోవడమే ఇక్కడ అసలు ట్విస్ట్.ఎఐ అనేది ఒక ఖాళీ కాగితం లాంటిది. దానికి సొంతంగా ఆలోచించే హృదయమో, నైతికతతో కూడిన మేధస్సో ఉండవు. ఇంటర్నెట్లో దశాబ్దాలుగా అందుబాటులో ఉన్నకోట్లాది మానవ సంభాషణలు, పుస్తకాలు, వార్తలు, సమాచారాన్ని విశ్లేషించి అది సమాధానాలు నేర్చుకుంటుంది. అంటే, మన సమాజంలో శతాబ్దాలుగా వేరూనుకుపోయిన పితృస్వామ్య పోకడలను,స్త్రీలపై ఉన్న పక్షపాతాలను, మూస పద్ధతులను ఎఐ తన గురువులైన మనుషుల నుంచే నేర్చుకుంది. మనుషుల అవలక్షణాలు, పక్షపాతాలే ఎఐకి పాఠాలుగా మారాయి. ఐక్యరాజ్యసమితి పరిశోధనల ప్రకారం.. అధ్యయనంచేసిన ఎఐ వ్యవస్థల్లో 44 శాతం వ్యవస్థలు తీవ్రమైన లింగ వివక్షను, 25 శాతం కంటే ఎక్కువ వ్యవస్థలు లింగ, జాతి వివక్షను స్పష్టంగా ప్రదర్శించడమే దీనికి నిదర్శనం. వివిధ సందర్భాలలో ఎఐ ఇచ్చిన సమాధానాలను పరిశీలిస్తే స్త్రీలపై దానికి ఉన్న చులకనభావం, అలుసు స్పష్టంగా అర్థమ




వుతుంది. సాధారణ వాక్యాలను పూర్తి చేయమని ఎఐని అడిగినప్పుడు,అది పురుషులను వ్యాపారాలు,నాయకత్వం, వృత్తిపరమైన విజయాలతో ముడిపెట్టింది. అదే సమయంలో స్త్రీలను ఇల్లు, వంటగది, కుటుంబం, పిల్లల సంరక్షణకే పరిమితం చేస్తూ సమాధా నాలిచ్చింది. కొన్ని ప్రత్యేకసందర్భాల్లో స్త్రీలను స్వతంత్ర వ్యక్తులుగాకాకుండా, కేవలం ఆస్తిగా లేదా పురుషులకు లోబడిన లైంగిక వస్తువులుగా చిత్రీకరించేలా ఎఐ ప్రవర్తించింది. ఇందులో ప్రతి ఐదు సమాధానాలలో ఒకటి లింగ వివక్ష లేదా స్త్రీ వ్యతిరేకతతో కూడి ఉండటం గమనార్హం.ఇంతటితో ఆగకుండా, ఇంటర్నెట్ వేదికగా మహిళలపై జరిగే హింసకు, వేధింపులకు కూడా ఎఐ ఒక సాధనంగా మారుతోంది. మహిళా హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులలో నలుగురిలో ఒకరు ఎఐ సహాయంతో ఆన్లైన్ వేధింపులను ఎదుర్కొంటుండటం ఆందోళనకరం. మహిళలఅనుమతి లేకుండా వారి ముఖాలను మార్చేసి 'డీప్ఫేక్' అశ్లీలచిత్రాలు, వీడియోలు సృష్టించడానికి ఎఐని వాడుతూ డిజిటల్ ప్రపంచంలో మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. కోట్లాది మంది ప్రజలు ఇమెయిళ్లు రాయడానికి, ప్రెజెంటేషన్లు సిద్ధం చేయడానికి, కంటెంట్ సృష్టించడానికి నిత్యం ఎఐని వాడుతున్న తరుణంలో,అది ఇలాంటి వివక్షతో కూడిన సమాధానాలుఇస్తూపోతే సమాజంలో లింగ వివక్ష మరింత బలపడేప్రమాదం ఉంది. అందుకే ఐక్యరాజ్య సమితి హెచ్చరించినట్లుగా.. మానవ మేధస్సును భర్తీ చేయడం కంటే,మానవులదుర్మార్గాలు, పక్షపాతాలు, వివక్షలను ఎఐ వారసత్వంగా తీసుకోకుండా చూడటమే ప్రస్తుతం మానవాళి ముందున్న అతి పెద్ద సవాలు.ఎఐ అభివృద్ధి దశ నుండి దాని వినియోగం వరకు ప్రతి చోటా లింగ సమానత్వాన్ని, మహిళల హక్కులను జోడించాల్సిన అవసరం ఉంది.ఎఐకి కేవలం కోడింగ్ మాత్రమే కాదు, 'సమానత్వం' అనే పాఠం కూడా నేర్పినప్పుడే అది నిజమైన ప్రగతికి బాటలు వేస్తుంది. ●

# ఫీజుల నియంత్రణకు చర్యలేవి?

**ఎం. సోమేశ్వరరావు**

నేడు పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల, కాలేజీలు ఫీజులు చూస్తే కళ్లు తిరగాల్సిందే. చదువుకునే రోజులు పోయి చదువుకొనే రోజులు వచ్చాయి. బడి తలుపులు తెరిచినా వేళ తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్ మొదలైంది. ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థలలో పుస్తకాలు, ఫీజులు చూస్తుంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. ఎల్. కె.జి నుంచే ఫీజుల బాదుడు భారీగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. జూన్ నెల వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బడి తలుపులు తెరిచే సమయానికి పిల్లలు చదువు కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు చూసుకోవాల్సి పరిస్థితి వచ్చింది. విజయవాడలో ఓ కార్పొరేట్ స్కూల్లో పదో తరగతి విద్యార్థికి స్కూల్, హాస్టల్ కలిపి మొత్తం లక్ష రూపాయలు ,కొన్ని స్కూళ్లలో ఎల్.కె.జి, యుకెజి ఫీజులే సుమారు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష మధ్యలో వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయి. కొన్ని స్కూళ్లలో అయితే అప్పుడే అడ్మిషన్లు పూర్తయిపోయినట్లు చెబుతున్నారు. తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో చదువు చెప్పించాలనే ఉద్దేశ్యంతో అడ్మిషన్ల కోసం ప్రైవేట్ స్కూళ్లకు వెళుతున్న తల్లిదండ్రులు అక్కడి ఫీజులు చూసి, వాటిని కట్టడం తమ వల్ల కాదని నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు రూపొందించినా తమ రూల్ తమదే అనేలా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు ప్రవర్తిస్తున్నాయి. కొన్ని స్కూళ్లు అయితే ఒకేసారి మొత్తం అడ్మిషన్ ఫీజు, పాఠశాల ఫీజు కట్టాలనే నిబంధనలను అమలు చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం సెక్షన్ 6 ప్రకారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ 11లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలి. వసూలు చేసే ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 12 ప్రకారం విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:20కి మించరాదు. ప్రతి పాఠశాలలో 25శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మైనార్టీలకు కేటాయించాలి. ఇందులో వికలాంగులు, అనాథలు, హెచ్ఐవి బాధితులు, వీధి బాలలు 5 శాతం, ఎస్సీ బాలలకు 10 శాతం, ఎస్టీబాలలకు 4శాతం, వెనుకబడిన బలహీన వర్గాలు 6శాతం, కేటాయింపు జరిగింది. మొత్తం 25శాతం వీటి ప్రకారం ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు. సెక్షన్ 18 ప్రకారం ప్రభుత్వ నిర్ణీత గడువు తర్వాత కూడా గుర్తింపులేని పాఠశాలను నడిపితే ఒక లక్ష జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా తర్వాత కూడా గుర్తింపు లేకుండా మళ్లీ పాఠశాలను నిర్వహిస్తే రోజుకు 10 వేలు జరిమానా విధిస్తారు.



సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో ఏ (ప్రవేశ పరీక్ష ) నిర్వహించకూడదు. ఒకవేళ అలా నిర్వహిస్తే తొలిసారి తప్పుకు రూ.25వేల, పునరావృతం అయితే రూ.50 వేల జరిమానా విధిస్తారు. ఏ పాఠశాలలోనూ బోధనా రుసుం కాకుండా ఇతర రూపాల్లో ఎలాంటి ఫీజు (క్యాపిటేషన్ ఫీజు) వసూలు చేయరాదు.అలా వసూలు చేస్తే దానికి 10 రెట్లు జరిమానా విధిస్తారు. ప్రైవేటు విద్యాసంస్థలు అక్రమంగా విద్యాసామగ్రి విక్రయిస్తున్నాయి. విద్యాహక్క చట్టం ప్రకారం ఏ విద్యాసంస్థలలో కూడా పుస్తకాలు,యూనిఫామ్ అమ్మరాదు. అలా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. తమ వద్దే యూనిఫామ్, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ అధిక ధరలు విద్యాసంస్థల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ పెద్దలకు చెందినవి కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమకు నచ్చినచోట విద్యాసామగ్రిని తెచ్చుకునే సౌలభ్యం కల్పించాల్సి ఉంది. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు స్కూల్స్‌పై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాఠశాలల్లో ఆటస్థలం ఉండడం లేదు.ఆటస్థలం ఉన్నప్పటికీ పలు పాఠశాలల్లో పీ.ఈ.టీలు ఉండడం లేదు. అనుమతుల సమయంలో బీఈడీ, పీజీ సర్టిఫికేట్లు ఉన్న వారిని చూపించి, అర్హత లేని వారితో పాఠాలు చెప్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల వివరాలు, రికగ్నైజేషన్, రెన్యూవల్ సర్టిఫికేట్లు అందజేయకపోయినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడానికి సరైన ప్రణాళికలు రూపొందించాలి. ఈస్కూల్ మనోళ్లది ఆస్కూల్ వావోళ్లది అనే తేడాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లలో ఫీజుల నియంత్రణ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది. నేడు రాష్ట్రాల్లో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు మండల స్థాయి వరకు విస్తరించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు జలగల్లా పట్టి వారి రక్తాన్ని పీలుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీ వేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు మొత్తం సీట్లలో 25 శాతం పేద పిల్లలకు కేటాయించాలి. కానీ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్‌స్కూళ్లు విద్యాహక్కు చట్టాన్ని పట్టించుకుంటున్న దాఖలా లేదు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజుల దందా కొనసాగిస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని ఈ విద్యా సంవత్సరం నుంచే ఫీజు నియంత్రణ చర్యలు తీసుకోవాలి. ●

### 11న ఇస్లామాబాద్ వేదికగా
## అమెరికా-ఇరాన్ చర్చలు

**ఇస్లామాబాద్, జులై 5:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదిక ఈ నెల 11న అమెరికా – ఇరాన్ మధ్య చర్చలు జరుగనున్నాయి. దౌత్య వర్గాల కథనం ప్రకారం, వేదికపై తుది నిర్ణయం ఇంకా ప్రకటించాల్సి ఉంది, స్విట్జర్లాండ్‌లోని బర్గెన్ స్టాక్ రిసార్ట్‌ను కూడా పరిశీలిస్తున్నారు. పశ్చిమ ఆసియాలో శాంతిని పునరుద్ధరించే లక్ష్యంతో జూన్ 18న అమెరికా, ఇరాన్‌లు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత, దౌత్య ప్రక్రియను సజావుగా కొనసాగించే ప్రయత్నాలలో భాగంగా ఈ చర్చలు జరుగుతున్నాయి. పాకిస్తాన్, ఖతార్‌ల మధ్యవర్తులుగా జూన్ 21న స్విట్జర్లాండ్‌లో సాంకేతిక స్థాయి చర్చలు జరిగాయి. తదుపరి సమావేశంలో ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల సడలింపు, విదేశాలలో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులు, ప్రాంతీయ భద్రతా సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంది.



## ఇక్కడ బాస్ ఎవరో నెతన్యాహుకు బాగా తెలుసు..
### ఇజ్రాయెల్ ప్రధానిపై ట్రంప్ సెటైర్లు

**వాషింగ్టన్,జులై 5:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇక్కడ బాస్ ఎవరో బాగా తెలుసంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్, పశ్చిమాసియా దేశాల వ్యూహాలపై ఇరు దేశాల మధ్య విభేదాలు పొడసూపిన నేపథ్యంలో బంధాన్ని పునర్నిర్మించుకునేందుకు నెతన్యాహు వచ్చే వారమే వైట్‌హౌస్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. యాక్సియోస్ వార్తాసంస్థకు ఇచ్చిన సంక్షిప్త టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ తమ మధ్య సంబంధాలు బాగున్నాయని, అయితే అసలు బాస్ ఎవరో నెతన్యాహుకు స్పష్టంగా తెలుసని వ్యాఖ్యానించారు. శ్వేతసౌధంలో సమావేశం కావాలని నెతన్యాహు స్వయంగా కోరారని, నాటో సదస్సు ముగించుకుని తాను తిరిగి వచ్చిన తర్వాత ఈ భేటీ ఉండవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఇరాన్‌పై ఉమ్మడి యుద్ధాన్ని ప్రకటించే ప్రణాళికను నెతన్యాహు ప్రవేశపెట్టిన తర్వాత వీరి మధ్య జరగనున్న మొదటి అధికారిక సమావేశం ఇదేకానుంది. అయితే ట్రంప్ పర్యటనల షెడ్యూల్ దృష్ట్యా వచ్చే వారం చాలా తర్వాత కానీ, లేదంటే ఆ తర్వాతి వారంలో కానీ భేటీ ఉండొచ్చని ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపేందుకు నెతన్యాహు శుక్రవారం ట్రంప్‌కు ఫోన్ చేశారని, ఈ సందర్భంగా త్వరలోనే అమెరికాలో భేటీ కావాలని ఇరునేతలు అంగీకరించారని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది.



## అయోధ్య విరాళాల చోరీపై దోషులకు కఠిన శిక్షలు వేయాలి: మోహన్ భగవత్

**నాగ్‌పూర్, జులై 5:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల గోల్మాల్ వ్యవహారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న ఈ అంశంలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందేనని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన సన్మార్గ్ మైండ్ వెల్నెస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మోహన్ భాగవత్ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే నిన్ననే దీనిపై స్పష్టమైన ప్రకటన విడుదల చేశారని, తాము ఆ ప్రకటనకే కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ వ్యవహారాన్ని ఒక సాధారణ ఘటనగా తీసుకోకుండా, అసాధారణమైనదిగా పరిగణించాలని ఆర్ఎస్ఎస్ సూచించింది. ఈ దురదృష్టకర ఘటనను ఆసరాగా చేసుకుని హిందూ ధర్మాన్ని, సమాజాన్ని అపకీర్తి పాలు చేయడానికి ప్రయత్నించే వ్యతిరేక, విద్రోహ శక్తుల కుట్రలను భక్తులు తిప్పికొట్టాలని సంఘ్ పిలుపునిచ్చింది. ఇదే కార్యక్రమంలో మోహన్ భాగవత్ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను కూడా ప్రస్తావించారు. శారీరక అనారోగ్యం మనిషిని బలహీనపరిచినప్పుడు, అది మానసిక స్థితిపై కూడా ప్రభావం చూపుతుందని, అందుకే సంపూర్ణ ఆరోగ్యానికి ప్రశాంతమైన మనస్సు ఎంతో అవసరమని చెప్పారు.

## అవినాష్ బ్యాంక్ ఖాతానుంచి రూ.15 లక్షల లావాదేవీలు..

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అవినాశ్ శుక్లా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 15 లక్షలకు పైగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డబ్బును పలువురికి ఆన్‌లైన్ ద్వారా ఇవ్వడంతో పాటు.. ఇంకొందరికి నగదు రూపంలో కూడా ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. అవినాశ్ శుక్లా తన గర్ల్‌ఫ్రెండ్‌కి సుమారు రూ. 2 లక్షల నగదుతో పాటు ఖరీదైన ఫోన్ బహుమతిగా ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నిధులు అన్నీ ఆలయ విరాళాల నుంచి మళ్లించినవేనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# జాతిసేవలో సాటిలేని శ్యామాప్రసాద్ ముఖర్జీ

**ప్రధాని నరేంద్ర మోడీ**

**న్యూఢిల్లీ, జులై 5:** ఇవాళ తేదీ జూలై 6.. జాతీయవాదం, నిస్వార్థ సేవ వంటి ఆదర్శాలకు ప్రాణమిచ్చే అసంఖ్యాక ప్రజానీకానికి ఇదొక ప్రత్యేక దినం. అంతులేని సాహసానికి, భరతమాతపై అత్యంత ఆరాధన భావనకు కాలాతీత నిదర్శనంగా నిలిచిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఈరోజే. ఆధునిక భారతంలో మేధస్సు, ప్రజాసేవ, నైతిక విశ్వాసమనే లక్షణాల అద్భుత సమ్మేళనం ఇంతగా మూర్తీభవించిన ఆయన వంటి నాయకులు దేశంలో చాలా అరుదు.

సురక్షిత, సుఖవంతమైన జీవితానికి లోటు లేని బాల్యం ఆయనది. శ్యామా ప్రసాద్ తండ్రి, సర్ అశుతోష్ ముఖర్జీ సమకాలీన అగ్రశ్రేణి విద్యావేత్తలలో మేధావులలో ఒకరు. అలాంటి సంపన్న కుటుంబంలో పుట్టినప్పటికీ సకల సౌఖ్యాలనూ వదులుకుని త్యాగం, జాతి సేవ దిశగా ఆయన అంతరాత్మ నడిపించింది. వలసవాదం, మతతత్వం, మానవతా సమస్యలు వంటివి కమ్ముకున్న నాటి కల్లోల కాలంలో ఒక మూగ ప్రేక్షకునిగా మిగిలిపోవడం తగదని ఆయన దృఢంగా విశ్వసించారు. ఈ ప్రస్థానంలో ఆయన తొలుత పసికందుగా ఉన్న బిడ్డను, ఆ తర్వాత భార్యను కోల్పోయారు. అంతటి తీవ్ర వ్యక్తిగత విషాదాలను చవిచూసినప్పటికీ దేశ సేవపై ఆయన సంకల్పం మరింత బలపడి, తిరుగులేని నిబద్ధతతో ముందుకే నడిపింది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజా జీవనాన్ని అన్నింటికన్నా ఎక్కువగా నిర్వచించిన ఆదర్శం ఏదైనా ఉందంటే అవిభాజ్య భారత్ దిశగా ఆయన దీక్ష. దేశ విభజన సంక్షోభ సమయాన పశ్చిమ బెంగాల్ భారత్‌లో అంతర్భాగంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. ఆనాడు దృఢంగా నిలబడిన ఆయన విశ్వాసమే కొన్నేళ్ల తర్వాత ఆయనను జమ్మూకాశ్మీర్ వైపు నడిపింది. ఆ క్రమంలో జైలుపాలైనా ఆ జీవితం ఆయన ఉత్సాహాన్ని నీరుగార్చలేక పోయింది. కారాగార ఏకాంతం ఆయనను ఎంతమాత్రం కుంగదీయలేదు. ఏ ప్రజల ఆశయాన్ని తనదిగా చేసుకున్నారో వారికి అత్యంత దూరంగా, నిర్బంధంలోనే ఆయన జీవితం హఠాత్తుగా ముగిసింది. చరిత్రలో కొన్ని క్షణాలుంటాయి.. అంతిమ శ్వాసలోనూ ఒక వ్యక్తి త్యాగం రాజకీయాలకు అతీతంగా జాతీయ స్మృతిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అటువంటి క్షణాల్లో డాక్టర్ ముఖర్జీ జీవన ప్రస్థానం ఒకటిగా మిగిలింది. ఆచార్య వినోబా భావే చెప్పినట్లు తాను విశ్వసించిన ఆదర్శం కోసం డాక్టర్ ముఖర్జీ ఆత్మార్పణకు వెనుదీయలేదు. అటుపైన ఎన్నో ఏళ్ల తర్వాత 2019లో ఆర్టికల్ 370,35(ఎ)ల రద్దు ఆయన అమరత్వానికి అత్యంత సముచిత నివాళి అనడంలో సందేహం లేదు.

డాక్టర్ ముఖర్జీ సదా దేశానికే ప్రథమ స్థానమిచ్చారు. భారతీయ విలువలకే పెద్ద పీట వేశారు. తదనుగుణంగా ఆనాటి సంప్రదాయ ఆలోచనలకు సవాలు విసురుతూ సంస్థల, వ్యవస్థలకు రూపమివ్వడం ద్వారా ఆయన ఈ లక్ష్యం సాధించారు. అత్యంత పిన్న వయసులోనే కోలకత్తా విశ్వవిద్యాలయానికి ఉప కులపతి అయ్యారు. తనదైన శైలిలో, దేశభక్తి, భవిష్యత్ దృక్పథంతో



శ్యామా ప్రసాద్ ముఖర్జీ(ఫైల్)

కూడిన అనేక సానుకూల మార్పులు తెచ్చారు. ఓ సారి విద్యావేత్తల సదస్సులో ప్రసంగించిన సందర్భంగా భవిష్యత్ గుమాస్తాలను, తక్కువ జీతాలు పొందేసిబ్బందిని ఉత్పత్తిచేసే కర్మాగా రాలుగా విద్యా సంస్థలను చిన్న చూపు చూడటం తగదు. స్థానిక సంస్థలు, పురపాలక, రాష్ట్ర, కేంద్ర చట్టసభలను నడిపించగల ఉద్దండులుగా విద్యార్థులను మనం తీర్చిదిద్దాలి. అదే తరహాలో ఆర్థిక, వాణిజ్య,పారిశ్రామిక తదితర జనజీవన ప్రాధాన్య రంగాల వ్యవహారాలను నడిపించగల సమర్థులుగా తయారు చేయాలని కుండబద్దలు కొట్టారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ సారథ్యంలో కలకత్తా విశ్వవిద్యాలయం అనేకవిధాలుగా ముందంజ వేసింది. ఆయన హయాంలో గ్రంథాలయ మౌలిక సదుపాయాల మెరుగుదల, విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు ప్రోత్సాహం, పురావస్తు అధ్యయనం, వ్యవసాయంలో కొత్త కోర్సులకు శ్రీకారం వంటి విశిష్ట కృషి కొనసాగింది. క్రీడలు, ఉపాధ్యాయ శిక్షణ, విద్యార్థుల సంక్షేమం తదితరాలపైనా ఆయన ఏక కాలంలో దృష్టి సారించారు. ప్రస్తుతపూర్వ విద్యార్థులలో తమ విశ్వవిద్యాలయంపై సగర్వ భావనను ప్రోదిచేస్తూ, ఏటా జనవరి 24న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. విశ్వవిద్యాలయంపై ఒకపాట రాయాల్సిందిగా గురుదేవులు రవీంద్రనాథ్ టాగోర్‌ను ఆయన అభ్యర్థించారు.

ఈ స్ఫూర్తికి మరో ఉదాహరణ ఆయన జీవిత చరమాంకంలో కనిపిస్తుంది. అప్పట్లో భారతీయ జనసంఘ్‌ను రూపుదిద్దాలని నిర్ణయించుకున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రాభవం ఉచ్ఛస్థాయిలో ఉన్న సమయాన మనవైన సాంస్కృతిక మూలాలకు కట్టుబడుతూనే దేశ ప్రగతి కోసం గళం విప్పే ప్రత్యామ్నాయ స్వరం ఒకటి అవసరమని ఆయన భావించారు. అది ఓ చిన్న దివ్వె లాంటిదైనా పరవాలేదని భావించారేమో అన్నట్లుగా దాని చిహ్నంగా మట్టి దీపం గుర్తును డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎంచుకోవడం గమనార్హం. ప్రమిద ఎంత చిన్నదైనా, దాని వెలుగు స్వల్పమే అయినా తన పరిధికి మించి చీకటిని పారదోలగల శక్తి దానికి ఉంటుందని భావించారు. తదనంతర క్రియాశీల మనుగడలోనూ జనసంఘ్ ఇదేవిధంగా ముందడుగు వేసింది. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి దేశ ప్రగతిపై గల అవగాహన ఎంతటిదో భారత తొలి పరిశ్రమలు పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఆయన పదవీకాలం వెల్లడిస్తుంది. ఒక రాజనీతిజ్ఞుడిగా, అసాధారణ నిజాయితీ, మానవతా దృక్పథం కలగలసిన నాయకుడుగా ఆయన సామర్థ్యం స్పష్టమవుతుంది.

ఈ సందర్భంగా నేనొక వ్యక్తిగత అనుభవాన్ని పంచుకోవాలని భావిస్తున్నాను. స్వావలంబనపై విస్పష్ట దార్శనికతతో డాక్టర్ ముఖర్జీ స్థాపించిన సింద్రీ కర్మాగారాన్ని అనేక దశాబ్దాల పాటు దేశాన్నేలిన పాలకులు నిరక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో దాని పునరుద్ధరణలో తోడ్పడే అవకాశం మా ప్రభుత్వానికి లభించడం నాకు దక్కిన గౌరవంగా నేనుభావిస్తున్నాను. ఆ కార్యక్రమంలో పాల్గొనడం నా జీవితంలోని అత్యంత ప్రత్యేక క్షణాలలో ఒకటిగా నిలిచిపోయిందంటే అతిశయోక్తి కాబోదు. పండిట్ నెహ్రూ 75 ఏళ్ల కిందటే భావ ప్రకటనా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడితో సమానమైన తొలి రాజ్యాంగ సవరణను తెచ్చారు. దాన్ని డాక్టర్ ముఖర్జీ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ మనోభావన ఏమిటో ఆయన పూర్తిగా అవగతం చేసుకున్నారు. అదే పూర్తిగా సరైనదని కూడా నిరూపితమైంది. అలనాడు.. 75 ఏళ్ల కిందట తొలి సవరణ తెచ్చిన వారే 1975లో ఎమర్జన్సీకి కూడా కారకులయ్యారు. అటుపైన 50 ఏళ్ల కిందట ఉదార ప్రజాస్వామ్య విలువల మూలాలపై మరోసారి దెబ్బకొడుతూ 42వ సవరణ చట్టం తెచ్చారు. మానవతా వాదాన్ని సమున్నతంగా నిలపడం లోనూ డాక్టర్ ముఖర్జీ ప్రత్యేక గుర్తింపు పొందారు. బెంగాల్లో 1943నాటి అత్యంత ఘోరమైన కరువు విజృంభించినపుడు ఆయన బాధితుల సేవలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ప్రజలకు ఆహారం సమకూర్చడం కోసం అనేక స్వచ్ఛంద వంటశాలలు, సహాయ శిబిరాలు ఏర్పాటు చేసేలా అవిరళ కృషి చేశారు. ప్రజల దుస్థితి చూసి నిలు వెల్లా చలించిపోయిన ఆయన, వలస పాలకుల నిర్దాక్షిణ్య వైఖరిని తీవ్రంగా నిరసించారు. పంచేషర్ మన్వంతర్ పేరిట తాను రాసిన పుస్తకంలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. అంతకుముందు 1942లో మేదినీపూర్‌ను ఒక మహా తుఫాను వణికించినపుడు పరిస్థితుల పునరుద్ధరణ దిశగా ఆయన కృషికి విస్తృత ప్రశంసలు లభించాయి. ఆరోజుల్లో కలకత్తాలోని ఓ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి మా ట్లాడుతూ మీరు ఏ పని చేపట్టినా శ్రద్ధగా, క్షుణ్ణం గా, అర్థవంతంగా చేయండి. ఏ పనినీ అర్థాం తరంగా వదిలేయకండి అరకొర ఫలితంతో సంతృప్తి చెందకండి.. మీ అత్యుత్తమ కృషితో సత్ఫలితం సిద్ధించే దాకా పట్టువీడకండి" అనిడాక్టర్ ముఖర్జీ పిలుపునిచ్చారు.

దేశం ఇవాళ వికసిత భారత్ స్వప్న సాకారం దిశగా పురోగమిస్తున్న తరుణాన ఆయన ప్రగాఢంగా విశ్వసించిన శక్తి యుత, సమైక్య, ఆత్మవిశ్వాసపూరిత, కరుణార్ద్ర దేశ నిర్మాణానికి నిత్యం కృషి చేయడమే ఆయనకు మనం అర్పించగల అత్యుత్తమ నివాళి. ఈ నేపథ్యంలో నేటి యువత దృక్పథం గురించి నాకు బాగా తెలుసు కాబట్టి, నేటి సందర్భానికి తగినట్లు వారంతా డాక్టర్ ముఖర్జీ ఆశయాలకు న్యాయం చేసేందుకు అహరహం శ్రమిస్తారని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.






## మెటాకు కేంద్ర ఐటిశాఖ నోటీసులు

**న్యూఢిల్లీ,జులై 5:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్ (సీఎస్ఈఏఎం) చెల్లింపు ప్రకటనల రూపంలో ప్రత్యక్షం కావడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై మెటాకు శనివారం నోటీసులు జారీ చేసిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ వారం రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నిర్దేశిత గడువులోగాస్పందించకుంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టం, పోక్సో చట్టం2012 కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ ఆరోపణలపై మెటా ప్రతినిధి స్పందిస్తూ, సీఎస్ఈఏఎం విషయంలో తమ సంస్థ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని తెలిపారు. ఇలాంటి కంటెంట్‌ను, దానిని వ్యాప్తి చేసే నేరగాళ్లను గుర్తించడానికి మేము అధునాతన ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాము. అయినప్పటికీ, 350 కోట్లకు పైగా ఉన్న మా వినియోగదారులలో దాగి ఉన్న నేరగాళ్లతో మా పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది. మా నిపుణుల బృందాలు రక్షణ వ్యవస్థలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూనే ఉన్నాయని ఈమెయిల్ సమాధానంలో పేర్కొన్నారు.

## 3వేలకు పెరిగిన వెనెజులా మృతులు

**కారకాస్, జులై 5:** వెనుజులా భూకంపం ఆ దేశానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. గత నెలలో సంభవించిన రెండు వరుస భూకంపాల వల్ల దాదాపు మూడు వేల మంది మరణించినట్లు అంచనా. ఇప్పటికే 2,954 మందికిపైగా మృతదేహాల్ని సహాయక బృందాలు వెలికితీశాయి. మరోవైపు సహాయక చర్యలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. ముఖ్యంగా విదేశీ సహాయక బృందాలు వెనుజులాను వీడుతున్నాయి. గత జూన్ 24న వెనుజులాలో వరుసగా రెండు భూకంపాలు సంభవించాయి. దక్షిణ కారకాస్ ప్రాంతంలో 7.2 తీవ్రతతో ఒక భూకంపం, 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించాయి. దీంతో అనేక బిల్డింగులు సహా నిర్మాణాలు నేలకూలాయి. 72 గంటల్లో ఎక్కువ మందిని బతికించడానికి రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తాయి. అయితే, భూకంపం సంభవించి దాదాపు 9రోజులు కావడంతో సహాయక చర్యల్నినెమ్మదిగా కొనసాగిస్తున్నారు. ఎందుకంటే ఈ సమయంలో బాధితులు బతికి ఉండే అవకాశాలు చాలా తక్కువ.

## బంగారు రామచరిత మానస్ అదశ్యంపై ఫిర్యాదు

**అయోధ్య,జులై 5:** అయోధ్య రామమందిరంలో విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలోనే మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. తాను, తన కుటుంబం అత్యంత భక్తిశ్రద్ధలతో బహూకరించిన కోట్లాది రూపాయల విలువైన బంగారు పూత రామ చరితమానస్ గ్రంథం అదృశ్యం కావడంపై కేంద్ర మాజీ హోంశాఖ కార్యదర్శి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారంపై ఆయన స్పష్టత కోరుతున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్. లక్ష్మీ   ్మ నారాయణన్, ఆయన భార్య సరస్వతి కలిసి 2024 ఏప్రిల్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు ఒక అమూల్యమైన బహుమతిని సమర్పించారు. తులసీదాస్ రచించిన రామచరితమానస్‌లోని 10,902 శ్లోకాలతో కూడిన 522 పేజీలకు బంగారు పూత పూయించి, ఒక గ్రంథం గా రూపొందించారు.

సుమారు 147 కిలోల బరువున్న ఈ గ్రంథం విలువ దాదాపు రూ.4.5 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ గ్రంథాన్ని ఆలయంలో కొన్ని నెలల పాటు భక్తుల దర్శనార్థం ఉంచారని, ఆ తర్వాత ఎలాంటి సమాచారం లేకుండా దానిని అక్కడి నుంచి తొలగించారని లక్ష్మీ   ్మనారాయణన్ ఆవేదన వ్యక్తం చేశారు. రామజన్మభూమి ఉద్యమంతో మా కుటుంబానికి ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. నా దివంగత తల్లిఏళ్ల తరబడి రామనామాన్ని రాశారు. నా పదవీ విరమణ తర్వాత వచ్చిన సంపాదనతో శ్రీరాముడికి సేవగా ఈ కానుకను సమర్పించాను. దీని ద్వారా గుర్తింపు కోరుకోవడం లేదు, కేవలం పారదర్శకత మాత్రమే కావాలి. ప్రతిరోజూ దానికి పూజలు జరిగేవి, భక్తులు దర్శించుకునేవారు. అప్పుడు నేను చాలా సంతోషించాను. కానీ అకస్మాత్తుగా దాన్ని అక్కడి నుంచి తీసేశారని ఆయన వాపోయారు.



## హార్ముజ్ మీదుగా వచ్చే నౌకలకు సేవా రుసుం
### మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు
### ఇరాన్‌ప్రతినిధి వెల్లడి

**బీజింగ్,జులై 5:** ప్రపంచ ఇంధన వాణిజ్యంలో అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై సేవా రుసుములు వసూలు చేయనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికాతో కుదుర్చుకున్న 60 రోజుల ఉచిత ప్రయాణ ఒప్పందం ముగిసిన తర్వాత ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. కష్టకాలంలో తమకు మద్దతుగా నిలిచిన స్నేహపూర్వక దేశాలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపింది. చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దొల్‌రెజా రహ్మానీ ఫజ్లీ బీజింగ్‌లో జరిగిన వరల్డ్ పీస్ ఫోరంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ రుసుములను టోల్ ఫీజుగా పరిగణించరాదని, నౌకల భద్రత, ట్రాఫిక్ పర్యవేక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలు అందించినందుకు మాత్రమే వసూలు చేస్తున్నామని ఆయన వివరించారు.

## సిఎం విజయ్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రూ.180 కోట్లు ఖర్చు!
### మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై పోలీసులు లుకౌట్ నోటీసులు



**చెన్నై,జులై 5:** తమిళనాడులో కొత్తగా ఏర్పాటైన సీఎం జోసెఫ్ విజయ్ (టీవీకే) ప్రభుత్వాన్ని పడదోసేందుకు కుట్ర జరుగుతోందన్న ఆరోపణలపై చెన్నై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో డీఎంకే మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు ఆర్ వి.అశోక్ కుమార్‌లపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ఒక టీవీకే ఎమ్మెల్యేకు రూ. 35 కోట్లు ఆఫర్ చేసినట్లు వస్తున్న ఆరోపణలపై పోలీసులు వేట సాగిస్తున్నారు. ఈ కేసులో గతనెల 29న ఉత్తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇళయరాజా ఫిర్యాదు చేశారు. ఒక ఒపీనియన్ పోలింగ్ సంస్థ అధినేతనని చెప్పుకుంటూ ఒక వ్యక్తి ఒక ప్రధాన రాజకీయ పార్టీ తరఫున తనకు కోట్ల రూపాయల లంచం ఆఫర్ చేశాడని, దాన్ని తిరస్కరించడంతో తన కుటుంబానికి ప్రాణహాని కలిగించేలా బెదిరింపులకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ట్రిప్లికేన్ పోలీసులు ప్రధాన నిందితుడు తిరునావుక్కరసుతో పాటు ఆయన అనుచరులు నరేష్, త్యాగరాజన్ సహా ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరి విచారణలో ఈ కుట్ర అంతా సెంథిల్ బాలాజీ, అశోక్ కుమార్ల ప్రత్యక్ష ఆదేశాల మేరకే జరిగినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. సెంథిల్ బాలాజీని సోమవారం విచారణకు హాజరుకావాలని కరూర్ జిల్లా రామేశ్వరపట్టిలోని సెంథిల్ బాలాజీ పూర్వీకుల నివాసంలో సమన్లు కూడా జారీ చేశారు. శాసనసభ్యులను ప్రలోభపెట్టేందుకు ఏకంగా రూ. 180 కోట్లు కేటాయించారని దర్యాప్తులో తేలడంతోపరారీలో ఉన్న నిందితుల కోసం కరూర్, తిరుచిరాపల్లి, కోయంబత్తూర్, బెంగళూరులలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఎలాంటి స్వతంత్ర ఆధారాలు లేకుండా కేవలం కాల్ డేటా ఆధారంగానే తనను ఇరికిస్తున్నారంటూ అశోక్ కుమార్ ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

## ఒక్క దెబ్బతో అందర్నీ లేపేయొచ్చు..
### ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**టెహ్రాన్, జులై 5:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీఖమేనీ అంత్యక్రియలతో ఆ దేశం శోక సంద్రంలో మునిగిపోయింది. అమెరికా–ఇరాన్ యుద్ధం మొదలైన సమయంలోనే ఖమేనీని అమెరికా బలగాలు హతమార్చాయి. అయితే, ఈ అంత్యక్రియలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్ అగ్రనేతలంతా ఒకేచోట చేరారని, తలచుకుంటే ఒక్క దాడితో వారందరినీ హతమార్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం దౌత్య చర్చలు కొనసాగుతున్నందున అలాంటి చర్య తీసుకోవడం లేదని చెప్పడం చర్చనీయాంశమైంది. అమెరికా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ 'అందరూ ఒకేచోట ఉన్నారు. ఒక్క దాడి చేస్తే అందర్నీ అంతం చేయొచ్చు. కానీ అలా చేయం. ఎందుకంటే అలా చేస్తే చర్చలు జరిపేందుకు ఎవరూ మిగలరు' అని వ్యాఖ్యానించారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ప్రజలు పాల్గొని నివాళులర్పించడంపై కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఖమేనీని ఇరాన్ ప్రజల్లో చాలా మంది వ్యతిరేకిస్తారని తాను భావించానని, అయితే భారీ సంఖ్యలో ప్రజలు దుఃఖించడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. 'అవి నిజమైన కన్నీళ్లు కాకపోవచ్చు.. నకిలీ కన్నీళ్లు కూడా కావచ్చు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు అక్సియోస్ పేర్కొంది. ఇరాన్ అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని కూడా ట్రంప్ అన్నారు. వాళ్లు ఒప్పందం కోసం వేడుకుంటున్నారు అని పేర్కొన్న ఆయన, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇరు దేశాలు వారం రోజుల పాటు చర్చలు, సైనిక చర్యలను తాత్కాలికంగా నిలిపివేయాలని అంగీకరించాయని తెలిపారు.

అయితే, ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'మీకు నాగరికత లేదు.. చరిత్ర లేదు.. గౌరవం లేదు. అందుకే ఇలాంటి విషయాలు మీకు అర్థం కావు'



అంటూ ట్రంప్‌పై తీవ్రవిమర్శలు చేసింది. టెహ్రాన్‌లో నిర్వహించిన ఖమేనీ అంత్యక్రియలకు వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఇరాన్ జెండాలు ఊపుతూ, ఖమేనీ చిత్రపటాలతో ప్రజలు నివాళులర్పించారు. ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యుల శవపేటికలను కూడా ప్రజల సందర్శనార్థం ఉంచారు.

ఖమేనీ మరణం తర్వాత ఆయన వారసుడిగా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మోజ్తాబా ఖమేనీ ఇప్పటివరకు ప్రజల ముందుకు రాలేదు. ఇటీవల జరిగిన దాడిలో ఆయన కూడా గాయపడినట్లు సమాచారం ఉన్నప్పటికీ, దీనిపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

# సంక్షిప్త వార్తలు

## బంకిపూర్ నుంచే ప్రశాంత్ కిశోర్ పోటీ..



**పాట్నా,జులై 5:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. బీహార్‌లోని బంకిపుర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో ఆయన పోటీ చేయనున్నట్టు జన్ సురాజ్ పార్టీ (జేఎస్‌పీ) చీఫ్ మనోజ్ భారతి ఆదివారం ప్రకటించారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానం నుంచి కిశోర్ బరిలో దిగుతుండటంతో ఆయన రాజకీయ అరంగేట్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది.

## కోల్‌కతాలో అదానీ 2వేల పడకల ఆసుపత్రి




**కోల్‌కతా, జులై 5:** పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆరోగ్యరంగంలో మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపంలోని న్యూటౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో ఒక అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఇందులో సగంపడకలను అంటే 1,000 బెడ్లను పేదరోగులకు పూర్తిగాఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. తన నియోజకవర్గం భవానీపూర్‌లో పౌరసమాజ ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశంలో సీఎం మాట్లాడారు.

## పాండవానీ జానపద కళాకారిణి తీజన్‌బాయి కన్నుమూత



**రాయ్‌పూర్,జులై 5:** ప్రఖ్యాత పాండవానీ జానపద కళాకారిణి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత తీజన్ బాయి (70) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో తలెత్తిన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, రాయ్‌పూర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో భారతీయ జానపద కళారంగంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసినట్లయింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తీజన్ బాయి, మహాభారత గాథలను తనదైన శైలిలో గాత్రం, అభినయంతో ఆవిష్కరించి అంతర్జాతీయ గుర్తింపు పొందారు.

## టిఎంసి మాజీ ఎమ్మెల్యేపై లైంగిక దాడి ఫిర్యాదులు



**కోల్‌కతా,జులై 5:** పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే షౌకత్ మొల్లాపై కొత్తగా లైంగికదాడి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పటికే ఓ బాంబు పేలుడు కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయనపై ఇద్దరు మహిళలు ముందుకు వచ్చి సంచలన ఆరోపణలు చేశారు. షౌకత్, అతడి అనుచరులు తమపై అత్యాచారం, చిత్రహింసలకు పాల్పడ్డారని వారు మీడియా ముందు వాపోయారు. 2019లో షౌకత్ మొల్లా తన కొడుకును కిడ్నాప్ చేసి, ఏడాది పాటు నిర్బంధంలో ఉంచారని బాధిత మహిళ ఆరోపించారు.

## ట్రంప్‌కు ప్రధాని మోడీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ,జులై 5:** అమెరికా సంయుక్త రాష్ట్రాల 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ దేశ ప్రజలకు మరియు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఈ అపూర్వ మైలురాయిని పురస్కరించుకుని అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. రాబోయే 250 ఏళ్లలో అమెరికా మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షిస్తూ, రెండు దేశాల మధ్య భాగస్వామ్యం నూతన శిఖరాలకు చేరుకోవాలని ఆశించారు.

## ఎల్‌ఎన్జీ సరఫరా పునరుద్ధరణతో ఆంక్షలు ఎత్తివేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, జులై 5:** అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గి, పశ్చిమ ఆసి యాలో కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో భారత్‌కు లిక్విడ్ నేచురల్‌గ్యాస్ సరఫరా మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన అత్యవసర సహజ వాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వులను అధికారికంగా ఉపసంహరించుకుంది. ఈ నిర్ణయంతో ఎల్‌ఎన్జీపై ఆధారపడిన పరిశ్రమలకు పెద్ద ఊరటలభించింది. కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో నౌకలరవాణా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పెట్రోలియం అండ్ సహజ వాయువుల మంత్రిత్వశాఖ తాజా నోటిఫికేషన్ జారీ చేస్తూ అత్యవసర ఆంక్షలను ఎత్తివేసింది.

బిఆర్ఎస్ వాళ్లు కమీషన్ల కోసం కాళేశ్వరం కడితే..

# మేము పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం

## కన్నెపల్లి పర్యటనలో కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 5:** కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని, నాణ్యతలేని నిర్మాణాలతో తెలంగాణ ప్రజలపై భారాన్ని మోపిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా విమర్శించారు. కన్నెపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నమేనని మంత్రి అన్నారు. "పేదలకు ఇళ్లు కడితే కమీషన్లు రావు... కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు కడితేనే కమీషన్లు వస్తాయనే ఆలోచనతో బీఆర్ఎస్ పాలకులు పేదల గృహాల అవసరాన్ని విస్మరించారు. అందుకే నేడు తెలంగాణ ప్రజలు వారిని అధికారానికి దూరం చేశారు" అని మంత్రి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా,కమీషన్ల కోసమే నిర్మించడం వల్లే నేడు మరమ్మతుల అవసరం వచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. "అసలు రిపేరు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? మీ అవినీతి, మీ కక్కుర్తే దానికి కారణం కాదా? మీరు నాసిరకం నిర్మాణాలు చేసి కూల్చేసి... ఇప్పుడు వాటిని ప్రభుత్వం బాగు చేయలేదని విమర్శించడం హాస్యాస్పదంన" అని మండిపడ్డారు.

కన్నెపల్లిలోకి వెళ్లి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, వాస్తవాలను దాచిపెట్టి అబద్ధాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారి ప్రయత్నాలు ఇక ఫలించవని అన్నారు.తెలంగాణ ప్రజల రక్తాన్ని, చెమటను దోచుకుని వేల కోట్ల అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్‌కు పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు సంక్షేమం, మహిళల సాధికారత, ఉపాధి కల్పన వంటి సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తోందని, కమీషన్ల కోసం కాదు.. ప్రజల కోసం పాలన సాగిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# సన్నరకం బోనస్‌కు చెక్

## ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** సన్న రకం వడ్లకు ప్రకటించిన బోనస్ అమలులో పూర్తి పారదర్శకత తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యే క మార్గదర్శకాలను విడుదల చేసింది. 2026 వానాకాలం సీజన్లో సాగుచేసే రైతులకు బోనస్ అందించేందుకు విత్తనాల కొనుగోలు, సాగు వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేసింది. వ్యవసాయశాఖ తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు సన్న వరి రకాలకే బోనస్ వర్తించనుంది. దీంతో రైతులు, విత్తన డీలర్లు నిర్దేశించిన విధంగా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. రైతులకు సన్న వరి విత్తనాలు విక్రయించిన వెంటనే విత్తన డీలర్లు వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇందుకోసం వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ప్యాడీ ఫైన్ వెరైటీ సేల్స్ ఆప్షన్ ద్వారా వివరాలు నమోదు చేసి సమర్పించాలి. డీలర్లకు క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా పోర్టల్ లోకి ప్రవేశించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. నమోదు సమయంలో రైతు పేరు, తండ్రి పేరు, మొబైల్ నెంబర్, ఆధార్ నంబర్, విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నంబర్, డీలర్ వివరాలు, కొనుగోలు తేదీ, విత్తన ప్యాకెట్ పరిమాణం వంటి వివరాలు నమోదు చేయాలి. డీలర్ల వద్ద విత్తనాలు కొనకుండా, గత పంట నుంచి విత్తనాలు సిద్ధం చేసుకొని సాగుచేసే రైతులు కూడా బోనస్ కు అర్హులని స్పష్టం చేసింది. అయితే, అలాంటి రైతులు తమ గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ని సంప్రదించి సాగు వివరాలను నమోదు చేసుకోవాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ శాఖ ప్రత్యేక మొబైల్ యాప్‌లో సన్న వరి నమోదుకోసం ప్రత్యేక ఆప్షన్ అందు బాటులోకి తీసుకొచ్చింది. క్షేత్ర స్థాయిలో ఏఈఓలు రైతుల సాగు వివరాలను యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. అయితే, వ్యవసాయ శాఖ సూచించిన గడువులోపు నమోదు పూర్తి చేసిన రైతులకే సన్న వడ్ల బోనస్ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. రైతులు నమోదు ప్రక్రియను నిరక్ష్యం చేయకుండా వెంటనే పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు.

# ద్రవ్యోల్బణం కంటే ఎఐతోనే పెనుముప్పు

## ఆర్‌బిఐ సంచలన నివేదిక

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త :**దేశ ఆర్థిక వ్యవస్థకు సంప్రదాయ ముప్పులైన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల కంటే వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతే అత్యంత ప్రమాదకరంగా మారిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ హెచ్చరించింది. తాజాగా విడుదల చేసిన జూన్ 2026 నాటి ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్‌లో ఆర్‌బీఐ ఈ విషయాలను వెల్లడించింది. ఆర్థిక రంగంలో ఏఐ వల్ల పనితీరు మెరుగైనప్పటికీ, వ్యవస్థ భద్రతకు ఇది పెద్ద సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేసింది. రాబోయే 12 నెలల్లో దేశ ఆర్థిక సంస్థలకు ఎదురయ్యే ముప్పులలో ఏఐ ఆధారిత సైబర్ దాడులే అత్యంత ప్రమాదకరమైనవని నివేదిక స్పష్టం చేసింది.

# ఒవైసీ సోదరులకు భయం ఏమిటో చూపిస్తాం

## కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 5:** ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ తీరుపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రాజకీయ అండతోనే ఒవైసీ బరితెగించి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు.



చివరికి న్యాయస్థానాలను కూడా గౌరవించకుండా, హైకోర్టునే బెదరించేలా ఒవైసీ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అడ్డగోలుగా తప్పులు చేస్తూ మళ్లీ హైకోర్టునే ప్రశ్నిస్తారా? అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం నేతలకు కోర్టులు అన్నా, చట్టాలు అన్నా అస్సలు గౌరవం లేదని ధ్వజమెత్తారు. చెరువులను ఆక్రమించుకుని విద్యా సంస్థలను నిర్మించడమే ఒక పెద్దతప్పని, దీనిపై హైకోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధా నం ఇవ్వకుండా ఒవైసీ ఎందుకు జాప్యం చేస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఫాతిమా విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు. గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న విద్యాసంస్థలకు కూల్చివేస్తామంటూ నోటీసుల మీద నోట ీసులు ఇస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యాసంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదు? ఒవైసీకి ఒక న్యాయం.. ఇతరులకు ఇంకో న్యాయమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఒవైసీ నేతృత్వంలోని సదరు విద్యాసంస్థ గతంలో మిలిటెంట్లకు షెల్టర్ ఇచ్చింది నిజం కాదా? అని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ విద్యార్థులకు చదువు చెప్పే ముసుగులో మిలిటెంట్లను తయారు చేస్తున్నారా? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేపు బీజేపీ అధికారంలోకి రాగానే అక్రమంగా కట్టిన ఫాతిమా విద్యా సంస్థలను కూల్చివేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. అక్ర మార్కులకు, అవినీతిపరులకు భయమంటే ఏమిటో చూపిస్తామన్నారు. అయితే, ఆ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న అమాయక విద్యార్థుల భవిష్యత్తు చెడిపోకుండా, వారికి ప్రభుత్వం తరపున ప్రత్యామ్నాయ విద్యావకాశాలను చూపిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

# కత్తి వెంకటస్వామిపై లోతుగా విచారించి చర్యలు తీసుకుంటాం

## ఎన్ఆర్ఐ సెల్ వినోద్‌కు షోకాజు నోటీసులు

## వచ్చే ఎన్నికల్లో రాముడికి ప్రతినిధిగా కాంగ్రెస్, రావణాసురుడి ప్రతినిధిగా బిజెపి

## పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి



**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి వెం కటస్వామి అంశంలో మరింత లోతుగా విచారించి చర్యలు తీసుకొం టామని, ఆయన భావోద్వేగంతో మాట్లాడినట్లు లిఖితపూర్వకంగా సమా ధానం ఇచ్చారని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. ఆదివారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటి సమావేశం జరిగింది. 'నా మాటలు కొంత రాంగ్ మెసేజ్ పోయింద'ని కత్తి వెంకటస్వామి ఒప్పు కొన్నారని మల్లు రవి తెలిపారు. పెద్దల సూచనల మేరకు సవరించు కొంటానని కత్తి రాతపూర్వకంగా వివరణ ఇచ్చుకొన్నారని మల్లు రవి తెలిపారు. కాంగ్రెస్ నాయకులలో ఏమైన బేధాభిప్రాయాలు ఉంటే పిసిసి చీఫ్‌కు దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ ని పలుచబారే వి ధంగా మాట్లాడితే కఠినంగా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎన్ఆర్ఐ సెల్ అధ్య క్షుడు వినోద్‌కు షోకాజు నోటిసులు ఇచ్చామని ఫిర్యా దులు వస్తేనే కాదు సుమోటోగా కూడా చర్యలు తీసుకొ నేందుకు నోటీసులు ఇస్తామని రవి హెచ్చరించారు. ఎన్ఆర్ఐ సెల్ అమరేందర్ రెడ్డి అచ్చంపేట అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ కి వ్యతిరేకంగా మాట్లాడారని వంశీ కృష్ణ కంప్లైంట్ ఇచ్చారనీతెలిపారు వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందనీ వివరించారు. కాంగ్రెస్ పార్టీలో భేదాభిప్రాయాలు ఉంటే టిపిసిసిసి కాంగ్రెస్ఇంచార్జీ దృష్టికి తీసుకొని పోవాలిఅంతేగాని పేపర్లో కానీ టీవీలో మాట్లాడితే సుమోటా గా తీసుకొని చర్యలు తీసుకుంటాము అని హెచ్చరించారు, బిజెపి బిఆర్ఎస్ పార్టీలు మేమే అధికారంలోకి వచ్చినట్టు మాట్లాడుతున్నారు ఇలాంటి సమయాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతా కలిసి ప్రతిపక్షాలపై విరుచుకపడాలనీ ప్రభుత్వంపై చేసే అబద్ధాలను తిప్పికొట్టాలనీ పిలుపునిచ్చారు. నేను కాంగ్రెస్ స్వయక్ సేవక్ సంఘ్ సభ్యుడిని అని ఆయనే స్వయంగా ప్రకటించుకొన్నారు. ఇది కాంగ్రెస్ స్వయం సేవక్ సంఘ్ ఎందుకంటే పార్టీ పుట్టినప్పుడే దేశం కోసం,బానిసత్వం నుండి బయట పడాలని స్వాతంత్ర్య ఉద్యమం చేసిందనీ ఆయన వివరించారు. భారత జాతి విముక్తి స్వేచ్ఛ కోసంపని చేసిన పార్టీ మాది అని ఆయన వివరించారు. స్వాతంత్ర పోరాటంలో బిజెపిలేదు.. ఆర్ఎస్ఎస్ లేదు అని చెప్పారు. బిజెపి చెప్పే జాతీయ భావాలు మేము ఎప్పుడో చెప్పినం బిజెపి కొత్తగా ఏం చెప్పడం లేదనీ అన్నారు. ఆర్ఎస్ఎస్ కంటే సిఎస్ఎస్ గొప్పదని మీది కొంతమందికే పరిమిం మాది అందరికి పరిమితం అని అని అభివర్ణించారు. రాముడిపేరుతో మూడుసార్లు గెలిచి ఇప్పుడు శ్రీరాముడిని దోచుకొంటున్నారని ఆరోపించారు.బంగారం వెండి ఇటుకలు తినేశారని విమర్శించారు. ఇంతకు ముందు దోపిడి ఏ ఆలయంలో జరగలేదని సిసికెమెరాల కళ్ళు కప్పి దోచుకొన్నారని దుయ్యబట్టారు. ఆర్ఎస్ఎస్ కులం,మతంతో రాజకీయాలు చేస్తుందనీ ఆరోపించారు. విదేశాలు భారత దేశాన్ని డెమోక్రటిక్ దేశం కాదేమో అనుకుంటున్నారనీ ఆయన ఆవేదన చెందారు. అయోధ్య రామమందిరంలో జరిగిన సంఘటన ప్రజలు ముక్కున వేలు వేసుకునే పరిస్థితి తీసుకొని వచ్చిందనీ విమర్శించారు,మోదీ నాయకత్వంలో వేసిన కమిటీ సభ్యులు ఇందులో ఉన్నారు రామున్ని బిజెపి పార్టీ మోసం చేసిందని అన్నా రు. భవిష్యత్తులో దేశంలో వచ్చే ఎన్నికల్లో రామునికి రావణాసురుడి కి మధ్య పోటీ జరుగుతుందనీ రామున్ని కాంగ్రెస్ పార్టీ, రావణాసురున్ని బిజెపి పార్టీ రిప్రజెంట్ చేస్తుందనీ తెలిపారు. బిజెపి కి మొన్న జరిగినవే చివరి ఎన్నికలని మల్లు రవి జోస్యంచెప్పారు.

# 16 నుంచి హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో చేతివృత్తి కళాకారుల వస్తుప్రదర్శన

## అన్ని సంప్రదాయ కులవృత్తుల కళాకారులకు స్టాళ్లు : మంత్రి పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 5:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాల సంద ర్భంగా ఈ నెల 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స (పెద్దఅంబేద్కర్ విగ్రహం పక్కన) రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తుప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల పండుగకు అవసర మైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందు బాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయ కళలు, గ్రామీణ వృత్తిదారులకు ఈ మేళా గొప్ప వేదికగా నిలుస్తుందని, బోనాలు కేవలం ఆధ్యాత్మిక ఉత్సవమే కాకుండా తెలంగాణ సంస్కృతి, కళలు, చేతివృత్తుల వైభ వాన్ని ప్రతిబింబించే మహోత్సవమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, నేత కళాకారులు, బంగారు పనివారు, రాతి శిల్పులు, బుట్టల తయారీదారులు, తోలు కళాకారులు తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తోందని తెలిపారు. బోనాల సందర్భంగా అవసరమయ్యే మట్టి బోనం కుండలు, మట్టి దీపాలు, వెదురు బుట్టలు, గంపలు, జల్లెడలు, పిత్తళి, రాగి చెంబులు, కలశాలు, ఘటాలు, గంటలు, పూజా సామగ్రి, వెదురు అలంకరణ వస్తువులు, పూల దండలు, తోరణాలు, బోనం అలంకరణ వస్త్రాలు, గాజులు,పూసల అలంకరణ సామగ్రి, పోతురాజు ఉపయోగించే కొరడాలు, కాళ్ల గజ్జెలు, డప్పులు, డోలు వంటి సంప్రదాయ వాద్యాలు, చెక్కతో తయారుచేసిన పూజ పీటలు, చిన్న మండపాలు తదితర అనేక వస్తువులు ఈ మేళాలో అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు.

# ఓటర్ల ఎన్యూమరేషన్ గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలి

## ప్రజల్లో అవగాహన కల్పించాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 5:** తెలంగాణలో జరుగుతున్న ఎన్యూమరేషన్ (సర్) ప్రక్రియను మరో నెల రోజులపాటు పొడిగించాలని ఎన్నికల కమిషన్‌ను సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ జాన్ వెస్లీ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాపి తంగా ఎన్యూమరేషన్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో తీవ్రజాప్యం, గందరగోళం నెలకొని వున్నది. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు కేవలం 30 శాతం మందికి కూడా చేరలేదని, ఇంకా 70 శాతం మందికి ఫారాలు అందాల్సి ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో ప్రజలు ఈ ప్రక్రియపై దృష్టి సారించడం కష్టంగా మారిందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పట్ల సామాన్య ప్రజల్లో సరైన అవగాహన లేదు.

ఫారాలు నింపే విషయంలో ప్రజలు అనేక అనుమానాలకు, అపోహలకు లోనవుతున్నారు. కొంతమంది బీఎల్‌వోలు ఇంకా పూర్తిస్థాయిలో పనిలోకి దిగలేదని, ఓటర్ల అనుమానాలను నివృత్తి చేసే విషయంలో కొంత అవగాహన లోపం కనిపిస్తుందనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రజలు వివరాలు నమోదు చేసి బీఎల్‌వోలకు అందజేయడానికి మరింత సమయం అవసరం.

ఈ నేపథ్యంలో ప్రజలంతా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ వెంటనే గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొ న్నారు. అపోహలను తొలగించి, 'సర్' ప్రక్రియను సరళతరం చేయాలని చెప్పారు. ఈ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఎన్యూమరేషన్ గడువును మరో నెల రోజుల పాటు, అంటే ఆగస్టు 30 వరకు పొడిగించాలని ఆయన కోరారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు

## బిటి పత్తి కొత్తరకం అభివృద్ధి

## వ్యవసాయ వర్సిటీ విసి జానయ్య

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే తమ లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ అల్దాస్ జానయ్య చెప్పారు. రైతులలో బాగా ప్రాచు ర్యం పొందిన బీటీ పత్తి విత్తనంలో ఒక కొత్త రకాన్ని తాము అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలు విక్రయించే బీటీ పత్తి రకాల విత్తనాలకు ఇప్పుడు స్వదేశీ బీటీ పత్తి విత్తనాల నుంచి పోటీ ఎదురు కానుందన్నారు. విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన డబ్ల్యూజిసివి బీటీ28 పత్తి విత్తనం దక్షిణ భారతదేశంలో సాగుకు ప్రత్యేకంగా అనుకూలంగా ఉందని తెలిపారు. ఈ రకం, తీగ పత్తి విత్తనాలపై ప్రైవేట్ రైతులకు ఎకరానికి రూ.4,000 నుండి రూ.5,000 వరకు ఆదా చేస్తుందని చెప్పారు. బీటీ పత్తి విత్తన రకం మరో ముఖ్యమైన లక్షణం ఏమిటంటే, రైతులు పత్తి పంట కోత తర్వాత విత్తనాలను నిల్వ చేసుకొని, వాటిని తదుపరి పంట కాలాలకు ఉపయోగించు కోవచ్చన్నారు. దీనికి భిన్నంగా, ప్రైవేటుగా అమ్మే బీటీ పత్తి విత్తనాలను పండించే పొలాల నుండి సేకరించిన విత్తనాలు రెండవ తరంలో మొలకెత్తకుండా ఉండేలా రూపొందించబడ్డాయని వెల్లడించారు. కాగా దేశంలో నాణ్యమైన విత్తనాలు అందించే సంస్థల్లో తెలంగాణ వ్యవ సాయ విశ్వవిద్యాలయం ఒకటని తెలిపారు. ఇక నుంచి నాణ్య మైన చిరుధాన్యాల విత్తనాలు రైతులకు అందుబాటులోకి రానున్నాయని పేర్కొ న్నారు. దేశంలో దాదాపు 800 రకాల వరి వంగడాలు ఉన్నప్పటికీ, పీజేటీఏయూ విడుదల చేసిన రకాలకు అధిక డిమాండ్ ఉన్నదని తెలిపారు. తాజాగా ఆరు వరి సన్నరకాలు, కంది, పెసర, మినుము, సోయాబీన్, మొక్కజొన్న, పత్తిలో పలు రకాల విత్తనాలను విడుదల చేసినట్లు వివరించారు. వరి (ఆరు), మొక్కజొన్న, జొన్న, సోయా, పప్పుధాన్యాలు వంటి పంటలకు చెందిన మరో 11 రకాల విత్తనాలకు వాణిజ్య అభివృద్ధి, అమ్మకాల కోసం అనుమతి లభించిందని తెలి పారు. ఈ సీజన్‌లో ఈ విత్తనాలన్నింటినీ ప ండించి, వచ్చే సీజన్‌కు రైతులకు అందుబాటులో ఉంచుతామని ప్రొఫెసర్ జనయ్య అన్నారు.

# వరంగల్ పర్యటనలో శంభీపూర్ రాజుకు స్వల్పప్రమాదం

## వైద్య పరీక్షల తర్వాత కిమ్స్ నుంచి డిశ్చార్జ్

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), జులై 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనలో పాల్గొనేందుకు కుత్బుల్లాపూర్ నుంచి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా వరంగల్‌కు బయలుదేరారు.ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని వివేరా హోటల్ సమీపంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కు స్వల్ప ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన పార్టీ నాయకులు ఆయనను హైదరాబాద్‌కు తరలించి, కొంపల్లిలోని కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కిమ్స్ ఆసుపత్రిలో వైద్యులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించిన వైద్య బృందం కొద్ది రోజుల పాటు విశ్రాంతి తీసుకో వాలని సూచిం చింది. దీంతో ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఆసుపత్రిలో ఉండి ఎమ్మెల్సీ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఇద్దరూ కలిసి అక్కడి నుంచి బయలుదేరారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాం క్షి ంచారు.



ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

# బిజెపి నేతలు రాముడి నిధుల స్వాహాకారులు

## ఉర్దూ నేర్పితే తప్పేమిటి?

## ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి లాభమే కదా

## రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** రాముడి నిధులు స్వాహా చేసిన దొంగలు బిజెపి నేతలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి గుండెమీద చేయివేసుకొని చెప్పు మీరా రాముడి వారసులు అంటూ తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనీల్‌కుమార్ విమర్శించారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ "పైడి రాకేష్‌రెడ్డి మీరు రాముడి వారసులు కాదు, దేవుడి పేరుతో చందాలు వసూలు చేసి మింగే స్టూవర్ట్‌పురం దొంగలు.. అయోధ్య రాముడి నిధులు స్వాహా చేసింది మీరు' అని మండి పడ్డారు. ప్రజలు గంగానదిలో పవిత్ర మునక కోసం వచ్చి కుంభమేళాలో ఇచ్చిన చందాలు కూడా మింగేసింది మీ బిజెపి నేతలు దాని మాతృసంస్థ, దాని అనుబంధ పిల్ల సంస్థలేనని ఆరోపించారు .22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న మీ బిజెపి గల్ఫ్ కార్మికుల కోసం ఏం చేసిందో చెప్పే దమ్ముందా? చనిపోయిన గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసంరూ. 5 లక్షల ఎక్స్‌గ్రే షియా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మా రేవంత్ రెడ్డి ప్రభుత్వమనీ కొనియాడారు. ప్రపంచ దేశాలు ఎన్నో రంగాల్లో అభివృద్ధి చెంది ఎక్కడికో వెళ్తుంటే, ఈ బిజెపి వాళ్లు ఇంకా భాషలకి మతం రంగు పూస్తారా?అని ప్రశ్నించారు. తెలంగాణలో ఉర్దూ అనేది అధికారికంగా సెకండ్ లాంగ్వేజ్ ఒకవేళ నేర్పించినా అందులో తప్పేముంది? అని ప్రశ్నించారు.

బయట దేశాలకి ఉద్యోగానికి వెళ్తే జపాన్ వాళ్లు, చైనా వాళ్లు, జర్మని వాళ్ళు వాళ్ల లాంగ్వేజ్ వస్తేనే తీసుకుంటున్నారనీ ఆయన గుర్తుచేశారు. మన తెలంగాణ నుండి ముఖ్యంగా గల్ఫ్ దేశాలకి ఉద్యోగానికి వెళ్లే వాళ్లకి ఈ భాష ఎంతో ప్లస్ అవుతుందనీ చెప్పారు. యువత ఉపాధి అవసరాలని చూడకుండా, ప్రతి దానికి మతం రంగు పూయడం ఎంతవరకు న్యాయం? అని ప్రశ్నించారు. మన తెలంగాణ నుండి గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది పని చేస్తున్నారనీ ఆయన గుర్తుచేశారు. అక్కడ ఎక్కువ అరబిక్, ఉర్దూ భాషనే మాట్లాడుతారు మన హిందువులు ఉర్దూ భాషలోనే మాట్లాడుతారు మరి ఉర్దూ మా ట్లాడినంత మాత్రాన మతం మారారా అని ప్రశ్నించారు.

# ఉద్యమకారుల సంక్షేమ దిశగా నేడు తొలి భేటీ

## నేడు కేశవరావు అధ్యక్షతన విస్తృత సమావేశం

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** ఉద్యమకారుల సంక్షేమంపై సంప్రదింపులకు కె. కేశవరావు కమిటీ సోమవారం శ్రీకారం చుట్ట బోతున్నది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి జీఓ నెం. 679 ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీసోమవారం నుంచి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరామ్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ సంప్రదింపుల ప్రక్రియ దాదాపు రెండు వారాల పాటు కొనసాగనుంది. తొలి సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి జెఎసి నాయకులతో కమిటీ సమావేశం కానుంది. జులై 7న కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి జెఎసి నాయకులతో సమావేశం నిర్వహించనుంది. జులై 8న ఇతర విశ్వవిద్యాలయాల విద్యార్థి జెఎసిలు, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కమిటీ చర్చలు జరపనుంది.మిగిలిన సమావేశాల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశాలకు ఆహ్వానితులకు ప్రత్యేకంగా సమాచారం అందజేస్తామని పేర్కొన్నారు. ఉద్యమకారులు, సంబంధిత ప్రతినిధులు ఈ సంప్రదింపుల కార్యక్రమానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారకంను సంప్రదింపులకు వేదికగా ఉపయోగిస్తున్నామని కోదండరామ్ అద్దంకి దయాకర్‌రాములు నాయక్ మోతె శోభన్‌రెడ్డి తెలిపారు.

# రాజీవ్ యువ వికాసంపై అనిశ్చితి

## పెండింగ్‌లో 16 లక్షల దరఖాస్తులు

## పథకం అమలుపై పెరుగుతున్న ఆందోళనలు

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు ఉపాధి నిమిత్తం పతిష్టాత్మక స్వయం ఉపాధి పథకాన్ని రాజీవ్ యువ వికాసాన్ని ప్రారంభించి 15 నెలల తర్వాత కూడా ఇప్పటి వరకూ అమలు కాకపోవడంతో నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రాజీవ్ యువ వికాసానికి మొత్తంగా 16 లక్షల మంది దరఖాస్తుదారులు అనిశ్చితిలో ఉన్నారు. ఈ పథకపై రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ ఎటువంటి అధికారిక ప్రకటన లేకపోవడంతో పాటు, తెలంగాణ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ స్వయం ఉపాధి పథకం కార్యరూపం దాలుస్తుందా లేదా అనే దానిపై నిరుద్యోగ యువతలో ఆందోళనలు పెరుగుతున్నాయి. గత ఏడాది మార్చి 17న అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రాజీవ్ యువ వికాసం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం కింద మొత్తం రూ.6 వేల కోట్ల వ్యయంతో 5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రతిపాదన ప్రకారం, నాలుగు వర్గాల కింద రూ.50 వేల నుండి రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాల్సి ఉంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 4 వేల నుండి 5 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేలా ఈ పథకాన్ని రూపొందించారు.

సుమారు 16 లక్షల మంది యువకులు సహాయం కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. అయితే, ఈ దరఖాస్తుల స్థితిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాజీవ్ యువ వికాసం పథకం కింద అన్ని స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేయాలని, అలాగే ప్రతిపాదిత ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కార్యక్రమంపై సవివరమైన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మరోపక్క బీసీ సంక్షేమ శాఖ ఈ పథకానికి రూ.1,750 కోట్లు కేటాయించగా, అందులో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ కింద ఆటోరిక్షాల రెట్రోఫిటింగ్ కోసం రూ.50 కోట్లను ప్రత్యేకించింది. ఈ ప్రతిపాదన ప్రకారం పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాల స్థానంలో లిథియం అయాన్ బ్యాటరీ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి ఒక్కో వాహనానికి సుమారు రూ.1.5 లక్షల ఖర్చు అవుతుంది. ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు రెండు లక్షల ఆటోరిక్షాలు ఉన్నాయి. అయితే, మే నెలలో హజ్ యాత్రికులతో వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం, ప్రతి ఆటోరిక్షాకు రెట్రోఫిటింగ్ చేసే పూర్తి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ప్రభ్వుం ప్రకటించడంతో ఈ పథకం కింద కేటాయించిన నిధుల వినియోగంపై అనిశ్చితి నెలకొంది.

ఈ నేపథ్యంలో, రాజీవ్ యువ వికాసం కింద అందిన 16 లక్షల దరఖాస్తుల భవితవ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉండటం, అమలులో సుదీర్ఘ జాప్యం నెలకొనడంతో, వాగ్దానం చేసిన విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తారా లేదా అనే దానిపై చాలా మంది యువత ఆందోళన చెందుతున్నారు.

# కూర బొబ్బర కొత్తరకం అభివృద్ధి

## ఉద్యాన వర్సిటీ వైస్‌ఛాన్సలర్ రాజిరెడ్డి

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** కేవలం 50 నుంచి 55 రోజుల్లోనే మొదటి కోతకొచ్చే నూతన బొబ్బెర రకాన్ని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించింది. తెలంగాణ స్టేట్ సీడ్ సబ్ కమిటీ చైర్మన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కే సురేంద్ర మోహన్ నేతృత్వంలో జరిగిన స్టేట్ వెరైటీ రిలీజ్ కమిటీ ఈ రకాన్ని ఆమోదించింది. సాధారణంగా కూర బొబ్బర్లను (అల సందలు లేదా కౌపీస్) విత్తనాల కోసమే కాకుండా, లేత కాయల కోసం కూరగాయగా కూడా పండిస్తారు. ఆకుకూరగా ఉపయోగించే బొబ్బర ఆకు లేదా కాయల రకాలను నూతనంగా పండించడానికి వ్యవసాయ విశ్వ విద్యాలయాలు కొన్ని ప్రత్యేకమైన రకాలను సిఫార్సు చేస్తాయి. అయితే, ప్రాంతాన్ని బట్టి నూతన వంగడాల పేర్లు మారుతుంటాయి. ఈ మేరకు ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ రాజిరెడ్డి వీటి వివరాలు వెల్లడించారు. కూర బొబ్బెర 85 రోజుల్లోనే ఎకరానికి సుమారు ఏడు నుంచి 8 టన్నుల పచ్చికూర బొబ్బెర కాయలను దిగుబడి ఇస్తుందని వివరించారు. కాయల్లో 22 శాతం ప్రోటీన్, ఫైబర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాష్ పుష్కలంగా ఉంటాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యాన విశ్వవిద్యాలయం విడుదల చేసిన మొట్టమొదటి కూరగాయ రకం ఇదే అని పేర్కొన్నారు. జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ ప్రొఫెసర్ డాక్టర్ పిడిగం సైదయ్య నేతృత్వంలో, డాక్టర్ నిఖిల్, డాక్టర్ అనిత కుమారి శాస్త్రవేత్తల బృందం ఈ రకాన్ని తయారు చేసినట్టు వివరించారు.

## పార్లమెంట్ సమావేశాలకు ముందే రెబెల్ ఎంపిలపై స్పీకర్ నిర్ణయం

**న్యూఢిల్లీ, జులై 5:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయ్యే ఈనెల 20వ తేదీకి ముందే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (యూబీటీ) రెబెల్ వర్గాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆయా పార్టీల ప్రధాన నాయకత్వం స్పీకర్‌ను కోరింది. జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే ఈ అంశంపై తుది నిర్ణయం వెలువడే అవకాశముందని సమాచారం. ఈ విషయంలో స్పీకర్ ఇప్పటికే పార్లమెంట్‌కు చెందిన న్యాయ, రాజ్యాంగ నిపుణులతో సంప్రదింపులు జరిపి వారి అభిప్రాయాలను స్వీకరించినట్లు తెలిసింది. అలాగే గతంలో ఇలాంటి పరిస్థితుల్లో లోక్‌సభ స్పీకర్లు, రాజ్యసభ ఛైర్మన్లు తీసుకున్న నిర్ణయాలు, వాటికి సంబంధించిన న్యాయపరమైన అంశాలను కూడా పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాజ్యాంగ, చట్టపరమైన అన్ని కోణాలను సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం తుది నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్‌లో భారీ స్థాయిలో తిరుగుబాటు చోటుచేసుకుంది. పార్టీ తరఫున ఎన్నికైన 29 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది విడిపోయి నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. పార్లమెంట్‌లో తమకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని వారు కోరడమే కాకుండా, అధికార ఎన్డీఏ కూటమికి మద్దతు ఇవ్వాలనే ఆసక్తిని కూడా వ్యక్తం చేశారు. మరోవైపు శివసేన (యూబీటీ) తరఫున ఎన్నికైన తొమ్మిది మంది ఎంపీల్లో ఆరుగురు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. ఈ నేపథ్యంలో టీఎంసీ, శివసేన (యూబీటీ) పార్టీలు తమ నుంచి విడిపోయిన ఎంపీలపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం (యాంటీ డిఫెక్షన్ లా) ప్రకారం అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాయి. మొత్తం శాసనసభా పక్షంలో కనీసం మూడింట రెండొంతుల మంది సభ్యులు విడిపోయిన సందర్భంలో మాత్రమే యాంటీ డిఫెక్షన్ చట్టంలోని మినహాయింపులు వర్తిస్తాయని, ప్రస్తుత పరిస్థితుల్లో రెబల్ ఎంపీలకు ఆ వెసులుబాటు లేదని ఆయా పార్టీలు తమ వాదనలో పేర్కొన్నాయి. ఇప్పుడు స్పీకర్ ఓం బిర్లా తీసుకునే నిర్ణయం ఈ రెండు పార్టీల భవిష్యత్ రాజకీయ పరిణామాలపై, అలాగే పార్లమెంట్‌లో వాటి బలాబలాలపై ప్రభావం చూపే అవకాశముంది.



## డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 312 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి . శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 312 మంది మందు బాబులు ప ట్టుబడ్డారు. వీరిలో 245 మంది ద్విచక్ర వాహనదారులు, 35 మంది ఆటో డ్రైవర్లు, 32 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నా రు. పట్టుబడ్డ వారిలో 66 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 135 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 61 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 23 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 10మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఆరుగు రు 251 నుంచి 300 పాయింట్ల వరకు, 11 మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసి న తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరు వాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తె లిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

**సైబరాబాద్‌లో 190 మంది..**

ఇదిలా వుండగా సైబరాబాద్ పరిధిలో 190 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 154 మంది ద్విచక్ర వాహనదారులు. ఇద్దరు ఆటో డ్రైవ ర్లు, 34 మంది కార్ల డ్రైవర్లు వున్నారు.

## ముంబయి పర్యటనలో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై5:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముంబాయి పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం అక్కడ వాగ్దారా సంస్కృతిక సంస్థ నిర్వహించిన వాగ్దారా అండ్ భారత్ ఎక్స్‌ప్రెస్ అవార్డ్స్ సెరమనీ 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖులకు అవార్డులు అందజేశారు.

## తెలంగాణకు 3 కొత్త ఎయిర్‌పోర్టులు

### స్పీడ్ పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 5:** రాష్ట్రంలో ఏవియేషన్ రంగాన్ని విస్తరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు ముమ్మరం చేశాయి. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు సైతం అనుమతి లభించడంతో డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. తాజాగా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు కోసం స్థలాల పరిశీలన పూర్తి చేసి దానికి సంబంధించిన నివేదికను కేంద్రానికి పంపిచారు. వరంగల్ మామునూరులో విమానాశ్రయాన్ని నిజాం కాలంలో 1930లో నిర్మించిందే. స్వాతంత్ర్యానికి పూర్వమే అతిపెద్ద విమానాశ్రయంగా ఈ ఎయిర్ పోర్ట్ సేవలు అందించగా ఇప్పుడు దీనిని తిరిగి పునరుద్ధరిస్తున్నారు. రెండున్నరేళ్లలో ఈ ఎయిర్ పోర్ట్ పూర్తి చేయాలని కేంద్రం భావిస్తోంది. ఆదిలాబాద్‌లో నిర్మించబోయే ఎయిర్ పోర్ట్‌ను డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ శాఖలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మొత్తం 1500 ఎకరాల విస్తీర్ణంలో దీనిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ఎయిర్పోర్ట్లో ట్రైనింగ్ సెంటర్ తో పాటు పౌర విమాన సేవలు అందుబాటులో రానున్నాయి. కొత్తగూడెం ఎయిర్ పోర్ట్‌ను సైతం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

# 2028లో సిఎం కుర్చీ బిసి బిడ్డకే




### బిసిలే రాజ్యాధికారానికి కేంద్రబిందువు!

### టిఆర్‌పి వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న

### 'సర్జికల్ స్ట్రైక్59'తో రాజకీయ సమరానికి శ్రీకారం

### రాజకీయ ఆధిపత్యాన్ని బద్దలు కొడతాం

### వేలాదిగా తరలివచ్చిన బిసి, బహుజన శ్రేణులు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి ఆదివారం తెలంగాణ రాజకీయాలకు కొత్త దిశగా చర్చకు వేదికైంది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాధికార సమరభేరిసభలో పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బీసీలే తెలంగాణ రాజకీయాల కేంద్రబిందువని, రాజకీయ అధికారంలో భాగస్వామ్యం సాధించేందుకు బీసీలు ఏకమై పోరాటం చేయాల్సి న సమయం వచ్చిందని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆధిపత్య కులాల రాజకీయ పెత్తనానికి ముగింపు పలకడమే లక్ష్యంగా సర్జికల్ స్ట్రైక్59 పేరుతో ప్రత్యేక రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

ఆదివారం ఉదయం నుంచే జిల్లాలోని అన్ని మండలాలతో పాటు నల్లగొండ, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట, వరంగల్, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి బీసీ, బహుజన సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు, రైతులు, ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో సభకు తరలివచ్చారు. భువనగిరి పట్టణం పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బీసీ రాజ్యాధికార నినాదాలతో కళకళలాడింది. సభా ప్రాంగణం జనసందోహంతో నిండిపోగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సభలో ప్రసంగించిన తీన్మార్ మల్లన్న, తెలంగాణలో బీసీలు జనాభాలో అత్యధికంగా ఉన్నప్పటికీ రాజకీయ అధికారంలో మాత్రం వెనుకబడ్డారని అన్నారు. అధికారంలో భాగస్వామ్యం లేకపోవడం వల్ల బీసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని పేర్కొన్నారు. ఇకపై బీసీలు కేవలం ఓటు బ్యాంకుగా ఉండబోరని, పాలకులుగా ఎదిగే లక్ష్యంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ప్రస్తుతం ఆధిపత్య సామాజిక వర్గాలకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని పేర్కొంటూ, వారిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో రాజకీయంగా ఓడించేందుకు చేపట్టే ఉద్యమానికే సర్జికల్ స్ట్రైక్59 అని పేరు పెట్టామని తెలిపారు. ఇది వ్యక్తులపై పోరాటం కాదని, ఆధిపత్య రాజకీయ వ్యవస్థపై జరిగే ప్రజాస్వామ్య ఉద్యమమని వివరించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నియోజకవర్గంలో ఈ ఉద్యమాన్ని విస్తరించి, 2028 ఎన్నికల వరకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.

సభలో అత్యంత చర్చనీయాంశంగా మారిన వ్యాఖ్యల్లో భాగంగా, మర్యాదగా నియోజకవర్గాలు ఖాళీ చేసి వెళ్లిపోకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా మేమే గద్దె దిస్తాం. బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే ఆధిపత్య కులాల రాజకీయ పెత్తనానికి చెక్ పెట్టాల్సిందేన ని మల్లన్న అన్నారు. ఆయన వ్యాఖ్యలకు సభలో పాల్గొన్న కార్యకర్తలు నినాదాలతో స్పందించారు.

2028 అసెంబ్లీ ఎన్నికలను లక్ష ్యంగా చేసుకుని ఇప్పటి నుంచే కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పేర్కొన్న మల్లన్న, ఈ రోజు నుంచి సరిగ్గా 884 రోజుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కుర్చీలో బీసీ బిడ్డ కూర్చోవాలనీ, అది మా ఉద్యమ లక్ష ్యమని ధీమా వ్యక్తం చేశారు. బీసీలు ఐక్యంగా నిలిస్తే అధికారాన్ని ఎవరూ అడ్డుకోలేరని, తెలంగాణ రాజకీయ చరిత్రను తిరగరాసే శక్తి బీసీలకు ఉందని అన్నారు.

భువనగిరి నియోజకవర్గాన్ని ప్రస్తావిస్తూ, ఇక్కడ బీసీ ఓటర్లు లక్షా అరవై వేల మందికి పైగా ఉండగా, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు సుమారు 19 వేల మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. అయినప్పటికీ బీసీ ఎమ్మెల్యే ఎందుకు గెలవలేకపోతున్నాడో ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. భువనగిరి నుంచే రాజకీయ మార్పునకు శంఖారావం పూరిస్తున్నామని, ఇదే ఉద్యమానికి నాంది అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో బీసీ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో వాటా కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. అసెంబ్లీలో బీసీల ప్రాతినిధ్యాన్ని భారీగా పెంచడమే తమ పార్టీ ప్రధాన లక్ష ్యమని, ప్రతి నియోజకవర్గంలో బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తామని ప్రకటించారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అమలు చేసిన భూ పరిమితి చట్టాన్ని ప్రస్తావిస్తూ, పేదలకు చేరాల్సి న భూములు ఇప్పటికీ రాజకీయ పలుకుబడి కలిగిన వర్గాల చేతుల్లోనే ఉన్నాయని ఆరోపించారు. భూమిలేని నిరుపేదలకు భూములను పంపిణీ చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాయగిరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా స్పందిస్తూ, రైతుల భూములు, జీవనోపాధిపై ప్రభుత్వం అన్యాయం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

సభలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారంగా రూపొందించిన ప్రత్యేక డిజిటల్ ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. తెలంగాణ ఉద్యమ గాయని బెల్లి లలిత, రైతాంగ పోరాట యోధుడు సాంబశివుడు, కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ పాత్రలను ఏఐ సాంకేతికతతో మాట్లాడించిన వీడియోలు ప్రదర్శించగా సభికులు చప్పట్లతో స్వాగతం పలికారు. ఆధునిక సాంకేతికతను ఉద్యమ ప్రచారానికి వినియోగించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సభలో మరో కీలక పరిణామంగా ప్రభుత్వ ఉద్యోగి డాక్టర్ బిక్షపతి తన ఉద్యోగానికి రాజీనామా చేసి బీసీ ఉద్యమంలో చేరినట్లు పార్టీ ప్రకటించింది. సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించగా, పార్టీ నాయకులు వేదికపై ఘనంగా సత్కరించారు.

సభ ప్రారంభానికి ముందు రిలారే గంగా, జూనియర్ విమలక్క కళాబృందాలు బీసీ రాజ్యాధికారం, సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత అంశాలపై జానపద గీతాలు ఆలపించి సభలో ఉత్సాహాన్ని నింపాయి. గజ్జెలు కట్టి కళాకారులు చేసిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి.

ఈ సభకు మాజీ డీజీపీ పూర్ణచందర్, మాజీ నక్సలైట్ నాయకులు పిట్టల శంకర్ అన్న, వనజ, వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సామాజికవేత్తలు, జిల్లాలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు. భారీ జనసందోహం నేపథ్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయగా, భువనగిరి పట్టణంలో పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న ఈ సభలో చేసిన వ్యాఖ్యలు రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# టిఎంసిలో రాజీనామాల జోరు

### పార్టీ ఇక లేదన్న మంత్రి దిలీప్‌ఘోష్



**కోల్‌కతా, జులై 5:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో టీఎంసీ అంతర్గత విభేదాలు మరింత ముదురుతున్నాయి. అధికార పార్టీ నేతలు, తిరుగుబాటు వర్గం మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న వేళ.. టీఎంసీలో రాజీనామాల పరంపర మొదలైందని, ఆ పార్టీ ఇక ఉనికిలో లేదని బెంగాల్ మంత్రి దిలీప్ ఘోష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీఎంసీ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ మంత్రి చంద్రిమా భట్టాచార్య పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేయడంతో రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వీకరించారు. చంద్రిమా భట్టాచార్య రాజీనామాపై స్పందించిన దిలీప్ ఘోష్.. "టీఎంసీలో రాజీనామాల వెల్లువ మొదలైందని, ఆ పార్టీ వాస్తవానికి ఇక లేదనే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఆర్థిక మంత్రిగా పనిచేసిన చంద్రిమా భట్టాచార్య చేసిన వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పటికీ రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై తనతో ఎప్పుడూ చర్చించలేదని ఆమె చెప్పడాన్ని ప్రస్తావిస్తూ ఇన్ని సంవత్సరాలు ఆర్థిక మంత్రిగా ఉన్న ఆమెకు బడ్జెట్ గురించి తెలియదా ఆమెతో సంప్రదించకుండా బడ్జెట్ ఎలా రూపొందించారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీపైనా దిలీప్ ఘోష్ విమర్శలు గుప్పించారు. మమతా బెనర్జీ ట్రెడ్‌మిల్‌పై నడుస్తూనే బడ్జెట్ సిద్ధం చేశానని చెప్పేవారు.

అలా బడ్జెట్ తయారు చేయడం పిచ్చితనమే. అందుకే బెంగాల్ పరిస్థితి ఈ స్థాయికి చేరింది. ఇప్పుడు పార్టీ బలహీనపడిన తర్వాతే చంద్రిమా ఈ విషయాలు బయటకు చెబుతున్నారు. ఇంతకాలం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తన రాజీనామాకు కారణం కూడా చంద్రిమా భట్టాచార్య వివరిస్తూ తిరుగుబాటు వర్గానికి తానే తృణమూల్ భవన్‌ను అప్పగించానంటూ మమతా బెనర్జీ తనపై ఆరోపణలు చేయడం తీవ్రంగా మనస్తాపానికి గురి చేసిందని చెప్పారు. తృణమూల్ భవన్‌లో జరిగిన ఘటన తర్వాత మమతా బెనర్జీ ఫోన్ చేసి నువ్వే భవనాన్ని వారికి అప్పగించావని అన్నారని, ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి.

అలాంటి వ్యాఖ్యలు చేయాల్సి న అవసరం లేదని చంద్రిమా తెలిపారు. కోల్‌కతాలోని టీఎంసీ రాష్ట్ర కార్యాలయమైన తృణమూల్ భవన్‌పై తిరుగుబాటు వర్గం ఆధిపత్యం సాధించిందనే వార్తల నేపథ్యంలో భవనం యజమాని కార్యాలయానికి తాళం వేయడంతో పశ్చిమ బెంగాల్ రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారాయి.

# ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ పోరు!

### ఫోన్‌లో సుదీర్ఘంగా ట్రంప్, పుతిన్ చర్చలు



**వాషింగ్టన్/మాస్కో, జులై 5:** ప్రపంచదేశాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు అర్ధరాత్రి దాదాపు 90 నిమిషాల పాటు సుదీర్ఘ ఫోన్ సంభాషణ జరిపారు అమెరికా 250వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రంప్‌కు పుతిన్ శుభాకాంక్షలు తెలపడంతో ప్రారంభమైన ఈ సంభాషణ చివరకు ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే వ్యూహాల వైపు మళ్లిందని చెబుతున్నారు. రష్యా అధ్యక్షుడి అత్యంత నమ్మకస్తుడు, విదేశాంగ వ్యవహారాల సహాయకుడు యూరి ఉషాకోవ్ ఈ చర్చల వివరాలను అధికారికంగా వెల్లడించారు. కేవలం ఫార్మాలిటీ కాదు ఈ ఏడాది పుతిన్, ట్రంప్ మధ్య జరిగిన నాలుగో అధికారిక సంభాషణ ఇది. ఇది కేవలం ఒక సాధారణ ఫార్మాలిటీ కాదు. అత్యంత నిర్మాణాత్మకంగా, పనిపై స్పష్టమైన ఫోకస్‌తో ఈ చర్చలు జరిగాయి. అంతర్జాతీయంగా ప్రాధాన్యత ఉన్న అన్ని అంశాలపై ఇరు దేశాల నేతలు బహిరంగంగా మాట్లాడుకున్నారని ఉషాకోవ్ వెల్లడించారు. ఈ చర్చల సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధభూమిలో ఉన్న వాస్తవ పరిస్థితిని పుతిన్ ట్రంప్‌కు వివరించారు. ప్రస్తుతం రష్యా సైన్యం లైన్ ఆఫ్ కాంటాక్ట్ వెంబడి అన్ని వైపులా వేగంగా దూసుకుపోతోందని పుతిన్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సంక్షోభంపై యూరప్ దేశాల అవగాహన పూర్తిగా తప్పని ఈ సందర్భంగా రష్యా పేర్కొంది. వచ్చే వారం టర్కీలో జరగబోయే నాటో సదస్సులో ఈ యుద్ధానికి ముగింపు పలికేలా మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. అమెరికా ప్రత్యేక దౌత్యవేత్తలు స్టీవ్ విట్కాఫ్, జెరెడ్ కుష్నర్ ఈ శాంతి ఒప్పందం కోసం తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తారని, అవసరమైతే మరోసారి మాస్కో పర్యటనకు వచ్చేందుకు రెడీగా ఉన్నారని ట్రంప్ తెలిపినట్లు సమాచారం. రష్యా, అమెరికాల మధ్య సైనిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో పరస్పర సహకారానికి బోలెడు అవకాశాలు ఉన్నాయని, ఈ సహకారం పునరుద్ధరిం చాలంటే ఉక్రెయిన్ సంక్షోభానికి త్వరితగతిన పరిష్కారం లభించడమే మొదటి షరతు అని ట్రంప్ నొక్కి చెప్పారని తెలుస్తోంది. మరోవైపు, ఉక్రెయిన్, దాని యూరోపియన్ మిత్రదేశాలు యుద్ధాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని, సాధారణ పౌరులపై ఉగ్రవాద దాడులకు పాల్పడుతున్నాయని ఉషాకోవ్ ఆరోపించారు. రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ తాజాగా ఒక సంచలన ప్రకటన చేశారు. క్రెమ్లిన్ నిర్దేశించిన అత్యంత కీలకమైన, బాధ్యతాయుతమైన నిర్ణయాలను ఆమోదించడానికి సిద్ధంగా ఉంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్వయంగా అధ్యక్షుడు పుతిన్‌ను కలవడానికి మాస్కో రావచ్చని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని ఆశించే శక్తులన్నీ ఇప్పుడు పుతిన్ ట్రంప్ డీల్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయి.

## రాష్ట్రంలో 3.39 లక్షల టన్నుల యూరియా నిల్వ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందిస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 3.39 లక్షల టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. ఇప్పటి వరకూ 2.52 లక్షల టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో గత ఏడాది ఇదే సమయానికి 2.22 లక్షల టన్నుల యూరియా మాత్రమే అమ్ముడైందని గుర్తుచేశారు. రైతులకు పారదర్శకంగా యూరియాను అందించేందుకు రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్‌కు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఈ సీజనులో ఇప్పటివరకు 17.70 లక్షల మంది ఫెర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకోగా, మొత్తం 59.78 లక్షల బ్యాగులు బుక్ అయ్యాయని, వీటిలో ఇప్పటికే 52.86 లక్షల బ్యాగులను రైతులు కొనుగోలు చేశారన్నారు. గతంలో ఆధార్ ఆధారంగా జరిగిన పంపిణీలో తలెత్తిన అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారంగా, రైతు సాగు చేస్తున్న భూమి వివరాలతో యూరియా పంపిణీని అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఈ విధానం వల్ల నిజమైన సాగుదారుకే ఎరువు అందేలా చేయగలిగామని పేర్కొన్నారు.

## పోలీసు, ఫైర్ సర్వీస్, జైళ్ల శాఖ, ఎస్‌పిఎఫ్ విభాగాల్లో 7,437 ఖాళీలు

### త్వరలో నోటిఫికేషన్

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు, ఫైర్ సర్వీస్, జైళ్ల శాఖ, ఎస్‌పిఎఫ్ విభాగాల్లో మొత్తం 7437 ఖాళీలు వున్నట్లు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం వెల్లడించింది. ఈ మేరకు బోర్డు ఛైర్మన్ శ్రీనివాస రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఐదు వేల పో స్టులు పోలీసు శాఖలో ఖాళీగా వుండగా మిగతావి ఇతర విభాగాలవి కావడం గమనార్హం. పోలీసు విభాగంలో సివిల్ ఎస్ఐలు 148, సాయు ధ బలగం ఎస్ఐలు 14, టిజిఎస్‌పి ఎస్ఐలు 12, అంబర్‌పేట్‌లోని ప్రత్యేక సాయుధ బలగం సెంట్రల్ పోలీసు లైన్స్ (సిపిఎల్) ఎస్ఐలు మూ డు వుండగా ఫింగర్ ప్రింట్ బ్యూరోలో 23 ఏఎస్ఐ పోస్టులు వున్నాయి. ఇక క్షేత్రస్థాయిలో కీలకంగా వుండే కానిస్టేబుల్ పోస్టుల్లో సివిల్ విభా గంలో 3697 వుండగా సాయుధ బలగంలో 1052 వున్నాయి. దీని తరువాత సిపిఎల్‌లో 24, పోలీసు రవాణా శాఖలో డ్రైవర్ పోస్టులు 20, మెకానిక్ పోస్టులు ఏడు వున్నాయి. ఫైర్ సర్వీస్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులు 39, ఫైర్ ఫైటర్ పోస్టులు 751 ఖాళీగా వున్నాయి. జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్ (పురుషులు) 14, మహిళలకు ఒకటి ఖాళీగా వుండగా వార్డర్ (పురుషులు) 196, మహిళలు 12 ఖాళీగా వున్నాయి . ఎస్‌పిఎఫ్ విభాగంలో ఎస్ఐ పోస్టులు 44, కానిస్టేబుల్ పోస్టులు 1380 పోస్టులు ఖాళీగా వున్నాయి. కాగా ఈ పోస్టుల భర్తీకి త్వరలో లో కల్, నాన్ లోకల్ కేడర్ల వారిగా నోటిఫికేషన్ వెలువడుతుందని బోర్డు ఛైర్మన్ శ్రీనివాస రావు తెలిపారు.

## బలపడుతోన్న అల్పపీడనం

### తుఫాన్‌గా మారే అవకాశం

### 9 జిల్లాల్లో కుండపోత వర్షాల హెచ్చరిక

**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అంతకంతకూ బలపడుతోంది.. దీంతో ఇది తుపానుగా మారే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపానుగా మారితే మాత్రం తెలంగాణలోని పలు జిల్లాలో కుండపోత వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ అల్పపీడనం ఒకటి రెండు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అయితే అల్పపీడనం తుపాను గా మారుతుందా లేదా అన్నదానిపై నాలుగైదు రోజుల్లో క్లారిటీ రానుంది. ఈ అల్పపీడనం ప్రభావం తెలంగాణపై కూడా గట్టిగానే ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీని ప్రభావంతో రాబోయే 24 గంటలు వర్షాలు కొనసాగనున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ వెల్లడించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రకటించారు. మిగతా ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ తెలంగాణ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. హైదరాబాద్ విషయానికి వస్తే ఆకాశం మేఘాలతో కమ్మేసి ముసురు వాతావరణం కొనసాగుతుందని తెలిపారు. మధ్యాహ్నం మెల్లిగా జల్లులు మొదలవుతాయని, సాయంత్రం, రాత్రి వర్షతీవ్రత కాస్త పెరిగే అవకాశాలున్నాయని వెల్లడించారు. అక్కడక్కడ మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించారు. కాగా గడచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటున అత్యల్పంగా 5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పలు జిల్లాల్లో చిరు జల్లులు పడగా, మరికొన్ని చోట్ల స్వల్పంగా కురిసింది. రాష్ట్రంలో స్వల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలో 17.5 మిల్లీ మీటర్లు కామారెడ్డిలో 16.3 మిల్లీ మీటర్లు, మెదక్‌లో 12.9 మిల్లీ మీటర్లు, సిద్దిపేట్‌లో 10.2 మిల్లీ మీటర్లు, ఆదిలాబాద్‌లో 11 మిల్లీ మీటర్లు చొప్పున వర్షపాతం నమోదు కాగా, మరికొన్ని జిల్లాల్లో చిరు జల్లులు పడ్డాయి.

# అయోధ్య ట్రస్టు భవిష్యత్ నిర్దేశించనున్న సిట్ మధ్యంతర నివేదిక

### సభ్యుల్లో బహిర్గతం అవుతున్న విభేదాలు.. నేడు ట్రస్ట్ కీలక సమావేశం

**అయోధ్య, జులై 5:** అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారంపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతున్న వేళ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక సమావేశం సోమవారం జరగనుంది. ఈ సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామాతో పాటు విరాళాల లెక్కలపై ఎస్ఐటీ మధ్యంతర నివేదికను సమీక్షచేస్తారు. ఈ సమావేశం ట్రస్ట్ భవిష్యత్ నాయకత్వంపై కీలక నిర్ణయాలకు వేదిక కానుంది. అయోధ్యలోని మణిరామ్ దాస్ ఛావణిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సమావేశం జరగనుంది. రామమందిర విరాళాల వివాదం తర్వాత నిర్వహిస్తున్న తొలి కీలక సమావేశం కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. విరాళాల చోరీ బయటకు రావడంతో ట్రస్టులో ఉన్న అంతర్గత విభేదాలు కూడా బట్టబయలవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ డాక్టర్ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. విరాళాల వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో నైతిక బాధ్యత వహిస్తూ ఇద్దరూ



గతనెల 26న రాజీనామాలు సమర్పించారు. ట్రస్ట్ చైర్మన్ మహంత్ నృత్య గోపాల్ దాస్ ఈ నిర్ణయంలో కీలక పాత్ర పోషించనున్నారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ రాజీనామాలను ఆమోదించాలా లేదా అన్న అంశంపై ఆయన అభిప్రాయానికి ప్రాధాన్యం ఉంది. ట్రస్ట్ నిబంధనల ప్రకారం రాజీనామా ఆమోదానికి రెండు మూడవ వంతు సభ్యుల మద్దతు అవసరం. సమావేశంలో విరాళాల హుండీల నగదు లెక్కింపుపై ప్రత్యేక దర్యాప్తు బృందం అంటే ఎస్ఐటీ సమర్పించిన మధ్యంతర నివేదికను పరిశీలించనున్నారు. అలాగే ఆలయ పరిపాలన భవిష్యత్ కార్యాచరణ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ కాని లెక్కలకు కూడా ఆమోదం తెలపనున్నారు. ఈ సమావేశంలో కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు కూడా పాల్గొంటారు. కేంద్ర సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ లోఖండే, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సీనియర్ ప్రతినిధి సంజయ్ ప్రసాద్, అయోధ్య జిల్లా కలెక్టర్‌తో పాటు ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా కూడా సమావేశానికి హాజరుకానున్నారు. ఇక ట్రస్ట్ సభ్యుడు మహంత్ దినేంద్ర దాస్ మాత్రం విరాళాల వ్యవహారంపై బహిరంగంగానే తీవ్ర విమర్శలు చేశారు. విరాళాల నిర్వహణలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పూర్తి బాధ్యతను నిర్ధారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర సాధు సభ్యులు ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. సోమవారం జరిగే సమావేశంలో వారి వైఖరి కూడా కీలకంగా మారనుంది. రామమందిర విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు రావడంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేయగా... ట్రస్ట్ ఆర్థిక వ్యవస్థ, పరిపాలనా విధానాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. అయితే ఈ ఘటన కొందరు వ్యక్తుల చర్యల వల్లే జరిగిందని... ట్రస్ట్ వ్యవస్థలో ఎలాంటి లోపం లేదని ట్రస్ట్ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలన్న డిమాండ్లు రోజురోజుకూ బలపడుతున్నాయి. ఓ మీడియా నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో భద్రతా వ్యవస్థలో లోపాలు, విరాళాల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం, బంగారు విరాళాల లావాదేవీల్లో సరైన రికార్డులు లేకపోవడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ప్రచారం జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం జరిగే ట్రస్ట్ సమావేశం అయోధ్య రామమందిర పరిపాలన భవిష్యత్ దిశను నిర్ణయించే కీలక సమావేశంగా మారింది.



ఖమ్మం మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొరకు గౌరవ డాక్టరేట్ బహుకరిస్తున్న దృశ్యం

## లింగయ్య దొరకు అమెరికా గౌరవ డాక్టరేట్

**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ ఆదివాసీ హక్కుల ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొరకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సామాజిక సేవ, ప్రజా నాయకత్వ రంగాల్లో ఆయన దశాబ్దాలుగా అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం, బేట్స్ సిటీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఈ అంతర్జాతీయ విద్యా సంస్థ ప్రపంచవ్యాప్తంగా సామాజిక సేవ, ప్రజా పరిపాలన, మానవతా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలోనే యూనివర్సిటీ సెలక్షన్ కౌన్సిల్ చందా లింగయ్య దొరను ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేసింది. జూలై 4న ఫుకెట్‌లో జరిగిన యూనివర్సిటీ కాన్వొకేషన్ వేడుకల్లో ఈ గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. చందా లింగయ్య దొర గత కొన్ని దశాబ్దాలుగా గిరిజన, ఆదివాసీ, బహుజనవర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. ఎమ్మెల్యేగా, జడ్పీచైర్మన్‌గా పదవులు నిర్వహించిన కాలంలో గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, విద్యావిస్తరణ, సామాజిక న్యాయం కోసం ఆయన విశేషంగా శ్రమించారు.

## మజ్లిస్ ప్రసన్నం కోసం రేవంత్ ప్రభుత్వం

### కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

**మెహిదీపట్నం, జూలై 5, ప్రభాతవార్త :** భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందు కోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిపెడ్తోందని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదన్నారు. ఆదివారం నాంపల్లి నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ సర్కార్ సెలెక్టివ్ గవర్నెన్స్‌కు హైడ్రా ఓ ఉదాహరణ అన్నారు. సామాన్య ప్రజల విషయంలో మాత్రం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మౌనంగా ఉంటూ.. మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని.. ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరులో మార్పు లేకపోవడం సిగ్గుచేటన్నారు. హైడ్రా, విద్యాశాఖ సహా పలు శాఖల నుంచి వివరాలు కోరినా సామాన్య ప్రజల విషయంలో చూపే తొందరపాటును ఫాతిమా కాలేజ్ వ్యవహారంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చూపడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి, యావత్ ముస్లిం సమాజానికి ప్రతినిధిగా భావిస్తున్నట్లుగా వ్యవహరిస్తుండడం సరియైనది కాదన్నారు. హైడ్రాదార్ల వల్ల పేద ముస్లింల ఇక్కట్లు కూడా కూల్చివేతకు గురయ్యాయని, వారి జీవనోపాధి దెబ్బతిందని, ఆసమయంలో వారి తరఫున మజ్లిస్‌గానీ, కాంగ్రెస్‌గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. కానీ ఒవైసీ సోదరుల ఆస్తుల విషయంలో మాత్రం ఈ రెండుపార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం అన్న ప్రభుత్వ తీరుతో ప్రజల్లో సర్కారు పట్ల విశ్వాసం తగ్గుతోందని, వీటన్నింటిని గమనిస్తున్న ప్రజలు త్వరలోనే ప్రభుత్వానికి దిమ్మదిరిగే సమాధానం చెబుతారన్నారు.



ధర్నాకు మద్దతు తెలుపుతున్న కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

## రోస్టర్ విధానాన్ని సవరించాలి

### మాల ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో మహాధర్నా

మద్దతిచ్చిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

**ధర్నాచౌక్, జులై 5, ప్రభాతవార్త:** మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని మాల ప్రజాఫ్రంట్ ఛైర్మన్ డాక్టర్ మంచాల లింగస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మాల ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై మద్దతు తెలిపి, మాట్లాడుతూ రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎస్సీ గ్రూప్ 111లో ఉన్న మాల మరియు ఇతర 25 కులాల మొదటి రోస్టర్ పాయింట్‌ను 22 నుంచి 16కి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, రోస్టర్ పాయింట్‌ను సవరించి, మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షులు రాజు ఉస్తాద్, మాల ప్రజాఫ్రంట్ వైస్ ఛైర్మన్ దాసరి విశాల్, కోఆర్డినేటర్లు మేసే నాందేవ్, అంజలి, మాల మహానాడు రాష్ట్ర ఛైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ ఛైర్మన్ బేర బాలకిషన్, గౌరవ అధ్యక్షులు చెరుకు రాంచందర్‌లు మాట్లాడుతూ ఎస్సీ గ్రూప్111లో ఉన్న మాల, ఇతర 25కులాలకు 50లోపు మూడు రోస్టర్ పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో మాలలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మాలలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు తాళ్లపల్లి రవి, బి.హరికృష్ణ, పచ్చ శ్రీనివాస్, డి.నర్సయ్య, పుణ్యభాను, పిల్లి సుధాకర్, రమేష్ బల్వంత్, మరాఠి మణిదీప్, చిక్కుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత పెంపునకు ప్రాసిక్యూషన్ సమీక్షా కమిటీ సమావేశం

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** జంట నగరాలలో నేర పరిశోధన, ప్రాసిక్యూషన్ నాణ్యతను పెంచేందుకు ప్రాసిక్యూషన్ సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. బషీర్‌బాగ్‌లోని సిసిఎస్ కార్యాలయంలో నగర అదనపు పోలీసు కమిషనర్ (సిట్, క్రైం) ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోలీసు విభాగం న్యాయ సలహాదారులతో, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ నగర పరిధిలో గల పోలీసు స్టేషన్లలో నమోదవుతున్న కీలక కేసుల్లో నిందితులకు కచ్చితంగా కఠిన శిక్షలు పడాల్సిందేనని, ఈ విషయంలో పోలీసులు, ప్రాసిక్యూషన్ విభాగం సిబ్బంది సమన్వయంతో మెలగాలని కోరారు. కీలక కేసుల్లో ఎట్టి పరిస్థితుల్లో నిందితులు తప్పించుకునేందుకు వీలుండకూడదని ఆయన అన్నారు. దీనికి సంబంధించిన కొన్ని కేసులను ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. నిందితులు నిర్దోషులుగా విడుదలవడం వల్ల ఇబ్బందులు ఆయా ప్రాంతాలలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కొన్నిసార్లు ప్రతీకార దాడులకు ఆస్కారం వుంటుందని, దీనిపై పోలీసులపై విమర్శలు వస్తున్నాయని ఆయన అన్నారు. ఈ విషయంలో పోలీసుల తరపున వైఫల్యం వుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ సిబ్బంది కూడా తమవంతుగా నేరగాళ్లకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇటు వంటివి పునరావృత్తం కాకుండా చూడాలని ఆయన కోరారు. మొత్తం మీద శిక్షల శాతం పెరిగిందని, ఇది సంతోషించదగ్గ విషయమే అయినా కీలక కేసుల్లో ఇంకా మెరుగవాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు.

# భూసేకరణకు ప్రతిబంధకంగా నిధుల లేమి


## నీటిపారుదల,రెవెన్యూ,జిల్లా యంత్రాంగం సమన్వయంతో సాగేనా?!

**హైదరాబాద్,జూలై 4ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంకు భూసేకరణ ,అటవీ అనుమతులు, భూనిర్వాసితుల పునరావాసం వంటి కీలక అంశాలు అపరిష్కృతంగా ఉండటంతో పాటు నిధుల కొరత కూడా తోడవడంతో ఎన్నో సంవత్సరాలు ప్రాజెక్టుల పురోగతికి ప్రతిబంధకమౌతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూసేకరణ పునరావాసం, పునరుద్దరణ, అటవీ అనుమతులు,ప్రత్యామ్నాయ అటవీ విస్తరణ పెంపకానికి ఐదు వేల కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్యాకేజీ గత నెలలో క్రితం ప్రకటించడంతో వివిధ కారణాలతో దాదాపు రెండేళ్ల కాలంగా నిలిచిపోయిన ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణకు కదలిక వచ్చింది. నీటిపారుదల,రెవెన్యూ, జిల్లా యంత్రాంగాలు సమన్వయంతో భూసేకరణకు అధికారులు వేగంగా అడుగులువేస్తున్నారు. జూలై నెలాఖరునాటికి అన్ని అటవీ అనుమతులుపొందాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖమ్మం ప్రాజెక్టులను సమీక్షిస్తూ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 49 వేల ఎకరాలను సేకరించాల్సి ఉండగా వీటికి పరిహారంగా చెల్లించడానికి రూ.10వేల కోట్ల వరకు అవసరం. ప్రస్తుతం ఐదువేల కోట్ల మాత్రమే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యతగా ఎంచుకొన్న 19 ప్రాజెక్టులకు ఎంతమేరకు నిధులు సరిపోతాయనే అంశంలో అనిశ్చితినెలకొంది. గత ప్రభుత్వ హయాంలో హెడ్ వర్క్స్ పనులు మాత్రమే పూర్తయిన ప్రాజెక్టులు ఎక్కువగా ఉన్నాయి. ప్రధాన, ఉప, పిల్ల కాలువల వ్యవస్థలను నిర్మించలేదు. ఈ క్రమంలో 75 పనులను పూర్తయిన వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వీటి కింద కనీసం రెండు వేల ఎకరాల భూ సేకరణను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేస్తేగానీ ఆయకట్టుకు నీరందదు. భూసేకరణ ప్రక్రియలో అనేక చిక్కులు ఉన్నాయి. రాష్ట్రంలో భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారానికి భూములను వదులుకునేందుకు రైతులు మానసికంగా సిద్ధంగాలేరు. ఇప్పటికే అవార్డు జారీ చేసిన చోట పరిహారం చెల్లింపులో సంవత్సరాల కాలం ఆలస్యమైన ప్రాంతాల్లోనూ రైతులు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేరు. ఇది ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించింది కాకుండా 2027 మార్చి నాటికి ప్రాజెక్టులు పూర్తిచేయాలనే లక్ష్యంకు సవాల్‌గా మారనున్నది. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ప్రస్తుత ధరలను పరిగణనలోకి తీసుకుని కొంతమేరకు సవరించి పరిహారం అందజేస్తున్నారు. మార్కెట్ విలువకు, బహిరంగ ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోంది. ఇది రైతులను ఆలోచింపజేస్తోంది. మరోవైపు నిధుల విడుదలలోనూ జాప్యం జరుగుతోందని క్షేత్ర స్థాయి ఇంజినీర్లు చెబుతున్నారు. ప్రాధాన్యతాక్రమంలో ఈ సంవత్సరంలోగా పూర్తిచేయాల్సిన నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ కోసం కనీసం రూ.1,500 కోట్లు అవసరం అవుతుందన్న అంచనాలు ఉన్నాయి. వీటి విడుదలలో జాప్యం జరుగుతున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్నేరు పాలేరు లింక్ కాలువ కోసం తొమ్మిది కి.మీ నాలుగు గ్రామాలలో 317 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రెండు గ్రామాల్లో భూసేకరణ కోసం సర్వే పూర్తికాగా ఇక్కడ భూసేకరణకు రూ.30కోట్లు వ్యయం అవుతుందని అధికారులు లెక్కకట్టారు. సీతారామా ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు -1తో బయ్యారం గిరిజన మెట్ట ప్రాంతాలకు సాగు నీరు అందించేందుకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లాలో సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు అంచనాలు సవరించారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజీ 20,21, గుత్ప,అలీసాగర్ భూసేకరణ, అటవీ పర్యావరణ అనుమతులు వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. సాగునీటిని వ్యవసాయ క్షేత్రాలకు తరలించేందుకు పిల్ల కాలువ వ్యవస్థ లేదు. గత యేడాది తెలంగాణ ప్రభుత్వం 6.83 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించాలని నీటిపారుదల శాఖ లక్ష్యం నిర్దేశించుకొన్నప్పటికి ప్రధాన, పిల్ల కాల్వలకు భూసేకరణ చేపట్టలేక పోయారు,ఐదేళ్లలో మొత్తం 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనేది అంతిమ లక్ష్యం వచ్చే వచ్చే ఇరువై నెలలలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రధాన పనులు పూర్తయి ఆయకట్టుకు సాగునీరు అందించడమే మిగిలి ఉన్న సీతారామ ఎత్తిపోతల కింద కనీసం మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశముంది. ఇది సాధ్యం కావాలంటే బ్రాంచి కాలువలు, డిస్ట్రిబ్యూటరీ నిర్మాణాలు చేపట్టాలి. దీనికోసం భారీగా భూమిని సేకరించాల్సి ఉంది.దేవాదుల ఎత్తిపోతల కింద 1500 ఎకరాల భూసేకరణ మిగిలి ఉంది. దాదాపు రూ.500 కోట్ల వరకు వ్యయ అంచనాలు ఉన్నాయి. సేకరణ పూర్తి చేసి పనులు చేపడితే ఈ ప్రాజెక్టు కింద పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుంది. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద రెండు వేల ఎకరాలను సేకరించాల్సి ఉంది. పిల్ల కాలువల వ్యవస్థను చేపట్టాల్సి ఉంది.జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద 600 ఎకరాలు సేకరించాల్సి ఉంది. "మక్తల్ నారాయణపేట కొడంగల్ " ఎత్తిపోతల పథకం 4200 ఎకరాలు భూసేకరణ చేయడంతోపాటు పునరావాసం పునరుద్ధరణ చేపట్టాల్సిఉంది. రాజీవ్ బీమా ఎత్తిపోతలపథకానికి మొదటి దశ కోసం ఇంకా మిగిలి ఉన్న 80 ఎకరాలు భూమి జూలై నెలలోగా సేకరణ చేయాల్సి ఉంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి 167 ఎకరాలభూసేకరణ, నెట్టంపాడు 534ఎకరాలు, తుమ్మిళ్ళ ఎత్తిపోతల పథకం రెండో దశ పనుల పురోగతి 567 ఎకరాలు గూడెం దొడ్డి రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం పెంపు కోసం భూసేకరణ పూర్తిచేయాల్సి ఉంది.



# భూమి నాశనం కాకపోవచ్చు

## సూర్యుడి అంతం తర్వాత కూడా మనుగడకు అవకాశం: కొత్త అధ్యయనం



**బ్రస్సెల్స్,జులై 5:** మన భూగ్రహం భవిష్యత్తుపై కొత్తఅధ్యయనం ఆశాజనక సంకేతాలను ఇచ్చింది. ఇప్పటివరకు ఉన్న సాధారణ అభిప్రాయానికి విరుద్ధంగా, సూర్యుడు తన జీవితాంతంలో అగ్నిగోళంగా మారినా భూమి పూర్తిగా నాశనం కాకుండా మనుగడ సాగించే అవకాశం ఉందని పరిశోధకులు వెల్లడించారు. ఈ అధ్యయనం ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. బెల్జియంలోని కేయూ లూవెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రానమీ పరిశోధకుడు, అధ్యయన ప్రధాన రచయిత మాట్స్ ఎస్సెల్‌డ్యూర్స్ మాట్లాడుతూ ప్రస్తుతం సూర్యుడి తరహా భారీ నక్షత్రాలపై జరుగుతున్న పరిశీలనలు భూమి మనుగడకు అవకాశాలు ఉన్నాయని సూచిస్తున్నాయని తెలిపారు. ఎస్సెల్‌డ్యూర్స్‌తో పాటు అంతర్జాతీయ పరిశోధకుల బృందం సూర్యుడు తన జీవితాంతానికి చేరుకున్నప్పుడు ఏం జరుగుతుందనే అంశాన్ని అధ్యయనం చేసింది. మరో సుమారు 500 కోట్ల సంవత్సరాల తర్వాత సూర్యుడి కేంద్రంలో హైడ్రోజన్ ఇంధనం పూర్తిగా అయిపోతుందని, అనంతరం అది ప్రస్తుతం ఉన్న పరిమాణంతో పోలిస్తే వందల రెట్లు విస్తరించే అవకాశం ఉందని వెల్లడించింది. అధ్యయనం ప్రకారం ముందుగా సూర్యుడు రెడ్ జెయింట్ నక్షత్రంగా మారి, ఆ తర్వాత మరింత పెద్ద ఏజీబీ నక్షత్రంగా విస్తరిస్తాడు. చివరికి తన జీవితాన్ని వైట్ డ్వార్ఫ్ రూపంలో ముగిస్తాడు. ఇది నక్షత్రం మరణించిన తర్వాత మిగిలే అత్యంత వేడిగా ఉండే కేంద్ర భాగం. ఇప్పటివరకు శాస్త్రవేత్తలు ఈ చివరి దశల్లో ఏర్పడే తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా బుధుడు, శుక్రుడు, భూమి గ్రహాలు పూర్తిగా నాశనం అవుతాయని భావించేవారు. అయితే నక్షత్రాల పరిణామ నమూనాలు, అలాగే సూర్యుడి భవిష్యత్తును ప్రతిబింబించే అవకాశం ఉన్న ఎల్2 పప్పిస్ అనే సమీప మరణా సన్న నక్షత్రంపై చేసిన పరిశోధనల ఆధారంగా భూమి పూర్తిగా నాశనం కాకపోవచ్చని పరిశోధకులు తేల్చారు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం రెండు అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ సూర్యుడు విస్తరించే సమయంలో దాని గురుత్వాకర్షణ ప్రభావం ఎక్కువగా ఉంటే భూమిని తనవైపు లాగి చివరికి మింగివేయవచ్చు. మరో వైపు, సూర్యుడి నుంచి వెలువడే నక్షత్ర గాలులు కారణంగా అది వేగంగా తన ద్రవ్యరాశిని కోల్పోతే, గురుత్వాకర్షణ బలహీనపడి భూమి మరింత దూర కక్ష్యలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో సూర్యుడి నుంచి తప్పించుకునే అవకాశమూ ఉంటుంది. సూర్యుడు ఎంత వేగంగా తన ద్రవ్య రాశిని కోల్పోతాడనే అంశంపైనే భూమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పరిశోధకులు తెలిపారు. గురుత్వాకర్షణ ప్రభావం అధికంగా ఉంటే భూమి సూర్యుడిలో కలిసిపోతుందని, ద్రవ్యరాశి కోల్పోయే ప్రక్రియ ప్రభావం ఎక్కువగా ఉంటే భూమి మరింత దూర కక్ష్యలోకి వెళ్లి మనుగడ సాగించే అవకాశం ఉందని మాట్స్ ఎస్సెల్ డ్యూర్స్ వివరించారు.

## తాతలకాలంనాటి మాభూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మించారు..

### రూ.3500 కోట్ల పరిహారం చెల్లించాలంటూ సుప్రీంలో కేసు వేసిన రైతు



**రాయ్‌పూర్,జులై 5:** ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ రైతు తాతల కాలంనాటి మా భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మించారంటూ ఏకంగా ఆ విమానాశ్రయం కట్టిన భూమికి పరిహారంగా తనకు 3,500కోట్ల రూపాయలు కావాలంటూ సుప్రీంకోర్టు మెట్లెక్కాడు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 53 ఏళ్ల రైతు అశ్విని బండే సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఓ పిటిషన్ ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. రాయ్‌పూర్‌లోని ప్రసిద్ధ స్వామి వివేకానంద ఎయిర్‌పోర్టు నిర్మించిన సుమారు 30 ఎకరాల 18 డెసిమల్స్ భూమి తన పూర్వీకులదేనని బండే వాదిస్తున్నాడు. 1942లో రెండో ప్రపంచ యుద్ధం సమయంలో మిలిటరీ అవసరాల కోసం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ భూమిని తాత్కాలికంగా తీసుకుందని, యుద్ధం ముగిశాక తిరిగి ఇచ్చేస్తామని అప్పట్లో ఒప్పందం చేసుకున్నారని ఆయన పేర్కొంటున్నాడు. ఆ భూమికి వార్షిక అద్దె కింద రూ. 1,300 చెల్లిస్తామని చెప్పిన బ్రిటిష్ ప్రభుత్వం, ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదట. యుద్ధం ముగిసింది కానీ, బండే కుటుంబానికి ఆ భూమి దక్కలేదు, అద్దె రాలేదు, పరిహారమూ అందలేదు. తన తాతల ఆస్తిని దక్కించుకోవడం కోసం అశ్విని బండే ఏకంగా 35 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్నాడు. దేశంలోని వివిధ గ్రంథాలయాలు, ప్రభుత్వ ఆర్కైవ్స్, పలు శాఖల కార్యాలయాల చుట్టూ తిరిగి తన వాదనకు బలాన్నిచ్చే పాత రికార్డులను సేకరించాడు. ఆ భూమిని ప్రభుత్వం శాశ్వతంగా సేకరించలేదని నిరూపించే పత్రాలను బయటకు తీశాడు. ఈ సుదీర్ఘ న్యాయపోరాటం కోసం ఆయన ఇప్పటికే సుమారు రూ. 15 కోట్ల నుంచి రూ. 20 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం.బండే పోరాటానికి ఇటీవలే ఓ బలమైన ఆధారం దొరికింది. రాయ్‌పూర్‌లోని సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఓ ఎగ్జిబిషన్‌లో పాత రికార్డులను ఆయన గమనించాడు. వెంటనే ప్రజా సేవా హక్కు చట్టం (పబ్లిక్ సర్వీస్ గ్యారెంటీ యాక్ట్) కింద ఆ పత్రాల సర్టిఫైడ్ కాపీలను సంపాదించాడు. 1946లో డిఫెన్స్ ఆఫ్ ఇండియా చట్టం రద్దయ్యాక, 1952లో వచ్చిన కొత్త చట్టంతో భూముల నిర్వహణ వివిధ ప్రభుత్వ శాఖల చేతుల్లోకి వెళ్లిపోయిందని, ఈ క్రమంలోనే తన కుటుంబ హక్కులు కాలరాశారని ఆయన ఆరోపిస్తున్నాడు. సాంస్కృతికశాఖ సైతం ఆ కాలం నాటి భూసేకరణ రికార్డులు, అందులో రైతుల పేర్లు తమ వద్ద ఉన్నాయని ధృవీకరించడం బండే వాదనకు మరింత బలాన్నిస్తోంది. ఆనాటి నుంచి నేటి వరకు తమకు దక్కాల్సిన పరిహారం ఏకంగా రూ. 3,500కోట్లు ఉంటుందని అంచనా వేసిన బండే ఆమొత్తాన్ని తనకు చెల్లించాల్సిందిగా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ పోరాటంలో అశ్విని బండేకల నెరవేరుతుందా ఆపాత డాక్యుమెంట్లలో చట్టపరమైన బలంఎంత ఉందనేది ఇప్పుడు సర్వోన్నత న్యాయ స్థానం తేల్చాల్సి ఉంది. మరి, ఈ హైడ్రామా రియల్ లైఫ్ స్టోరీకి సుప్రీంకోర్టు ఎలాంటి ముగింపు పలుకుతుందో వేచి చూడాలి.




## పాక్ యువకుడిని తిరిగి అప్పగించిన భారత్ సైన్యం

**శ్రీనగర్,జులై 5:** సోషల్ మీడియాలో పరిచయమైన యువతిని కలిసేందుకు, పూర్వీకుల ఆస్తిని దక్కించుకునేందుకు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి భారత్‌లోకి ప్రవేశించిన పాక్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్ (పీఓజేకే) యువకుడిని భారత సైన్యం తిరిగి పాకిస్థాన్‌కు అప్పగించింది. మానవతా దృక్పథంతో వ్యవహరించిన సైన్యం, విచారణ అనంతరం అతడిని సురక్షితంగా వెనక్కి పంపింది. పీవోజేకేకు చెందిన జీషన్ మీర్ (22) అనే యువకుడికి కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా తులవారి గ్రామానికి చెందిన ఇరమ్ బానో అనే యువతితో స్నాప్‌చాట్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కొద్దికాలానికే బలమైన బంధంగా మారింది. ఇదే సమయంలో తన పూర్వీకులు ఇరమ్ బానో నివసిస్తున్న గ్రామానికే చెందినవారని జీషన్ తెలుసుకున్నాడు. కుటుంబ ఆర్థిక బాధ్యతలు, జీవనోపాధి కోసం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న జీషన్, తన సమస్యలను బానోతో పంచుకున్నాడు. దీంతో సరిహద్దు దాటి తన గ్రామానికి వచ్చేయమని ఆమె సలహా ఇచ్చింది. ఇద్దరూ కలిసి ఒక ప్రణాళిక రచించారు. దాని ప్రకారం జీషన్ సరిహద్దు దాటి నేరుగా సైన్యానికి లొంగిపోవాలి. చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించినందుకు విధించే శిక్షను అనుభవించి, విడుదలైన తర్వాత గ్రామంలోని తన పూర్వీకుల ఆస్తిపై చట్టబద్ధంగా హక్కు సంపాదించి అక్కడే స్థిరపడాలి. ఈ ప్రణాళికతో మే 31న సరిహద్దు దాటుతుండగా భారత సైన్యం జీషన్‌ను పట్టుకుంది. విచారణలో భాగంగా జీషన్ చెప్పిన విషయాలను నిర్ధారించుకోవడానికి అధికారులు ఇరమ్ బానోను పిలిపించారు. జీషన్‌ను ఇక్కడే ఉండనివ్వాలని ఆమె అధికారులను అభ్యర్థించింది. ఈ కథనంపై భద్రతా ఏజెన్సీలు క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, దీని వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని నిర్ధారించుకున్నాయి. అనంతరం అతడిని తిరిగి పంపాలని నిర్ణయించాయి.ఈ క్రమంలో నిన్న మధ్యాహ్నం 12:24 గంటలకు కమాన్ అమన్ సేతు వద్ద జీషన్‌ను పాక్ సైనిక అధికారులకు అప్పగించినట్లు శ్రీనగర్‌కు చెందిన చినార్ కార్ప్స్ తెలిపింది. భారత్‌లో ఉన్నంతకాలం జీషన్‌ను గౌరవంగా,దయతో చూసుకున్నామని, ఇది భారత సైన్యం యొక్క వృత్తిపరమైన నిబద్ధతకు, మానవతా విలువలకు నిదర్శనమని సైన్యం పేర్కొంది.

## పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఆయుధాలు మాయంచేసిన ఆపరేటర్

**గురుగ్రామ్,జులై 5:** ఐటిఐ చదివే 22 ఏళ్ల కుర్రాడు ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే 32 ఆయుధాలు మాయంచేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మోనూ అనే యువకుడు అప్రెంటిస్‌షిప్ పేరితో పోలీస్ స్టేషన్‌లో కంప్యూటర్ వర్క్ చేసేందుకు వెళ్లేవాడు. స్టోరేజి రూంలో దాచిన ఆయుధాలపై పడిన అతడి కన్ను ఒక్కో ఆయుధం మాయం చేసాడు. ఏడాదిన్నరకాలంలో ఏకంగా 32 ఆయుధాలను అక్కడి నుంచి మాయం చేశాడు. అలా మాయం చేసిన వాటిని తన కజిన్ విపుల్‌కు ఇచ్చేవాడు. అతడు వాటిని రాజస్థాన్‌కు చెందిన సంజయ్‌కు అప్పగించేవాడు. సంజయ్ తన నెట్‌వర్క్ ద్వారా వాటిని వేరే వాళ్లకు అమ్మేశాడు.ఈ ఏడాది మే నెలలో ఎస్‌హెచ్‌వో రాజ్‌బీర్ సింగ్ స్టోరేజీ రూమ్‌లో స్థానికులు దాచిపెట్టిన ఆయుధాల వివరాలు పరిశీలిస్తుండగా రిజిస్టర్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీంతో పూర్తిగా ఆడిట్ నిర్వహించగా 32 తుపాకీలు మిస్సయినట్లు గుర్తించారు. దొంగతనానికి గురైన వాటిలో విదేశాల్లో తయారైన పిస్టల్స్ కూడా ఉన్నాయి. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరిపారు. మోనూను విచారించగా ఆయుధాలను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. దీంతో మోనూతోపాటు అతడి దగ్గర్నుంచి వాటిని తీసుకొన్న, కొనుగోలు చేసిన 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు మోనూ పట్ల అనుమానం వచ్చి తమదైన స్టయిల్‌లో విచారించగా ఆయుధాలు మాయం చేయడం మాత్రమే కాకుండా గత ఏడాది జులైలో తన కజిన్‌ను కూడా ఆతడు మాయం చేసినట్లు గుర్తించారు. మోనూకు సరిత అనే స్నేహితురాలు ఉంది. మోనూ కజిన్ అయిన శివమ్ తనతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, అడ్వాంటేజీ తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని సరిత అతడికి చెప్పింది. దీంతో మోనూ ఓ ప్లాన్ వేశాడు.


## పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్‌కెప్టెన్ హత్య..



**ఇస్లామాబాద్, జులై 5:** పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అసిమ్ తారిఖ్‌ను గుర్తుతెలియని దండగుడు కాల్చి చంపాడు. ఆదివారం ఇస్లామాబాద్‌లోని షాహీన్ చౌక్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రాథమిక నివేదికల ప్రకారం ఒక మహిళను గుర్తుతెలియని యువకుడు కారులో బలవంతంగా ఎక్కించేందుకు ప్రయత్నిస్తుండగా, అటుగా వెళ్తున్న అసిమ్ తారిఖ్ కాపాడే ప్రయత్నం చేశాడు. దీంతో ఆ యువకుడు అతడిని తుపాకీతో కాల్చి, అక్కడి నుంచి పరారయ్యాడు. బుల్లెట్ గాయంతో తారిఖ్ అక్కడిక్కడే మరణించాడు. అతడి మృతదేహాన్ని పాక్ వైమానిక దళ ఆస్పత్రికి తరలించారు. నిమ్రాగా గుర్తించిన మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాక్ మీడియా చెబుతున్న వివరాల ప్రకారం, నిందితుడు మహిళకు తెలిసిన సహోద్యోగే అని, అతడి పేరు సాద్ అని గుర్తించారు. తనకు లిఫ్ట్ఇస్తానని చెప్పి, దారి మళ్లించి తనతో అసభ్యంగా ప్రవర్తించినట్టు మహిళ ఆరోపించింది. ఫెడరల్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసి, మృతుని కుటుంబానికి హృదయ పూర్వక సంతాపం తెలిపారు. నిందితుడి కోసం ఇస్లామాబాద్ వ్యాప్తంగా గాలిస్తున్నారు. ఈ ఘటనకు ముందు ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని మొహమండ్ జిల్లాలో శుక్రవారం సాయుధ దుండగులు పోలీసు పెట్రోలింగ్‌పై దాడి చేయడంతో, ఒక అదనపు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తో సహా ఇద్దరు పాకిస్తానీ పోలీసు సిబ్బంది మరణించినట్లు తెలిపింది.

# ప్రమాదవశాత్తు బావిలో పడిన ఇద్దరు చిన్నారులు మృతి

**నల్లగొండ రూరల్, జులై 5, ప్రభాతవార్త:** నల్గొండ మండలంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. నల్గొండ మండలం ఖాజీ రామారం గ్రామానికి చెందిన బొంగురాల శంకర్‌లింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం కాగా చిన్న కుమారుడు మణి భార్గవ్ (14), బొలుగూరి నరేష్ సరిత దంపతులకు ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు వినయ్ (10)శనివారం సాయంత్రం గ్రామంలోని గచ్చుబావిలో గాలాలతో చేపలు పట్టడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు గచ్చు బావిలో పడి చనిపోయారు. సాయంత్రానికి పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇరుగు పొరుగు వారిని ఆరా తీశారు. అంతేకాకుండా గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్ ను పరిశీలించగా ప్రభుత్వపాఠశాల పక్కనుండి గచ్చు బాయి పోయే మార్గంలో వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో అటుగా వెతుక్కుంటూ సమీపంలోని గచ్చు బావి దగ్గరికి వెళ్ళి చూడగా ఒక జత చెప్పులు బయట, ఇంకొక జత బావిలో కనబడడంతో పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన తిప్పర్తి ఎస్ఐ శంకర్ రాత్రి ఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సహకారంతో శనివారం అర్ధరాత్రి బావిలో మోటార్‌తో నీళ్ళు తోడుతూ కొక్కెంతో వెతికి మృత దేహాలు బయటకు తీశారు. అనంతరం పోలీసులు పోస్టుమార్టం కోసం నల్గొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మృతి చెందిన చిన్నారులు(ఫైల్)

# ఊబకాయం తగ్గేదెలా ?



ప్రస్తుత సమాజంలో ఊబకాయం ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ఆరోగ్య సమస్యల్లో ఇది ప్రధాన సమస్యగా మారుతోంది. మారుతున్న జీవన విధానంలో ఆహార అలవాట్లు మారుతుండటం ఊబకాయం (ఒబెసిటీ) వ్యాధికి కారణమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం ఇందుకు కారణం. పెద్దలతో పాటు చిన్నారులు ఊబకాయం బారినపడడం ఆందోళన కల్గిస్తుంది.

**సమస్య ఇలా..** పెద్దవారిలో సహా, చిన్నపిల్లలు 20 శాతం ఈ ఊబకాయం వ్యాధి బారినపడుతున్నారు. నెయ్యి, డాల్డా, నూనె అధిక మోతాదులో కలిసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినటంతో రక్తంలో కొవ్వు శాతం పెరుగుతుంది. దీని కారణంగా ఊబకాయ బాధితుల్లో 40 శాతం మంది గుండెపోటుకు గురవుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు వీరిని పట్టిపీడిస్తున్నాయి. పక్షవాతం, నరాల సమస్యలు వంటివి దారితీస్తున్నాయి. గత పదేళ్లలో ఆహార అలవాట్లు ఇతరత్రా కారణాల వల్ల చిన్నారుల్లో ఊబకాయ సమస్యలు తీవ్రంగా ఉంది.

**ముందు జాగ్రత్తలు..** సమతుల్యమైన ఆహారపు అలవాట్లు రోజు తీసుకోవాలి. వ్యాయమాన్ని కొనసాగిస్తే బరువు పెరగకుండా కాపాడు కోగలుగుతాం. ఒబెసిటీకి గురయ్యాక చేసే వర్కవుట్ల కంటే ముందస్తూ జాగ్రత్తలు పాటించాలి.

**వ్యాయమాలు చేయాలి...** చాలామంది ఒబెసిటీకి గురవుతుంటారు. మొదటి నుంచే బరువు పెరుగకుండా సమతుల్యత పాటిస్తే బరాయాన్ని కచ్చితంగా నివారించవచ్చు. మంచి ఆహారపు అలవాట్లు, మానసిక ప్రశాంతత, రోజు వ్యాయమాలు చేయాలి.

**జాగ్రత్తలు ఇవే..** ★. ఊబకాయ సమస్యతో బాధపడేవారు శరీర బరువు తగ్గాలంటే వారంలో రెండు రోజులు ఉపవాసం చేయాలి. ★ 20 ఏళ్లు దాటినవారు ప్రతీరోజు 2,500 కేలరీలు తీసుకోవాలి. ఏ ఆహారం తీసుకున్న ఈ కెలరీలు దాటకుండా చూసుకోవాలి. మిగిలిన రెండు రోజుల్లోకేవలం పావు వంతు అంటే 500 కేలరీలు మాత్రమే తీసుకోవాలి. కార్బొహైడ్రేట్లు తక్కువగా ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. కూరగాయలతోపాటు అన్నానికి బదులు రాగి, జొన్న, చేపలు, చికెన్ తీసుకోవాలి. ★ కాఫీ టీ తీసుకోవచ్చు. తరచూ నీటిని తాగుతూ ఉండాలి. □

మచ్చలేని సౌందర్యాన్ని సొంతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులే కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉండే తులసి ఆకులు కూడా ఇదే కోవకు వస్తాయంటున్నారు నిపుణులు.

# సౌందర్యానికి తులసి



మొటిమలకు..

✦ తాజా తులసి ఆకులను తినడం వల్ల మొటిమలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. తాజా ఆకులను మెత్తగా చేసుకొని మొటిమలపై రాసినా ఫలితం ఉంటుంది.

✦ తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్‌గా కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు. ముఖ చర్మం కాంతివంతంగా కూడా తయారవుతుంది. తులసి పొడిని రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మ రంధ్రాలు తెరుచుకొని మొటిమలు, ఇతర చర్మ సంబంధ సమస్యలు తగ్గుతాయి.. అదేవిధంగా తులసి ఆకుల రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముఖానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమనం కలుగుతుంది.

**నల్లమచ్చల నివారణకు..** ముఖంపై నల్లని మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకు ఒకసారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్లమచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది. □

# హ్యాపీ చాకొలెట్ డే !







ప్రపంచ చాక్లెట్ దినోత్సవం లేదా అంతర్జాతీయ చాక్లెట్ దినోత్సవం ప్రతి ఏటా జూలై 7న జరుపుకుంటారని మీకు తెలుసా!

తెలుసుకుంటే ఎంతో ఉంటుంది. తింటేచాలా ఉంటుంది. చాక్లెట్లు మంచి రుచినే కాదు మంచి ఆరోగ్యాన్నిస్తాయి. చాకొలేట్ తింటే 'బాలల విందు. భలే పసందుగా అనిపిస్తుంది. చాక్‌లెట్ బుగ్గనసందడి చేస్తునంత సేపూ మధురానుభూతి చప్పరించే యచ్చు. అందకే పిల్లలు చాక్‌లెట్‌ను వదలరంటే వదలరు. గుండె ఆరోగ్యాన్ని చైతన్య పరుస్తుంది. చాక్లెట్ గొంతు నొప్పికి ఓదార్పు థెరపీగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తిని పదును పెడుతుంది. మెదడును వృద్ధాప్యం నుండి రక్షిస్తుంది. ప్రపంచవ్యాప్త చాక్లెట్ ప్రేమికులంతా ఏటా నాలుగు సార్లు చాక్లెట్ డే వేడుకలలో చాక్లెట్ అత్యంత రుచికర ట్రీట్‌ల ఆస్వాదించడానికి ఉవ్విళ్లూరు తుంటారు. అంతర్జాతీయ నేషనల్ కన్ఫెక్షనర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ప్రకారం, నాలుగు చాక్లెట్ డే ఉన్నాయి. జూలై 7న , సెప్టెంబరు 13, అక్టోబరు 28 , డిసెంబరు 28న వీటి నేపథ్యాన్ని ఒక్కొ సందర్భంలో మరోలా ఉం టుంది. ఐరోపాలో చాక్లెట్ చరిత్ర కుగల అవినా భావ సంబంధం ఉంది. ఆధునిక చాక్లెట్ బార్‌లను జులై 7, 1847న యూరప్‌లో ప్రవేశపెట్టినట్లు ఆహార చరిత్రకారులు పేర్కొన్నారు. కోకో వెన్న కరిగించి చాక్లెట్ తయారీ చేసిన వ్యక్తి జోసెఫ్ ఫ్రై ఆయన రూపకల్పనలో తొలి మిల్క్ చాకొలేట్ వెలుగు చూసింది.

అప్పటి నుండి చాక్లెట్ తయారీదారులు దాని ఆకృతి, రుచిని మెరుగు పరిచే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

**చాక్లెట్ తయారీ ఇలా..!** చాక్లెట్ కోకో చెట్టు పండ్ల నుండి తయారవుతుంది, కోకో గింజలు చేదు రుచితో ఉంటాయి. కోకో పండ్లను వేడి చేసి షెల్‌ను తొలగించిన అనంతరం గ్రైండింగ్ వల్ల కోకో బీన్స్ లిక్కర్‌గా మారుతుంది. అవే చాకొలేట్‌గా తయారవుతాయి. కోకో బీన్స్ గింజలను అధిక ఉష్ణోగ్రత వద్ద వేయించడంతో ఆ వేడిమిరంగు, రుచిని పెంచుతుంది. అదే సమయంలో తేమను తగ్గిస్తుంది, వినోవర్ బయటి పొట్టును పునరుద్ధరిస్తుంది. కోకో నిట్స్. మిల్లింగ్‌కోకో నిబ్స్ నిబ్ మిల్లులో వేడి పీడనంతో ద్రవ కోకో రాశిని ఏర్పరుస్తుంది. వెచ్చగా, చీకటిగా, చేదుగా ఉండే మిక్సింగ్ కోకో ద్రవాన్ని నొక్కి, కోకా బటర్, వనిల్లా, ఐసింగ్ షుగర్‌తో కలిపి మిల్క్ చాక్లెట్ తయారు చేస్తే మిల్క్ పౌడర్ కలుపుతారు. ఫలితంగా చాక్లెట్ పేస్ట్‌ను ఫైన్ పౌడర్‌గా ట్యూమింగ్ చేయడంతో అద్భుతమైన సున్నిత చాక్లెట్ ఇస్తుంది . చాక్లెట్ పేస్ట్ మళ్లీ ద్రవంగా మారుతుంది. ఈ చివరి దశలో చాక్లెట్ గంటల తరబడి చిలకడం కారణంగా చాక్లెట్ మిశ్రమాలను అభివృద్ధి చేసుకోవచ్చు. ఆల్కహాల్‌ను పంచదార, కోకో వెన్నతో కలిపి తయార్తైనదే చాకొలేట్ ఇతర ప్రసిద్ధ ఆహార పదార్థాల మిశ్రమాలతో, చాక్లెట్ కూడా కాలక్రమేణా అభివృద్ధి చెందింది. మిల్క్ చాక్లెట్, వైట్ చాక్లెట్ నుండి డార్క్ చాక్లెట్ వరకు ఎన్నోరకాలున్నాయి.ప్రతి ఒక్కటి నోరూరించేదే. దేనికదే సాటి. దేని ప్రత్యేకత అదే.

**- ఎం.యశస్వి**

# శివుడాజ్ఞ!

"శివుడాజ్ఞ లేకుండా ఒక ఆకు కూడా కదలదు" అనే మాట భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఎంతో గంభీరమైన భావాన్ని వ్యక్తం చేస్తుంది. శివుడి ఆజ్ఞ అంటే భయపెట్టే శాసనం కాదు; అది ధర్మాన్ని నిలబెట్టే దివ్య సంకల్పం. భక్తుడు తన జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనను శివసంకల్పంగా స్వీకరించినప్పుడు మనసులోని ఆందోళనలు క్రమంగా తొలగిపోతాయి. విజయం వచ్చినా వినయం, అపజయం వచ్చినా సహనం కలుగుతాయి. ఎందుకంటే "ఇది కూడా శివుడి ఆజ్ఞలో భాగమే" అనే విశ్వాసం భక్తునికి ఆత్మబలాన్ని అందిస్తుంది. శివుడు కేవలం సంహారకర్త మాత్రమే కాదు; సృష్టి, స్థితి, లయలకు మూలకారణమైన పరమశివుడు. ఆయన ఆజ్ఞలోనే కాలచక్రం తిరుగుతుంది. ప్రకృతి తన ధర్మాన్ని నిర్వర్తిస్తుంది. జీవులు తమ కర్మఫలాలను అనుభవిస్తారు. పురాణాలలో మహాదేవుడు తన భక్తులను ఎన్నో విధాలుగా పరీక్షించిన సందర్భాలు కనిపిస్తాయి. అయితే ప్రతి పరీక్ష వెనుక భక్తుని ఆధ్యాత్మిక ఉన్నతికి దారి చూపే దివ్య ఉద్దేశమే దాగి ఉంటుంది. మార్కండేయుడి అచంచల భక్తి, కన్నప్ప నాయనారుని అపారమైన ప్రేమ, నందీశ్వరుని అఖండ సేవాభావం ఇవన్నీ శివుడాజ్ఞను హృదయపూర్వకంగా అనుసరించిన మహోన్నత ఉదాహరణలు.నేటి వేగవంతమైన జీవితంలో మనిషి అనేక సందిగ్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. సంపద, పదవి, పేరు ఉన్నా మనశ్శాంతి కొరవడుతోంది. అలాంటి సమయంలో "ఓం నమః శివాయ" అనే పంచాక్షరి మంత్రాన్ని భక్తిశ్రద్ధలతో జపిస్తూ, శివుడి ఆజ్ఞపై విశ్వాసం ఉంచితే మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. సమస్యలు వెంటనే తొలగిపోకపోయినా, వాటిని ఎదుర్కొనే ధైర్యం, వివేకం, ఓర్పు తప్పకుండా లభిస్తాయి. శివుడు వైరాగ్యానికి ప్రతీక. ఆయన బోధించే సందేశం ఎంతో సరళమైనది అహంకారాన్ని విడనాడాలి, సత్యాన్ని ఆచరించాలి, దయను పెంపొందించాలి, సమస్త జీవులను సమానంగా చూడాలి. ఈ విలువలను ఆచరించడం కూడా శివుడాజ్ఞను పాటించడమే. శివుడి కృప పొందడానికి గొప్ప యజ్ఞాలు చేయాల్సిన అవసరం లేదు. నిర్మలమైన హృదయం, నిష్కపటమైన భక్తి, నిస్వార్థ సేవాభావం ఉంటే చాలు. భక్తుని హృదయంలో వెలిగే ప్రేమదీపమే మహాదేవునికి అత్యంత ప్రీతికరమైన నైవేద్యం. మన జీవితంలో జరిగే ప్రతి సంఘటన వెనుక పరమశివుని దివ్య సంకల్పం ఉందనే విశ్వాసం కలిగినవారికి భయం ఉండదు. ఆ విశ్వాసమే జీవితాన్ని ధర్మమార్గంలో నడిపించే వెలుగు. శివుడాజ్ఞను శిరసావహించిన భక్తునికి ప్రతి అడుగు ఆధ్యాత్మిక ప్రగతికి నాంది అవుతుంది. □

# ఉల్లిపొట్టుతో ఆరోగ్యం

ఇంట్లో వంటచేసేటప్పుడు కచ్చితంగా ఉల్లిపాయ వేయాల్సిందే. తర్వాత వాటి పొట్టుని పారేస్తాం. కానీ దాంతో ఇతరత్రా ఆరోగ్య ప్రయోనాలూ ఉన్నాయి. అవేంటో చూసేద్దాం. కొన్ని సార్లు అలర్జీల కారణంగా పాదాలు దురద పెడుతుంటాయి. అలాంటప్పుడు ఉల్లి, వెల్లుల్లి పొట్టును గోరువెచ్చని నీటిలో వేసి పాదాలను ఆ నీటిలో ఉంచితే చాలు. దీనిలోని యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి. చాలామందిలో నిద్రలేమి సమస్య ఉంటుంది. దాన్ని తగ్గించడానికి ఉల్లిపొట్టు ఉపయోగపడుతుంది. దీనిలోనూ పోషకాలూ, ఖనిజాలూ నిండుగా ఉంటాయి. ఒక కప్పు నీటిని వేడి చేసి అందులో ఉల్లిపొట్టు వేసి మూడు నిమిషాలు మరగనివ్వాలి. అందులో కాస్త నిమ్మకాయరసం, తేనె జోడించి ఆరోగ్యకరమైన టీని ఆస్వాదించవచ్చు. ఇది ఇంద్రియాలను శాంతపరిచి, కమ్మని నిద్రని అందిస్తుంది. ఆ. పొట్టు మరిగించిన నీళ్లు క్రిమిసంహారకంగా పనిచేస్తాయి.గొంతులో నొప్పి, మంటను తొలగిస్తాయి. శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉంటాయి. గొంతు ఇన్‌ఫెక్షన్లురావు. □

# 'రావు బహదూర్' సక్సెస్ మీట్



శ్రీచక్రాస్ ఎంటర్టైన్మెంట్స్,ఎ+ఎస్ మూవీస్, మహాయాన మోషన్ పిక్చర్స్ బ్యానర్ల మీద చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించిన చిత్రం 'రావు బహదూర్'. జీఎంబీ ఎంటర్టైన్మెంట్ సమర్పణలో వచ్చిన ఈ సినిమాకి వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సత్య దేవ్, దీపా థామస్ జంటగా నటించారు. సత్య దేవ్ మాట్లాడుతూ..'ప్రమోషన్స్ టైంలో ఎవరైనా సరే సినిమా గురించి ఎక్కువగానే చెబుతుంటారు. కానీ మేం మాత్రం మూవీకి పని చేసినప్పుడు మాకు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. అదే ఫీలింగ్‌నే నేను ప్రమోషన్స్‌లో మాట్లాడాను.'బాహుబలి','ఆర్ఆర్ఆర్' తర్వాత మా 'రావు బహదూర్' తెలుగు సినిమాకు ప్రతినిధిగా ఉంటుందని చెప్పాను అన్నారు. వెంకటేష్ మహా మాట్లాడుతూ.. 'రావు బహదూర్' కథను సత్య దేవ్ నమ్మాడు. ఈ సినిమాని అనురాగ్, శరత్‌లు నమ్మడం వల్లే ఇంత వరకు వచ్చింది. మేం నమ్మి వేసిన ప్రతీ అడుగు విజయ తీరానికి చేర్చింది' అన్నారు. చింతా గోపాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. 'రావు బహదూర్' సినిమాకి సపోర్ట్ చేసిన మహేష్ బాబు గారికి, నమ్రత గారికి థాంక్స్. మీడియా కూడా మాకు సపోర్ట్ చేస్తోంది' అన్నారు. నిర్మాత రాజశేఖర్ మాట్లాడుతూ..'మహా అన్నని నాకు పరిచయం చేసిన దినేష్ అన్నకి థాంక్స్. అనురాగ్, శరత్ నుంచి చాలా నేర్చుకున్నాను. సత్య దేవ్, దీపా గారికి థాంక్స్' అన్నారు. శరత్ చంద్ర మాట్లాడుతూ..'రావు బహదూర్' ప్రీమియర్లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా స్టార్టింగ్‌లో కొంచెం అటూ ఇటూ రెస్పాన్స్ వచ్చింది. కానీ చివరకు మాత్రం అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది' అన్నారు. అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ..'రావు బహదూర్' సినిమాకి అన్ని రకాల రివ్యూలు వస్తున్నాయి. చిత్రంలోని డెప్త్ గురించి గొప్పగా మాట్లాడారు' అన్నారు. దీపా థామస్ మాట్లాడుతూ..'నేను ఎక్కడకు వెళ్లినా సరే 'రావు బహదూర్' అనే గొప్ప చిత్రంలో పని చేశానని గర్వంగా చెప్పుకుంటాను. ఇలాంటి ఓ గొప్ప అవకాశాన్ని ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్' అన్నారు.

# 'ఓ..! సుకుమారి' నుంచి సాంగ్ రిలీజ్



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ జంటగా నటించిన విలేజ్ ఎంటర్టైనర్ 'ఓ.! సుకుమారి'. భరత్ దర్శన్ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వరరెడ్డి మూలి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. జూలై 17న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈక్రమంలో చిత్రం నుంచి 'ప్రేమ.. ప్రేమిస్తున్నా'అనే రొమాంటిక్, మెలోడీ పాటను విడుదలచేశారు. ఈ పాటను జేమ్స్ టకారా ఆలపించారు. పూర్ణాచారి లిరిక్స్ ఎంతో చక్కగా ఉన్నాయి. విలేజ్ వాతావరణం, హీరో హీరోయిన్ ట్రాక్, సింపుల్ కొరియోగ్రాఫీ పాటను అందంగా మలిచింది. రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు.

# 'చెన్నై లవ్ స్టోరీ' ఫోర్త్ సింగిల్ రిలీజ్



"కలర్ ఫొటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేష్ కాంబినేషన్‌లో "చెన్నై లవ్ స్టోరీ" సినిమా రూపొందుతోంది. శనివారం ఈ చిత్రంనుంచి ఫోర్త్ సింగిల్ హోయిలా.. హోయిలా రిలీజ్ ఈవెంట్ విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "చెన్నై లవ్ స్టోరీ" సినిమా పాటలు మెలోడియస్‌గా ఉన్నాయి. ఈ చిత్రంలోని పాటలు చూస్తుంటే కిరణ్ మన పొరిగింటి కుర్రాడిలా సహజంగా కనిపించారు' అన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ 'కిరణ్ నాకు బాగా పరిచయమున్న హీరో. సెటిల్డ్ పర్ ఫార్మెన్స్‌తో సహజంగా నటిస్తూ ఆకట్టుకుంటాడు. ఈ సినిమా కూడా ఆయనకు మంచి పేరు తీసుకురావాలి. శ్రీ గౌరిప్రియ తెలుగమ్మాయి. నటించడమే కాదు బాగా పాటలు పాడుతుంది. మీ నెక్ట్స్ మూవీలో గౌరి ప్రియతోనే పాటలు పాడించండి' అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'ఈ థియేటర్ నాకు బాగా కలిసొస్తుంది. మీతో కలిసి ఈ రోజు "చెన్నై లవ్ స్టోరీ" సాంగ్స్ చూస్తుంటే ఎప్పుడెప్పుడు మీతో కలిసి సినిమా చూద్దామా అనిపిస్తోంది' అన్నారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'ఈ ఈవెంట్ వైజాగ్‌లో చేయాల్సి ఉండేది. వర్షం కారణంగా విజయవాడకు వెన్యూ మారింది. ఈవెంట్ మా సొంతూరు విజయవాడకు రావడం నాకు హ్యాపీగా అనిపిస్తోంది' అన్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ విజయవాడ అంటే నాకు చాలా ఇష్టం. మా మూవీ ఈవెంట్ ఇక్కడ మీ మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది" అన్నారు. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ 'నా సొంతూరు విజయవాడలో మా "చెన్నై లవ్ స్టోరీ" సినిమా ఈవెంట్ జరుపుకోవడం సంతోషంగా ఉంది" అన్నారు.

# 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుకుంటున్నారు

తెర




## సక్సెస్ మీట్‌లో నిర్మాత శరత్ చంద్ర నాయుడు..

విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా శరత్ చంద్ర నాయుడు నిర్మించిన సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. ఈ సిరీస్‌ను వినోద్ గాలి తెరకెక్కించారు. రోహిణి హట్టంగడి, శివ నారాయణ నరిపెద్ది, ప్రియదర్శిని రామ్ తదితరులు ఈ సిరీస్‌లో ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సిరీస్ ప్రస్తుతం ఈటీవీ విన్‌లో సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలో విజయోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన సక్సెస్ మీట్‌లో.. విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ "నేను కొత్తగా ప్రయత్నించిన ప్రతీ సారి తెలుగు ఆడియెన్స్ నన్ను సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌కి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో అని చాలా భయపడ్డాను. కానీ సిరీస్ బయటకు వచ్చాక.. అందరూ ఫోన్స్ చేసి ప్రశంసిస్తున్నారు. నవ్వాం, ఏడ్చాం.. ఇలాంటి పాత్రను చేసినందుకు థాంక్స్ అని నాతో చెప్పి పొగుడుతున్నారు. శరత్ గారు ఈ ప్రాజెక్ట్‌ని ఇష్టపడి కాదు, ప్రేమించి చేశారు. వినోద్ గారు ఈ సిరీస్ కోసం దాదాపు రెండేళ్లు కష్టపడ్డారు. సాయి గారు, భరణ్ గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. రాజశేఖర్ మంచి కథను మాకు ఇచ్చారు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన సిద్ధు, గోపీ, రాఘవ్‌లకు థాంక్స్. యశశ్రీ మాకు చాలా సపోర్ట్ చేశారు. చైల్డ్ ఆర్టిస్ట్లు అందరూ అద్భుతంగా నటించారు. ఎడిటర్ శ్రీధర్ మా సిరీస్‌ను ఇష్టపడ్డారు కాబట్టే ఇంత గొప్పగా ఎడిట్ చేశారు. మా సిరీస్ ఫ్యామిలీ అందరికీ నచ్చేస్తోంది' అన్నారు.

నిర్మాత శరత్ చంద్ర నాయుడు మాట్లాడుతూ..'ఏడాదిన్నర పాటుగా ఈ 'గుర్తుకొస్తున్నాయి' మా నిద్రలేని రాత్రుల్లో, మా చర్చల్లో ఉంది. కానీ ఇప్పుడు ప్రతీ ఒక్కరి గుండెల్లో ఉంది. మాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన కాస్ట్ అండ్ క్రూ అందరికీ థాంక్స్" అన్నారు. ఈటీవీ వైస్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' గుర్తు చేస్తుంది, గుర్తుండిపోతుంది. ఇంతలా ఆదరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్ "అన్నారు.

ఈటీవి విన్ కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ.. "మా 'గుర్తుకొస్తున్నాయి' అలా అందరికీ ఎప్పుడూ గుర్తుండిపోతుంది" అన్నారు. దర్శకుడు వినోద్ గాలి మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌ని నాకు ఇచ్చిన శరత్ గారికి, నితిన్‌కి, భరణ్‌కి, సాయి గారికి థాంక్"అన్నారు. యశశ్రీ మాట్లాడుతూ.. 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌ను ఇంత పెద్ద హిట్ చేసిన ఆడియెన్స్‌కి థాంక్స్. నాకు ఈ సిరీస్‌లో అవకాశం ఇచ్చిన శరత్ గారికి, వినోద్ గారికి థాంక్స్"అన్నారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్ ప్రమదేష్ మాట్లాడుతూ.. 'నాకు ఈ అవకావం ఇచ్చిన సాయికి థాంక్స్. ఇది బ్లాక్ బస్టర్ అవుతుందని నేను ముందే నమ్మాను. ఈ సిరీస్‌ను సక్సెస్ చేసిన అందరికీ థాంక్" అన్నారు.

# NN5 పూజా కార్యక్రమంతో ప్రారంభం




వరుసగా మూడు విజయవంతమైన చిత్రాలను అందించిన యంగ్ హీరో నార్నే నితిన్, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. 'జూనియర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాధాకృష్ణ రెడ్డితో ఒక యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కోసం జతకట్టారు. NN5 చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తుండగా, లోహిత ఎన్.కె క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. వివిధ చిత్ర పరిశ్రమలలో భారీ స్థాయి చిత్రాలను నిర్మిస్తూ దేశంలోని అగ్రశ్రేణి నిర్మాణ సంస్థలలో ఒకటిగా కెవిఎన్ ప్రొడక్షన్స్ గుర్తింపు పొందింది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాలను అందించే తమ మార్క్ ను కొనసాగిస్తూ, ఈ సంస్థ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తోంది. ఇందులో నార్నే నితిన్ సరికొత్తగా కనిపించనున్నారు. ఈ చిత్రంలో నార్నే నితిన్ సరసన అనికా సురేంద్రన్, మేఘా శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకులలో భారీ ఆసక్తిని రేకెత్తించింది. ఈ రోజు సంప్రదాయ పూజా కార్యక్రమంతో చిత్రం ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత వెంకట్ కె నారాయణ క్లాప్ కొట్టగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ కెమెరాను ఆన్ చేశారు. మ్యాడ్ చిత్ర దర్శకుడు కళ్యాణ్ శంకర్ ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించగా, వెంకట్ కె నారాయణ స్క్రిప్ట్‌ను దర్శకుడు రాధాకృష్ణకు అందజేశారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. వివేక్, మెర్విన్ ద్వయం దీనికి సంగీతం సమకూరుస్తున్నారు. రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటింగ్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. శరణ్య పోట్ల, అజయ్ గద్దె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరిస్తున్నారు.

# క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన ఫ్రాన్స్, మొరాకో


తొలి ఆఫ్రికా దేశంగా మొరాకో

**పెన్సిల్వేనియా, జులై 5:** ఫిఫా ప్రపంచకప్ 2026లో మొరాకో, ఫ్రాన్స్ జట్లు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. తొలి రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో సహా ఆతిథ్య జట్టు కెనడాపై 3-0 గోల్స్‌తో మొరాకో.. పరాగ్వేపై ఏకైక గోల్‌తో ఫ్రాన్స్ గెలుపొందాయి. క్వార్టర్ ఫైనల్‌లో మొరాకోతో ఫ్రాన్స్ తలపడనుంది.

ప్రికార్వర్ట్ ఫైనల్లో పరాగ్వేపై ఫ్రాన్స్ చెమటోడ్చి నెగ్గింది. పరాగ్వే చివరకు వరకు గట్టి పోటీ ఇచ్చింది. ఈ పోరు రసవత్తరంగా సాగింది. పెన్సిల్వేనియాలో జరిగిన మ్యాచ్‌లో పరాగ్వేపై 1-0 తేడాతో ఫ్రాన్స్ విజయం సాధించింది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్, కెప్టెన్ కిలియన్ ఎంబాపె సెకండాఫ్‌లో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచి జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు చేర్చాడు. టోర్నమెంట్ అంతటా దూకుడుగా ఆడిన ఫ్రాన్స్ జట్టుకు, ఈ మ్యాచ్‌లో మాత్రం పరాగ్వే డిఫెండర్లు ఊహించని సవాలును విసిరారు. ఈ మ్యాచ్ లో గెలవడానికి ఫ్రాన్స్ జట్టు చమటోడ్చాల్సి వచ్చింది.

గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లలో ప్రత్యర్థులపై సులువుగా విజయాలు సాధిస్తూ దూసుకొచ్చిన ఫ్రాన్స్ జట్టుకు... పరాగ్వే గట్టి పోటీ ఇచ్చింది. గత మ్యచ్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం జర్మనీని ఓడించి సంచలనం సృష్టించిన పరాగ్వే, అదే ఉత్సాహంతో ఫ్రాన్స్‌ను సైతం కట్టడి చేయడానికి పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. మ్యాచ్ ప్రారంభమైన నిమిషం నుంచే ఫ్రాన్స్ జట్టు బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని అటాకింగ్ గేమ్ ఆడింది. ప్రారంభ నిమిషాల్లో ఫ్రాన్స్ ఏకంగా 80 శాతానికి పైగా బాల్‌ను తమ వద్దే ఉంచుకుంది. ముఖ్యంగా పరాగ్వే యువ సంచలనం జూలియో ఎన్సిసో చురుగ్గా కదులుతూ ఫ్రాన్స్ ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా, తొలి 45 నిమిషాల ఆటలో ఫ్రాన్స్ గోల్ కోసం కేవలం ఐదు ప్రయత్నాలు మాత్రమే చేసినా ఒక్కటీ కూడా ఫలించలేదు.

### గోల్డెన్ బూట్‌రేసులో ఎంబాపే... ఏడో గోల్

తొలి అర్ధభాగంలో ఫ్రాన్స్ స్టార్ ఎంబాపెను పరాగ్వే మిడ్‌ఫీల్డర్ ఆండ్రెస్ క్యూబాస్ అడ్డుకోవడంతో ఫౌల్ అయ్యింది. ఈ క్రమంలో ఎంబాపె కోపంతో స్పందించగా, ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు నెట్టుకుంటూ మైదానంలో పెద్ద ఎత్తున ఘర్షణకు దిగారు. రెఫరీ వెంటనే జోక్యం చేసుకుని ఆటగాళ్లను శాంతింపజేయాల్సి వచ్చింది. ఎంబాపె అద్భుతం టండో అర్ధభాగంలో ఆట స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఫ్రాన్స్ జట్టు మరింత పట్టుదలతో మైదానంలోకి అడుగుపెట్టింది. మిడ్‌ఫీల్డర్ మను కోనే లాంగ్‌రేంజ్ నుంచి కొట్టిన ఒక శక్తివంతమైన షాట్‌ను పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ గాల్లోకి ఎగిరి అద్భుతంగా అడ్డుకున్నాడు. ఈ క్రమటంలో ఫ్రాన్స్ కోచ్ 66వ నిమిషంలో వ్యూహాత్మకంగా డెసిరే డౌను మైదానంలోకి పంపాడు. డౌ మైదానంలోకి వచ్చిన వెంటనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. మెరుపు వేగంతో కదులుతూ ముగ్గురు పరాగ్వే డిఫెండర్లను దాటుకుని పెనాల్టీ బాక్స్‌లోకి దూసుకెళ్తున్న డౌను పరాగ్వే ఆటగాడు డియాగో గోమెజ్ కింద పడేశాడు. దీంతో రెఫరీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఫ్రాన్స్‌కు పెనాల్టీ కిక్ ఇచ్చాడు. దిగ్గజ ఆటగాడు ఎంబాపె ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా, బంతిని అత్యంత చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ గోల్‌తో మెస్సీతో సమానంగా 7 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపే ముందున్నాడు. గోల్ సమం చేసి మ్యాచ్‌ను ఎక్స్‌ట్రా టైమ్‌కు తీసుకెళ్లాలని పరాగ్వే జట్టు చివరి 20 నిమిషాల్లో తీవ్రంగా పోరాడింది. కానీ, ఫ్రాన్స్ డిఫెండర్లు, మిడ్‌ఫీల్డర్లు సమన్వయంతో ఆడుతూ పరాగ్వే ప్రయత్నాలను భగ్నం చేశారు. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు, ఇంజ్యూరీ టైమ్‌లో ఎంబాపె వ్యక్తిగతంగా రెండో గోల్ సాధించే సువర్ణావకాశాన్ని అందుకున్నాడు. అయితే పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ వరుసగా రెండు అద్భుతమైన సేవ్‌లు చేసి ఫ్రాన్స్ ఆధిక్యం పెరగకుండా అడ్డుకున్నాడు. చివరకు ఫ్రాన్స్ 1-0తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

### చరిత్ర సృష్టించిన మొరాకో.. తొలి ఆఫ్రికా దేశం

మరో ప్రికార్వర్ట్ ఫైనల్లో అతిథ్య కెనాడాపై 3-0 గోల్స్‌తో గెలుపుతో మొరాకో చరిత్ర సృష్టించింది. వరుసగా రెండు ప్రపంచకప్‌లలో క్వార్టర్స్‌కు చేరిన తొలి ఆఫ్రికన్ జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో అజెద్దీన్ రెండు గోల్స్‌తో మొరాకోకు చారిత్రక విజయాన్ని అందించాడు. అదనపు సమయంలో సూఫియాన్ రహిమీ మరో గోల్ చేసి మొరాకోను క్వార్టర్స్‌కు చేర్చాడు. జూలై 9న బోస్టన్‌లో జరిగే తొలి క్వార్టర్‌లో ఫ్రాన్స్, మొరాకో తలపడనున్నాయి.



గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె(7 గోల్స్)

# ఫెదరర్ రికార్డును బ్రేక్ : క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్

**లండన్, జులై 5:** ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్ మరో అరుదైన రికార్డు నెలకొల్పాడు. నాలుగో రౌండ్‌లో రష్యన్ క్వాలిఫయర్ రోమన్ సఫియుల్లిన్‌పై 7-6, 6-3, 3-6, 6-3తో నెగ్గి రోజర్ ఫెదరర్ రికార్డును బద్దలు కొట్టాడు. వింబుల్డన్‌లో విజయాల సంఖ్యను 106కు చేర్చాడు. ఈ క్రమంలో ఫెదరర్(105) మ్యాచ్‌ల విజయాన్ని వెనక్కి నెట్టా డు. ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో పురుషుల, మహిళల విభాగాలలో కలిపి మార్టినా నవ్రతిలోవా(120) మాత్రమే ఎక్కువ సింగిల్స్ మ్యాచ్‌లు గెలిచింది. అలాగే జొకోవిచ్ 17వ సారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్, వరుసగా తొమ్మిదో సారి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. ఇది కూడా రికార్డే. క్వార్టర్ ఫైనల్లో కెనడియన్ మూడో సీడ్ ఫెలిక్స్ ఆగర్‌అలియాసిమ్, స్పానిష్ అలెజాండ్రో డేవిడోవిచ్ ఫోకినా మ్యాచ్ విజేతతో తలపడతాడు.

ఈ వారం ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో ఆడిన తన మొదటి మూడు మ్యాచ్‌లలో రెండింటిలో ఒక సెట్ కోల్పోయిన తర్వాత తిరిగి పుంజుకున్నాడు. 25వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్‌పై కన్నేసిన జొకోవిచ్... రష్యన్ క్వాలిఫయర్‌తో జరిగిన నాలుగో రౌండ్‌లో చెమటోడ్చాల్సి వచ్చింది. తొలిసెట్‌లోనే ఇరువురు పోటాపోటీగా తలపడ్డారు. టైబ్రేకర్ వరకు జరిగిన ఈ సెట్‌ను 7-6తో కైవసం చేసుకున్న జొకోవిచ్... రెండో సెట్‌ను అలవోకగా 6-3తో నెగ్గాడు. అయితే మూడో సెట్‌లో పుంజుకున్న రోమన్.. జొకోవిచ్ సర్వీసును కొల్లగొట్టి సెట్‌ను6-3తో నెగ్గిఆధిక్యాన్ని 2-1కు తగ్గించాడు. అయితే నాలుగోసెట్‌లో జొకోవిచ్..ప్రత్య ర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండాసెట్‌ను మ్యాచ్‌ను ముగించి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు.

### సబలెంకాకు ఒసాకా షాక్

మహిళల సింగిల్స్‌లో సంచలనం నమోదైంది. టాప్‌సీడ్ సబలెంకాను 14వసీడ్ నయోమి ఒసాకా(జపాన్) వరుస సెట్లలో 6-2,7-6తో ఓడించింది. వింబుల్డన్‌లో ఫ్యాషన్లతో హోరెత్తిసున్న ఒసాకా... గేమ్‌లో అదే జోరు కొనసాగిస్తోంది. తొలి సెట్‌ను అలవోకగా నెగ్గి ఒసాకా శుభారంభం చేసింది. రెండోసెట్‌లో పుంజుకున్న సబలెంకా... సర్వీసులను నిలుపుకోవడంతో టైబ్రేక్‌కు సాగింది. అయితే ఒసాకా ఈ దశలో సబలెంకా సర్వీసును కొల్లగొట్టి రెండో సెట్‌తో పాటు మ్యాచ్‌ను ముగించి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది.


వింబుల్డన్‌లో 106 మ్యాచ్‌లు నెగ్గిన జొకోవిచ్

# మహిళల టి20 ఛాంపియన్‌గా ఆస్ట్రేలియా

**లార్డ్స్, జులై 5:** మహిళల టీ20 ప్రపంచకప్ విజేతగా ఆస్ట్రేలియా నిలిచింది. లార్డ్స్ వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. 151 పరుగుల లక్ష్యాన్ని 17.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెత్ మూనీ(64) హాఫ్ సెంచరీతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (48), ఎలీస్ పెర్రీ (13..), జార్జియా వోల్ (9) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో షార్లెట్ డీన్, లారెన్ బెల్, సోఫీ ఎకిల్‌స్టోన్ తలో వికెట్ తీశారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఆరంభంలో తడబడింది. 32 పరుగులకే ఓపెనర్లు ఇద్దరు అమీ జోన్స్(6), డానీ హాడ్జ్(8) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో నాట్‌సీవర్ బ్రంట్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. 53 బంతుల్లోనే 5 ఫోర్లతో 58 పరుగులు సాధించింది. అలీస్ క్యాప్సీ (23)తో కలిసి మూడో వికెట్‌కు 35 రన్స్ జోడించింది. చివర్లో ఫ్రేయా కెంప్ మెరుపులతో ఇంగ్లాండ్ 150 మార్కుకు చేరుకుంది. కెంప్ 28 బంతుల్లోనే 4 ఫోర్లు, ఓ సిక్స్‌తో 44 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 150 రన్స్ చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, సోఫీ, అన్నాబెల్ సదర్లాండ్ తలో వికెట్ తీశారు.

151 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఆరంభంలోనే ఓపెనర్ జార్జియా వోల్(9) వికెట్ కోల్పోయింది. అయితే బెత్ మూనీ(49 బంతుల్లో 64; 10 ఫోర్లు), లిచ్‌ఫీల్డ్(35 బంతుల్లో 48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు ఏకంగా సెంచరీ భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా గెలుపుకు బాటలు వేశారు. ఇద్దరూ అవ్వుటైనా మిగతా పనిని పెర్రీ(13), గార్డ్‌నర్(3) పూర్తి చేయడంతో ఆస్ట్రేలియా 17.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది.



# డివిడెండ్లు బోనస్‌లతో ఈ వారం బిజీబిజీ

**ముంబయి, జులై 5:** కంపెనీల డివిడెండ్లు, బోనస్‌లు, స్టాక్ విభజన వంటి వాటితో రానున్న వారం స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కీలకంగా మారనుంది. పలు ప్రముఖ కంపెనీలు డివిడెండ్‌లు, బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్లకు సంబంధించిన రికార్డ్ తేదీలను ప్రకటించాయి. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఇన్వెస్టర్లు ఆయా రికార్డ్ తేదీలకు ముందు షేర్లను కలిగి ఉండాలి. రికార్డ్ డేట్ ఆధారంగానే డివిడెండ్, బోనస్ షేర్లు లేదా స్టాక్ స్ప్లిట్ ప్రయోజనాలకు అర్హులైన వాటాదారులను కంపెనీలు నిర్ణయిస్తాయి. సాధారణంగా ఎక్స్‌డేట్ కూడా ఇదే రోజున ఉంటుంది. ఆ రోజు నుంచి షేర్ ధర కార్పొరేట్ యాక్షన్‌కు అనుగుణంగా సర్దుబాటు అవుతుంది.

ఈ వారం జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, నెస్లే ఇండియా, యునైటెడ్ స్పిరిట్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ వంటి ప్రముఖ కంపెనీల కార్పొరేట్ యాక్షన్స్‌పై మార్కెట్ దృష్టి నెలకొంది. డివిడెండ్‌లు డీసీఎం శ్రీరామ్ ఇంటర్నేషనల్, డీజే మీడియాప్రింట్ అండ్ లాజిస్టిక్స్, పిలానీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, సుందరం ఫైనాన్స్, సెరా శానిటరీవేర్ కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి. దొడ్ల డెయిరీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌కేపీ సెక్యూరిటీస్, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ షేర్లు ఎక్స్‌డివిడెండ్‌లోకి ప్రవేశించనున్నాయి. బ్లిస్ జీవీఎస్ ఫార్మా, హన్నా జోసెఫ్ హాస్పిటల్, కేశర్ టెర్మినల్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంఫాసిస్, యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీలకు ఎక్స్‌డివిడెండ్ వర్తించనుంది. హర్షా ఇంజినీర్స్ ఇంటర్నేషనల్, ఆర్‌పీజీ లైఫ్ సైన్సెస్, షీలా ఫోమ్, టైటాన్ కంపెనీ ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ అవుతాయి.




అపోలో టైర్స్, ఆర్టెమిస్ మెడికేర్ సర్వీసెస్, యాక్సిస్ బ్యాంక్, బిర్లా సాఫ్ట్, కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, కంట్రోల్ ప్రింట్, డిలింక్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, డైనమిక్ కేబుల్స్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, గ్రైండ్‌వెల్ నార్టన్, హిందాల్కో ఇండస్ట్రీస్, జేకే సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, మహీంద్రా లాజిస్టిక్స్, నెస్లే ఇండియా, న్యూ ఇండియా అష్యూరెన్స్, నిలకమల్, ఓరియెంట్ ఎలక్ట్రిక్, పీటీఎల్ ఎంటర్‌ప్రైజెస్, రోస్సారి బయోటెక్, స్మార్ట్‌లింక్ హోల్డింగ్స్, శోభా, వెల్‌స్పన్ లివింగ్, జెడ్‌ఎఫ్ కమర్షియల్ వెహికల్ కంట్రోల్ సిస్టమ్స్ ఇండియా కంపెనీలు ఎక్స్‌డివిడెండ్‌గా ట్రేడ్ కానున్నాయి.

స్టాక్ విభజనపరంగా గుజరాత్ ఇంజెక్ట్ కేరళ కంపెనీ షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజిస్తూ జూలై 8ను రికార్డ్ డేట్‌గా నిర్ణయిం చింది. మంగళం వరల్డ్‌వైడ్ కంపెనీ కూడా షేర్ ఫేస్ వ్యాల్యూను రూ.10 నుంచి రూ.1కు విభజించి జూలై 10 రికార్డ్ డేట్‌గా వెల్లడించింది.

బోనస్ షేర్లుగోల్డియామ్ ఇంటర్నేషనల్ కంపెనీ 1:3 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. హిందుస్థాన్ ఇన్సులేటర్స్ అండ్ ఇండస్ట్రీస్ 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇవ్వనుంది.




# ఫ్యాషన్‌బ్రాండ్ నైకా రాబడుల్లో 30శాతం వృద్ధి

**ముంబయి, జులై 5:** ఈకామర్స్ సంస్థ నైకా మాతృసంస్థ ఎఫ్‌ఎస్‌ఎన్ ఈకామర్స్ వెంచర్స్ లిమిటెడ్ జూన్ త్రైమాసికంలో బలమైన వ్యాపార వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపింది. సమీకృత గ్రాస్ మెర్చండైజ్ వ్యాల్యూ, నెట్ సేల్స్ వ్యాల్యూవృద్ధి30శాతం ప్రారంభ స్థాయిలో ఉండే అవకాశముందని, మొత్తం ఆదాయ వృద్ధి దాదాపు 30 శాతానికి చేరుకుంటుందని కంపెనీ అంచనా వేసింది. కంపెనీ విడుదల చేసిన త్రైమాసిక వ్యాపార అప్‌డేట్ ప్రకారం, బ్యూటీ విభాగం నెట్ సేల్స్ వ్యాల్యూ, నికర ఆదాయంలో 20 శాతం వృద్ధిని నమోదు చేయనుంది. కొత్త వినియోగదారుల చేరిక, ఓమ్నీఛానల్ వ్యాపార విస్తరణ, మార్కెటింగ్ ఆదాయంలో పెరుగుదల ఈ వృద్ధికి ప్రధాన కారణాలని కంపెనీ తెలిపింది. రిటైల్ స్టోర్లలో ఇప్పటికే ఉన్న అవుట్‌లెట్ల విక్రయాల పెరుగుదలతో పాటు కొత్త స్టోర్ల విస్తరణ కూడా బ్యూటీ వ్యాపానికి బలాన్నిచ్చిందని పేర్కొంది. అలాగే కంపెనీ సొంత బ్రాండ్ల పోర్ట్‌ఫోలియో కూడా మంచి వృద్ధిని నమోదు చేస్తోందని తెలిపింది. హౌస్ ఆఫ్ నైకా పరిధిలోని కే బ్యూటీ, నైకా కాస్మెటిక్స్, డాట్ అండ్ కీ బ్రాండ్లు స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తున్నాయని కంపెనీ వెల్లడించింది. ఈ విభాగంలో నెట్ సేల్స్ విలువలు 50 శాతం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. బ్యూటీ, ఫ్యాషన్ విభాగాల్లో కొత్త వినియోగదారుల చేరిక కోసం మార్కెటింగ్‌పై పెట్టుబడులు కొనసాగుతున్నాయని, దీంతో మరో త్రైమాసికంలో కూడా ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేస్తామని నైకా ఆశాభావం వ్యక్తం చేసింది.

# మార్కెట్‌కు ఈ వారం ఐపిఒల సందడి

## నాలుగు కొత్త ఐపిఒలతో రూ.1460 కోట్లు సేకరణ

**ముంబయి, జులై 5:** భారత ప్రైమరీ మార్కెట్‌లో ఈవారం ఐపీఓల సందడి కొనసాగనుంది. మొత్తం నాలుగు కొత్త ఐపీఓలు ఇన్వెస్టర్ల కోసం వస్తున్నాయి. వీటితో కంపెనీలు సుమారు రూ.1,460 కోట్ల నిధులు సమీకరించను న్నాయి. రెండు మెయిన్‌బోర్డ్, రెండు ఎస్‌ఎంఈ ఐపీఓలు ఉన్నాయి. ఇదే సమయంలో తొమ్మిది కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. జూలై 8న కుసుమ్‌గర్ లిమిటెడ్ మెయిన్‌బోర్డ్ ఐపీఓ ప్రారంభం కానుంది. రూ.650 కోట్ల ఈ ఐపీఓకు ఒక్కో షేరు ధరను రూ.398 నుంచి రూ.419 మధ్య నిర్ణయించారు. జూలై 10తో సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది.

ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనుంది. జూలై 9న లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ.742 కోట్ల ఐపీఓను ప్రారంభించనుంది. ఇందులో రూ.542 కోట్ల తాజా ఈక్విటీ ఇష్యూ, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. సబ్‌స్క్రిప్షన్ జూలై 13 వరకు కొనసాగుతుంది. ఎస్‌ఎంఈ విభాగంలో హ్యాపీ స్టీల్స్ లిమిటెడ్ జూలై 9న రూ.25 కోట్ల ఐపీఓను ప్రారంభిస్తోంది. షేరు ధరను రూ.62 నుంచి రూ.66 మధ్య నిర్ణయించగా, మొత్తం 38 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. దేవ్‌సన్ క్యాటలిస్ట్ లిమిటెడ్ కూడా తన ఎస్‌ఎంఈ ఐపీఓను ప్రారంభించనుంది. రూ.42.34 కోట్ల ఈ ఇష్యూలో రూ.39.39 కోట్ల తాజా షేర్లు, రూ.2.95 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి. ఒక్కో షేరు ధరను రూ.112 నుంచి రూ.118 మధ్య నిర్ణయించారు. మరోవైపు, లిస్టింగ్ క్యాలెండర్ కూడా బిజీగా ఉండనుంది. ఆస్థా స్పిన్‌టెక్స్ జూలై 6న బీఎస్ఈ, ఎన్‌ఎస్ఈల్లో లిస్ట్ కానుండగా, నాక్ ప్యాకేజింగ్ జూలై 8న మెయిన్‌బోర్డ్‌లో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. ఎస్‌ఎంఈ విభాగంలో అడాన్ అగ్రో కమోడిటీస్ తేజా ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్, అథర్వ పాలీప్లాస్ట్, సీమ్యాక్స్ రిసోర్సెస్, సంపర్క్ ఇండియా లాజిస్టిక్స్, వినీత్ మొబైల్, క్రిటికల్ టెక్ సంస్థలుఈనెల ఐదారుతేదీల్లో లిస్టింగ్ కానున్నాయి.




# టాప్6 కంపెనీల్లో లక్షకోట్లు పెరిగిన మార్కెట్‌క్యాప్



**ముంబయి, జులై 5:** దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడంతో గత వారం దేశంలోని టాప్10 అత్యంత విలువైన కంపెనీల్లో ఆరు సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.1 లక్ష కోట్లకు పైగా పెరిగింది. వీటిలో భారతి ఎయిర్‌టెల్ మరియు బజాజ్ ఫైనాన్స్ అత్యధిక లాభాలు నమోదు చేసిన సంస్థలుగా నిలిచాయి.

గత వారం బీఎస్ఈ సెన్సెక్స్ 663 పాయింట్లు, ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 214 పాయింట్లు పెరిగాయి. దేశీయ ఆర్థిక సూచీలు బలంగా ఉండటం, జీఎస్టీ వసూళ్లు ఆశాజనకంగా నమోదు కావడం, పారిశ్రామిక కార్యకలాపాలు మెరుగుపడటం మార్కెట్లకు ఊతమిచ్చాయి. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగా రావడంతో ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లపై సానుకూల అంచనాలు పెరిగి పెట్టుబడిదారుల విశ్వాసం బలపడింది. గత వారం భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.36,529 కోట్ల మేర పెరిగి రూ.11.64 లక్షల కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.33,060 కోట్ల పెరుగుదలతో రూ.6.43 లక్షల కోట్లకు చేరింది.

ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.16,084 కోట్ల పెరుగుదలతో రూ.10.12 లక్షల కోట్లకు చేరగా, ఎల్ఐసీ విలువ రూ.8,602 కోట్ల పెరిగి రూ.5.44 లక్షల కోట్లకు చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.7,665 కోట్ల పెరిగి రూ.12.34 లక్షల కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.6,461 కోట్ల పెరిగి రూ.5.17 లక్షల కోట్లకు చేరింది. అయితే లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ రూ.26,572 కోట్ల మేర తగ్గి రూ.5.54 లక్షల కోట్లకు పడిపోయింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.18,946 కోట్ల మేర తగ్గి రూ.17.65 లక్షల కోట్లకు చేరగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలువ రూ.4,846 కోట్ల మేర తగ్గింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ విలువ కూడా స్వల్పంగా రూ.1,031 కోట్ల మేర తగ్గింది. మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అగ్రస్థానాన్ని కొనసాగిస్తుండగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎల్ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# మూడు బ్యూటీక్రీమ్‌లపై మహారాష్ట్ర ఎఫ్‌డిఎ నిషేధం




**ముంబయి, జులై 5:** మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ పరీక్షల్లో గోరీ బ్యూటీ క్రీమ్, ఫేస్ ఫ్రెష్ గోల్డ్ బ్యూటీ క్రీమ్ అండ్ సీరమ్, గోల్డెన్ స్టార్ బ్యూటీ క్రీమ్ నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించింది. వీటిలో పాదరసం, సీసం మోతాదులు అనుమతించిన పరిమితికి మించి ఉన్నాయని ఈ క్రీములను ఎక్కువ కాలం ఉపయోగిస్తే మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, చర్మంపై తీవ్రమైన దుష్ప్రభావాలు కలిగే ప్రమాదం ఉందని ఎంఎఫ్‌డీఏ హెచ్చరించింది. అందువల్ల ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, వినియోగించడం, విక్రయించడం, పంపిణీ చేయడం తక్షణమే నిలిపివే యాలని సూచించింది. ఈ ఉత్పత్తుల ప్యాకెట్లపై తయారీదారు పేరు, చిరునామా, బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ వంటి తప్పనిసరి వివరాలు కూడా లేవని అధికారులు గుర్తించారు.

దీంతో రిటైలర్లు, హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఈకామర్స్ సంస్థలు ఈ ఉత్పత్తుల విక్రయాలను వెంటనే నిలిపివేయాలని ఎంఎఫ్‌డీఏ ఆదేశించింది. మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్న స్టాక్ వివరాలతో పాటు మిగిలిన నిల్వలపై నివేదిక సమర్పించాలనిఆదేశించింది.

# మూడునెలల్లో ఫాక్స్‌కాన్ రాబడులు 40% వృద్ధి

**న్యూఢిల్లీ, జులై 5:** ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ ఎలక్ట్రానిక్స్ తయారీసంస్థ ఫాక్స్‌కాన్ ఆర్థిక ఫలితాల్లో భారీ వృద్ధి నమోదు చేసింది. కృత్రిమ మేధస్సు (ఏఐ)సర్వర్లకు పెరిగిన డిమాండ్‌తో పాటు వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ వ్యాపారం పుంజుకోవడంతో కంపెనీ ఆదాయం దాదాపు 40 శాతం పెరిగింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రెండో త్రైమాసికంలో ఫాక్స్‌కాన్ ఆదాయం 2.513 ట్రిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 39.8 శాతం వృద్ధి. ప్రపంచ ప్రముఖ ఏఐ చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాకు ఏఐ సర్వర్ల ప్రధాన సరఫరా దారుగా, ఆపిల్ ఐఫోన్‌ల అతిపెద్ద తయారీ సంస్థగా ఉన్న ఫాక్స్‌కాన్‌కు ఏఐ ఉత్పత్తులపై పెరిగిన డిమాండ్ భారీగా కలిసి వచ్చింది. క్లౌడ్, నెట్‌వర్కింగ్ విభాగంలో ఏఐ సర్వర్ల విక్రయాలు బలంగా పెరగడంతో ఆదాయం గణనీయంగా పెరిగిందని కంపెనీ తెలిపింది. ఐఫోన్ స్మార్ట్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం కూడా ఏడాది ప్రాతిపదికన మంచి వృద్ధిని నమోదు చేసింది. జూన్ నెలలో మాత్రమే కంపెనీ ఆదాయం 821.8 బిలియన్ తైవాన్ డాలర్లకు చేరుకుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.